www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 147
శనివారం | 24-8-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: పంచమి ఉ. 7.52, షష్ఠి తె.5.30 వరకు; నక్షత్రం: అశ్వని సా. 6.06 తదుపరి భరణి, వర్జ్యం: మ.2.24-3.52, తె.3.09-4.40, దుర్ముహూర్తం: ఉ.6.03-7.43, అమృతఘడియలు: ఉ.11.26-12.55, రాహుకాలం: ఉ.9.00-10.30, సూర్యోదయం: 6.03, సూర్యాస్తమయం: 6.31
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇంటింటికి ఇంటర్నెట్!



₹300 లకే..

93 లక్షల కుటుంబాలకు ఇవ్వాలనుకుంటున్నాం

అందులోనే కేబుల్ టీవీ, పిల్లలకు బడి పాఠాలు

ఈ పథకానికి వడ్డీ లేకుండా రూ.1779 కోట్లు ఇవ్వండి

కేంద్ర మంత్రి సింధియాతో భేటీలో సీఎం రేవంత్ విజ్ఞప్తి

క్రీడా వర్సిటీకి ఆర్థిక సాయం చేయండి

క్రీడా సంస్థల ఆధునికీకరణ డీపీఆర్‌లు ఆమోదించండి

ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీల నిర్వహణ అవకాశమివ్వండి

కేంద్ర క్రీడా మంత్రి మాండవీయను కోరిన సీఎం

రేవంత్‌తో పాటు భేటీల్లో మంత్రులు భట్టి, జూపల్లి



కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

న్యూఢిల్లీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): టీ-ఫైబర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ వ్యాప్తంగా 93 లక్షల ఇళ్లకు నెలకు రూ.300కే ఫైబర్ కనెక్షన్ ఇవ్వాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 63 లక్షల ఇళ్లు, పట్టణ ప్రాంతాల్లో 30 లక్షల ఇళ్లకు నెలకు రూ. 300కే ఇంటర్నెట్, కేబుల్ టీవీ, ఈ-ఎడ్యుకేషన్ సేవలు అందిస్తామని చెప్పారు. టీ -ఫైబర్ ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాలకు ఆప్టికల్ ఫైబర్ కనెక్టివిటీని కల్పించడం తమ లక్ష్యమన్నారు. శుక్రవారం ఢిల్లీలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు కేంద్ర మంత్రి సింధియాతో భేటీ అయ్యారు. రూ.1779 కోట్ల పెట్టుబడులతో ప్రతిపాదించిన టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.530 కోట్లను వివిధ ఆర్థిక సంస్థల ద్వారా సమీకరించిందని వివరించారు. మొత్తం పెట్టుబడి వ్యయం రూ.1,779 కోట్లను యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ (యూఎస్‌ఎఫ్‌ఓ) ద్వారా వడ్డీ లేకుండా దీర్ఘకాలిక రుణంగా ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. టీ-ఫైబర్ ద్వారా 65,500 ప్రభుత్వ సంస్థలకు జీ2జీ (గవర్నమెంట్ టూ గవర్నమెంట్), జీ2సీ (గవర్నమెంట్ టూ సిటీజన్) కనెక్టివిటీ కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలో 300 రైతు వేదికలకు టీ-ఫైబర్ ద్వారా

మిగతా 13వ పేజీలో...



నేడో రేపో పీసీసీకి కొత్త అధినేత!

రాష్ట్ర అగ్రనేతలకు వెల్లడించిన పార్టీ అధిష్ఠానం

మంత్రివర్గ జాబితాపై కూడా వారితో కసరత్తు

వేర్వేరుగా, కలిసికట్టుగా అభిప్రాయాల సేకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పీసీసీ అధ్యక్షుడిగా ఎవరిని నియమించాలనే అంశంపై ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర అగ్రనేతలకు చెప్పినట్లు తెలిసింది. మంత్రివర్గ జాబితాపై కూడా ఆ నేతలతో కసరత్తు జరిపిన అధిష్ఠానం.. సాధ్యమైనంత త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామకం, నామినేటెడ్ పోస్టుల భర్తీపై అధిష్ఠానంతో చర్చలు జరిపేందుకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీకి చేరుకున్న సంగతి తెలిసిందే. శుక్రవారం మధ్యాహ్నం వారితో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ సంస్థాగత

మిగతా 13వ పేజీలో...

స్నేహితుడిలా తోడ్పడతా

రష్యాతో చర్చలకు నా వంతుగా సహకరిస్తా

మాది తటస్థ వైఖరి కాదు.. శాంతి పక్షం

సమయం వృథా చేయొద్దు.. మాట్లాడుకోండి

జెలెన్‌స్కీ, భారత్‌కు రండి.. మోదీ ఆహ్వానం

సాగు, ఆరోగ్యం, సాయంపై ఒప్పందాలు!

అమరుల స్మారకం వద్ద జెలెన్‌స్కీతో ఆలింగనం

యుద్ధం అంతానికి ఆశారేఖ: యూఎన్

అప్పుడు పుతిన్‌తో.. ఇప్పుడు జెలెన్‌స్కీతో మోదీ ఆలింగనం.. విమర్శలకు చెక్

12



కీవ్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ప్రధాని మోదీ

గర్భస్రావాల గుట్టు రట్టు

ప్రపంచంలోనే తొలిసారి

కొత్త జన్యు వ్యాధిని గుర్తించిన నిమ్స్, సీడీఎఫ్‌డీ పరిశోధకులు

'సెర్పిన్ ఎ11' జన్యు ఉత్పరివర్తనంతో పెరుగుతున్న అబార్షన్ ముప్పు

శిశువు జన్మించినా.. కొద్దిరోజులకే చనిపోయే ప్రమాదం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డౌన్స్ సిండ్రోమ్, క్లైన్‌ఫెల్టర్ సిండ్రోమ్.. ఇలా ప్రపంచంలో ఇప్పటిదాకా గుర్తించిన జన్యు వ్యాధులు దాదాపు 6000 నుంచి 7000 దాకా ఉంటాయని అంచనా! తాజాగా.. మన నిమ్స్‌లోని మెడికల్ జెనెటిక్స్ విభాగం వైద్యులు, హైదరాబాద్‌లోని 'సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నొస్టిక్స్ (సీడీఎఫ్‌డీ)' పరిశోధకులు కలిసి ఒక కొత్త జన్యువ్యాధిని గుర్తించారు. 'సెర్పిన్ ఏ 11' అనే జన్యువులో వచ్చే ఉత్పరివర్తనం కారణంగా ఈ వ్యాధి వస్తుందని.. దీనిబారిన పడిన శిశువుల శరీర కుహరాల్లో (ఉదర కుహరం, పిండ కోశం, నాసికా కుహరం, కర్ణభేరి కుహరం వంటివాటిలో), అవయవాల్లో నీరు

మిగతా 13వ పేజీలో...

స్పీడ్-19



మూసీ తీర ప్రాంతం

'స్మార్ట్, ప్రొయాక్టివ్, ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ'

మూసీ రివర్‌ఫ్రంట్ సహా 19 ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

పనులు వేగంగా పూర్తయ్యేలా స్వయంగా ముఖ్యమంత్రి చొరవ

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మూసీ రివర్‌ఫ్రంట్ సహా పంతొమ్మిది అభివృద్ధి ప్రాజెక్టులపై సర్కారు ప్రత్యేకంగా దృష్టి సారించింది. నిర్ణీత వ్యవధిలో ఆ ప్రాజెక్టుల పూర్తికి.. స్పీడ్ (స్మార్ట్, ప్రొయాక్టివ్, ఎఫీషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) పేరుతో వేగవంతమైన, సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా.. ఈ ప్రాజెక్టుల అమలును స్వయంగా ముఖ్యమంత్రే పర్యవేక్షిస్తారు. సంబంధిత విభాగాల అధికారులతో నెలకు ఒకసారి సమావేశమై పురోగతిని సమీక్షిస్తారు. ఈమేరకు.. 'స్పీడ్' కింద ప్రతిపాదించిన ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను తయారు చేయాల్సిందిగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణాలకే పరిమితం కాకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధి పనులపై 'స్పీడ్' దృష్టి కేంద్రీకరించనుంది. ఈ మిషన్‌లో భాగంగా చేపట్టే ప్రతి పనికీ సంబంధించి

మిగతా 2వ పేజీలో...

సుందిళ్ల నిర్మాణ స్థలాన్ని పరిశీలించలేదు!

కాళేశ్వరం సీఈ ఇచ్చిన సమాచారం ఆధారంగానే డిజైన్లు

ఎన్ఐటీ నివేదికతో షీట్‌పైల్స్ బదులు సీకెంట్‌పైల్స్ వినియోగం

కాళేశ్వరం కమిషన్‌కు తెలిపిన మాజీ ఎస్ఈ అబ్దుల్ ఫజల్



అబ్దుల్ ఫజల్

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సుందిళ్ల బ్యారేజీ కట్టిన స్థలాన్ని తాము పరిశీలించలేదని, కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్ (సీఈ) నల్లా వెంకటేశ్వర్లు ఇచ్చిన సమగ్ర సమాచారం ఆధారంగా డిజైన్లు సిద్ధం చేశామని నీటిపారుదల శాఖలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) మాజీ ఎస్ఈ మహ్మద్ అబ్దుల్ ఫజల్ తెలిపారు. శుక్రవారం కాళేశ్వరం విచారణ కమిషన్ నిర్వహించిన ఓపెన్ కోర్టులో ఆయన విచారణకు హాజరయ్యారు. కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్ (రామగుండం) సాంకేతిక అనుమతి, హైపవర్ కమిటీ సిఫారసుల ప్రకారం సుందిళ్ల బ్యారేజీ నిర్మాణంపై నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. వరంగల్ ఎన్ఐటీ జియో టెక్నికల్ నివేదిక ఆధారంగా షీట్‌పైల్స్ ప్రతిపాదన

మిగతా 2వ పేజీలో...



అనిల్ అంబానీపై సెబీ వేటు

నిధుల మళ్లింపు అంశంలో రూ.25 కోట్ల జరిమానా

ఐదేళ్ల మార్కెట్‌లో పాల్గొనకుండా నిషేధం

రిలయన్స్ గ్రూప్ షేర్లు ఢమాల్

11

హైడ్రా అలజడి!

గత 111 జీవో పరిధిలో ఉన్న గ్రామాలకూ హైడ్రాను విస్తరించే యోచనలో ప్రభుత్వం

బీఆర్ఎస్ హయాంలో జీవో రద్దుతో ఆ గ్రామాల్లో భూములకు రెక్కలు.. నిర్మాణాలు

హైడ్రా పరిధిలోకి వస్తే.. తిరిగి పాత నిబంధనలు వస్తాయన్న ఆందోళనలో ప్రజలు

స్థానిక ఎన్నికల్లో ఇది తమకు నష్టం కలిగిస్తుందంటున్న కాంగ్రెస్ నేతలు

ఇప్పటికే జీహెచ్ఎంసీలో 45 గ్రామాల విలీనం ప్రతిపాదన

వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించిన పలువురు

గత 111 జీవో పరిధిలోని భూములు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

ఒకప్పుడు 111జీవో పరిధిలో ఉండి.. గత ప్రభుత్వ హయాంలో ఆంక్షలు తొలగించిన గ్రామాల్లో ఇప్పుడు కొత్త ఆందోళన మొదలైంది. హైదరాబాద్‌లో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, పార్కుల్లో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాను.. గతంలో 111జీవో పరిధిలో ఉన్న గ్రామాలకు

మిగతా 2వ పేజీలో...

గొళ్లెం లేని తలుపు.. ఐనా దారుణం!

కోల్‌కతా హత్యాచారం కేసులో కొత్త వివరాలు

హాల్ తలుపు బోల్ట్ గతంలోనే విరిగింది

దారుణం జరుగుతుంటే బయట కాపలా కాశారా?

ఆక్రందనలు ఎవరికీ వినిపించలేదా?

పరిశీలిస్తున్న సీబీఐ

2 వారాల జ్యుడిషియల్ కస్టడీకి నిందితుడు

12

టేప్ తెచ్చుకుని కొలుచుకోండి!



చెరువు బఫర్ జోన్లో నా ఇల్లు ఉంటే కూల్చండి.. కేటీఆర్‌కు సవాల్

రూ.2 లక్షలు దాటిన రుణాల మాఫీ తేదీ త్వరలో ప్రకటిస్తాం

దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ రెవెన్యూ చట్టం

సీఎం చేతుల మీదుగా జేఎన్‌జే హౌసింగ్ సొసైటీకి స్థలం

విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

3

సుందిళ్ల నిర్మాణ స్థలాన్ని పరిశీలించలేదు!

(మొదటిపేజీ తరువాయి)

పక్కనపెట్టి, సీకెంట్ ఫైల్స్‌ను సుందిళ్ల నిర్మాణంలో వినియోగించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఫజల్ గుర్తు చేశారు. బ్యారేజీకి అదనపు వెంట్‌లపై నిర్ణయం తీసుకున్నది ఎవరని కమిషన్ ఆరా తీయగా.. బ్యారేజీకి 58 గేట్లతో పాటు 10 స్లూయిస్‌ల కోసం మాత్రమే తాము డిజైన్లు/డ్రాయింగ్‌లు చేశామని బదులిచ్చారు. అదనపు వెంట్ ప్రతిపాదన కానీ, దానికి డిజైన్లు సిద్ధం చేయాలనే ఫైలు ఏదీ కూడా తమకు రాలేదని, అదనపు వెంట్ నిర్మాణంపై నిర్ణయం క్షేత్రస్థాయిలోని అధికారులే తీసుకున్నారని చెప్పారు. 2డీ నమూనా అధ్యయనాల ఆధారంగానే సుందిళ్ల బ్యారేజీ డిజైన్లు/డ్రాయింగ్‌లు సిద్ధం చేశామని చెప్పారు. డిజైన్లు, నిర్మాణానికి సంబంధం లేదని గుర్తుచేశారు. డిజైన్లు చేయడానికే సీడీవో విభాగం పరిమితమవుతుందని, నిర్మాణంలో నిర్ణయాలన్నీ క్షేత్రస్థాయి అధికార వ్యవస్థలవేనని తెలిపారు.

హరిరామ్ లేఖను అందించిన మాజీ ఈఎన్‌సీ

కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)కి డిజైన్లను పంపించే ముందు కాళేశ్వరం డీపీఆర్‌లోని చెక్‌లిస్ట్‌లోని హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్లకు సంబంధించిన అంశాల బాధ్యత తనదేనని కాళేశ్వరం(హైదరాబాద్) సీఈ బి.హరిరామ్ 2017 ఫిబ్రవరి 20న రాసిన లేఖను శుక్రవారం కాళేశ్వరం కమిషన్‌కు మాజీ ఈఎన్‌సీ (సీడీవో) ఎ.నరేందర్‌రెడ్డి అందించారు. గురువారం విచారణ క్రమంలో మిగిలిపోయిన కొన్ని అంశాలకు సంబంధించిన సమాచారాన్ని శుక్రవారం కమిషన్‌కు అందజేశారు. గేట్లను మెకానికల్‌గా 2 మీటర్లకు మించి లేపడానికి వీల్లేదనే సమాచారం నిజమేనా అని కమిషన్ కోరగా ఆ సమాచారానికి సంబంధించిన పత్రాలు కూడా ఇచ్చారు.

తదుపరి విచారణ 27న

తదుపరి విచారణ ప్రక్రియ ఈ నెల 27న జరగనుంది. ఆ రోజు ఏకంగా డిజైన్లు/డ్రాయింగ్‌లతో ముడిపడిన నలుగురు అధికారులను విచారించాలని కమిషన్ యోచిస్తున్నట్లు సమాచారం.

రుణ యాప్‌ల కేసులో
ఈడీ చార్జిషీట్ దాఖలు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రుణ యాప్‌ల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు నాంపల్లి ఈడీ ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 2020-21లో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో నమోదైన కేసుల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టింది. రిజర్వు బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకింగ్‌యేతర సంస్థలు, ఫిన్‌టెక్ కంపెనీల పేర్లతో రుణ యాప్‌లు నిర్వహించి అధిక వడ్డీలు, ప్రాసెసింగ్ ఫీజుల పేరుతో ప్రజల్ని మోసం చేసినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో ఇప్పటి వరకు రూ. 346.86 కోట్లను స్తంభింపజేసింది.



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన జీనోమ్ ఫౌండేషన్ వైద్యుల బృందం

హైదరాబాద్‌లో జెనోమిక్ వెల్నెస్ క్లినిక్

- అక్టోబరు 9న శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్
- జీనోమ్ ఫౌండేషన్ వెల్లడి.. సీఎంను కలిసిన వైద్యులు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న జెనోమిక్ వెల్నెస్ క్లినిక్‌కు అక్టోబరు 9న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు జీనోమ్ ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. డాక్టర్ కేపీసీ గాంధీ నాయకత్వంలో నగరంలోని జీనోమ్ ఫౌండేషన్ (జీఎఫ్)కు చెందిన ప్రసిద్ధ శాస్త్రవేత్తలు, వైద్యుల బృందం గురువారం సీఎం రేవంత్ రెడ్డితో ఆయన కార్యాలయంలో సమావేశమైంది. జీనోమ్ ఫౌండేషన్‌లో కొనసాగుతున్న కార్యకలాపాల గురించి వైద్యులు వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి కాంగ్రెస్ సర్కారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలో జీనోమ్ ఫౌండేషన్‌కు 4.13 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రతిపాదిత కేంద్రానికి అత్యాధునిక సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను కల్పించడానికి కొత్త భవన సముదాయానికి శంకుస్థాపన చేయాలని బృందం ముఖ్యమంత్రిని అభ్యర్థించింది. అందుకు సీఎం సానుకూలంగా స్పందించారని, తమ ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారని జీనోమ్ ఫౌండేషన్ పేర్కొంది. ఈ అధునాతన వైద్య సౌకర్యం రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా ఉప్పల్, వరంగల్ హైవే జోన్లో, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే గ్రామీణ రోగులకు ఉపయోగపడుతుందని వెల్లడించింది. సీఎంను కలిసిన బృందంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ బి. సోమరాజు, కార్డియోథొరాసిక్ సర్జన్, నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ డి. ప్రసాదరావు, బయోఏషియా, ఎఫ్ఏబీపీ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పి. రెడ్డన్న, అమెరికాకు చెందిన ప్రముఖ క్లినికల్ ఇమ్యునాలజిస్ట్ డాక్టర్ కొసరాజు ఆర్. రావు, నేచురోపతి సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కార్తీక్ ఉన్నారు.

కేంద్ర హోం శాఖ వెబ్‌సైట్‌లో.. బండి సంజయ్ వివరాలు నమోదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వివరాలను ఆ శాఖ వెబ్‌సైట్‌లో ఎట్టకేలకు నమోదు చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రిగా అమిత్ షా.. సహాయ మంత్రులుగా నిత్యానంద రాయ్, బండి సంజయ్ ఉన్నారు. అయితే బిహార్‌కు చెందిన నిత్యానంద రాయ్ సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ప్రదర్శించినా.. తెలంగాణకు చెందిన బండి సంజయ్‌ను విస్మరించారు. దీనిపై 'హోం శాఖలో సంజయ్ ఎక్కడ' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో కేంద్ర ప్రభుత్వ తీరుపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. తెలంగాణకు చెందిన బీజేపీ ఎంపీ కేంద్ర మంత్రి మండలిలో ఉన్నా.. సరైన గౌరవం దక్కడం లేదని నెటిజన్లు మండిపడ్డారు. స్పందించిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ శుక్రవారం బండి సంజయ్ వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

బుద్ధవనంలో త్వరితంగా కుటీరాల నిర్మాణం

- బుద్ధవనాన్ని పరిశీలించిన పర్యాటక అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్‌లో సుమారు 274 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన బుద్ధవనం ప్రాజెక్టులో ప్రతిపాదించిన పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటక శాఖ నిర్ణయించింది. ఆసియాలోనే అతిపెద్ద బౌద్ధక్షేత్రంగా గుర్తింపు పొందిన బుద్ధవనాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిద్దిడానికి ప్రతిపాదించిన బౌద్ధ కుటీరాలు, మహాస్తూపం నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. బుద్ధవనం ప్రాజెక్టు మెంటార్‌గా నూతనంగా నియమితులైన సి.అంజనేయరెడ్డితో కలిసి పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణీప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్‌రెడ్డి బుద్ధవనాన్ని పరిశీలించారు.

సమ్మె విరమించిన జూడాలు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జూనియర్ డాక్టర్ల (జూడా) అసోసియేషన్ సమ్మె విరమించింది. కోల్‌కతాలోని ఆర్జీకర్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార సంఘటన నేపథ్యంలో ఈ నెల 14న సమ్మె నోటీసు ఇచ్చారు. తాము లేవనెత్తిన డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందున సమ్మె విరమిస్తున్నట్లు జూడాల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి ఔట్ పేషెంట్, వార్డు విధులు, అత్యవసరం సహా అన్ని వైద్య సేవలకు అంతరాయం లేకుండా పని చేస్తాయని ప్రకటించారు.

ప్రభుత్వ పశువైద్యశాలల్లో మందుల్లేవు

- సంచార వైద్యశాలల పరిస్థితీ అంతే..సీఎంకు హరీశ్ లేఖ

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకితే తగిన వైద్యం అందించడానికి ప్రభుత్వ పశు వైద్యశాలల్లో మందుల్లేవని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఎమర్జెన్సీ మందులు సహా పెయిన్ కిల్లర్స్, విటమిన్స్, యాంటీ బయాటిక్స్ వంటి అన్ని రకాల మందుల సరఫరా 9 నెలలుగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. పాలిచ్చే జీవులకు పొదుగు వాపు, గాలి కుంటు వ్యాధులు సోకితే ఒక్కో మూగ జీవిపై పాడి రైతులు రూ.2 వేల దాకా ఖర్చుచేయాల్సి వస్తుందని, ఇది అదనంగా ఆర్థిక భారమవుతుందన్నారు. తక్షణమే ఆస్పత్రుల్లో మందులు సమకూర్చాలని శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. 9 నెలల నుంచి నట్టల నివారణ మందులు సరఫరా చేయకపోవడంతో పశువులు రక్తహీనతకు గురవుతున్నాయని పేర్కొన్నారు. అనారోగ్యం పాలైన మూగజీవాల వద్దకే వైద్య సిబ్బంది వెళ్లి తక్షణ చికిత్స అందించేందుకు గాను గతంలో 1962 నెంబర్‌తో పశువైద్య సంచార వాహనాలను ఏర్పాటు చేయగా.. వాటిలోనూ మందుల కొరత కారణంగా మూగజీవుల ప్రాణాలకు ముప్పు ఏర్పడిందన్నారు. మరోవైపు వాహన ఉద్యోగులు సకాలంలో వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే గొర్రెల పంపిణీ అటకెక్కిందని, చేపల పంపిణీ ఆలస్యం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా చేపపిల్లల పంపిణీ చేపట్టాలని ఆయన కోరారు.

కవితతో హరీశ్ రావు ములాఖత్

న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై తిహాడ్ జైలులో ఉన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు కలిశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు తిహాడ్ జైలులో కవితతో హరీశ్ రావు ములాఖత్ అయ్యారు. సుమారు 20 నిమిషాల పాటు కవితతో మాట్లాడారు. కవిత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీర్ఘకాలికంగా గైనిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆరోగ్య పరిస్థితి, వైద్య పరీక్షలు, జైలులో వసతులు, మందులు తదితర అంశాలపై కవితతో హరీశ్ రావు చర్చించినట్టు తెలిసింది. ఈ నెల 27న కవిత బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. ఈ సారి తప్పనిసరిగా బెయిల్ వస్తుందని, ఇప్పటికే న్యాయ నిపుణులతో చర్చించామని కవితకు హరీశ్ రావు ధైర్యం చెప్పినట్టు సమాచారం.

ఏసీబీ వలలో వాణిజ్య పన్నుల అధికారిణి

- రూ. 35 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఓ సంస్థ ఖాతా పుస్తకాల్లో అవకతవకలను కప్పిపుచ్చేందుకు లంచం తీసుకుంటున్న వాణిజ్య పన్నుల ఉప అధికారిణి బి. వసంత ఇందిరను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. నారాయణగూడ సర్కిల్ వాణిజ్య పన్నుల కార్యాలయంలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. తమకు అందిన ఫిర్యాదు మేరకు కాపు కాచిన రంగారెడ్డి యూనిట్-1 ఏసీబీ అధికారులు రూ. 35 వేల లంచం తీసుకుంటున్న ఆమెను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారమందించాలని ఏసీబీ అధికారులు కోరారు.

హైడ్రా అలజడి!



(మొదటిపేజీ తరువాయి)

కూడా విస్తరింపజేయనుందన్న ప్రచారమే ఈ ఆందోళనకు కారణం. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలాశయాల పరివాహక ప్రాంతాల్లోని 84 గ్రామాల్లో నిర్మాణాలపై ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం ఆంక్షలు విధిస్తూ 111జీవోను తీసుకువచ్చింది. దీంతో ఆ గ్రామాలన్నీ బఫర్ జోన్ కిందికి వెళ్లాయి. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దీనిని రద్దు చేయడంతో ఆ గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఆ ప్రాంతాల్లో భూముల ధరలు కూడా పెరిగాయి. కానీ, జంట జలాశయాల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ఇందుకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ కూడా విడుదల చేస్తామని చెప్పిన అప్పటి ప్రభుత్వం.. ఆ తరువాత దానిని పట్టించుకోలేదు. దీంతో ఆ ప్రాంతాల్లో భూముల క్రయ విక్రయాలు జరగడంతోపాటు అక్కడక్కడ నిర్మాణాలు కూడా వచ్చాయి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ ప్రాంతాలపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగిస్తుందని అందరూ భావించారు. అయితే.. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, పార్కుల్లో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకంటూ ప్రభుత్వం ఇటీవల హైడ్రాను ఏర్పాటు చేసింది. జీహెచ్‌ఎంసీతోపాటు ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న పట్టణ, గ్రామీణ ప్రాంతాలను కలిపి తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీసీయూఆర్)గా పేర్కొంటూ.. వీటిని హైడ్రా పరిధిలోకి తీసుకువచ్చింది. ఆయా ప్రాంతాల్లోని చెరువులు, నాలాలు, పార్కులు, లే అవుట్‌లోని ఓపెన్ స్పేస్‌లు, ఆట స్థలాలు, రహదారులు, ఫుట్‌పాత్‌ల పరిరక్షణ, వాటిలోని ఆక్రమణల తొలగింపు బాధ్యతలను హైడ్రాకు అప్పగిస్తూ జీవో తీసుకువచ్చింది. సమర్థులైన అధికారులను నియమించింది.

ఆందోళనలో 84 గ్రామాల ప్రజలు..

హైడ్రాలో.. విధుల్లో చేరిన అధికారులు వెంటనే రంగంలోకి దిగి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, పార్కుల్లో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తూ అక్రమార్కులకు దడ పుట్టిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. హైడ్రా పరిధిని గతంలో 111జీవో పరిధిలో ఉన్న గ్రామాలకు విస్తరించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్న ప్రచారం ఈ 84 గ్రామాల ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రాంతాలను హైడ్రా పరిధిలోకి తెస్తే.. ప్రస్తుతం అక్కడ ఏర్పాటైన నిర్మాణాలను ఏం చేస్తారనే దానిపై స్పష్టత లేదు. కానీ, తమ ప్రాంతంలో మళ్లీ ఆంక్షలు విధించేందుకే హైడ్రాను తీసుకురావాలనుకుంటున్నారా.. అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ ప్రాంతాల్లో పర్యావరణవేత్తల బృందం పర్యటనకు వస్తే కూడా స్థానికులు అడ్డుకున్నారు. పక్కనే ఉన్న మోకిల గ్రామంలో ఎకరా భూమి ధర రూ.20 కోట్లు పలుకుతుంటే తమ గ్రామాల్లో భూములకు అందులో పది శాతం ధర కూడా రావడం లేదని వాపోయారు. "మా జీవితాలు బాగుపడవద్దా? మా పిల్లలు ఉన్నత చదువులు చదువుకోకూడదనుకుంటున్నారా?" అంటూ స్థానికులు ప్రశ్నించడంతో పర్యావరణవేత్తలు వెనక్కి వెళ్లిపోయారు.

ప్రతిపక్షాలకు అస్త్రమవుతుందా?

నగర శివార్లలో ఔటర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న 45 గ్రామాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రతిపాదనపై కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీనిపై ఇప్పటికే కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. శివారు గ్రామాల విలీనంతోపాటు తాజాగా హైడ్రాను 111జీవో పరిధిలోని గ్రామాలకు విస్తరిస్తారనే ప్రచారంతో అలజడి రేగుతోంది. మరోవైపు.. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో రాజకీయంగా తమకు తీవ్ర నష్టం జరుగుతుందని అధికార పార్టీ నేతలు కూడా ఆందోళన చెందుతున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సర్కారు నిర్ణయాలు తమ పార్టీకి తీరని నష్టం చేస్తాయని పార్టీ పెద్దలు చెబుతున్నారు. ఎన్నికల్లో ప్రతిపక్షాలు వీటిని ప్రచార అస్త్రాలుగా మలుచుకుంటే.. సర్పంచులను గెలిపించుకోవడం కష్టమవుతుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన కాంగ్రెస్ ముఖ్యనేత ఒకరు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలకు ముందు ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే పార్టీకే నష్టమన్నారు. ఇప్పుడిప్పుడే 111జీవో పరిధిలోని ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయని, మళ్లీ ఇదేమిటని గ్రామాల్లో అందరూ తమను ప్రశ్నిస్తున్నారని ఆయన వాపోయారు. దీనికితోడు శివారు గ్రామాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ సమాయాత్తమవుతోంది. ఇపుడు హైడ్రాను 111జీవో పరిధిలోకి విస్తరిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో దీనిపై కూడా ఆందోళన చేయాలని బీఆర్‌ఎస్ నాయకత్వం భావిస్తోంది.

కాలం చెల్లిన మందులను పారేయండి

- అలాంటి ఔషధాలు ఉంటే చర్యలు తప్పవు
- వైద్య అధికారులకు డీహెచ్ ఆదేశాలు
- అవసరం లేని మందులు కొని.. తమదే బాధ్యతంటే ఎలా అంటున్న అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య సంచాలకుల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాలం చెల్లిన ఔషధాలను తక్షణమే పారవేయాలని ప్రజారోగ్య సంచాలకుడు (డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్) రవీంద్రనాయక్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారులందరికీ సర్క్యులర్ జారీ చేశారు. కాలం చెల్లిన మందుల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని, వెంటనే వాటిని పారవేయడం లేదని పేర్కొన్నారు. కాలం చెల్లిన ఔషధాలను తక్షణమే డిస్పోజ్ చేయాలనే నియమానికి ఎవ్వరూ కట్టుబడి ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీల్లో కాలం చెల్లిన ఔషధాలు ఉన్నట్లు గుర్తించినట్లయితే బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల కాలం చెల్లిన ఔషధాలను రోగులకు వినియోగిస్తున్న ఘటన నిర్మల్ జిల్లాలో జరగ్గా.. ఆ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కాలం చెల్లిన ఔషధాలపై వైద్యశాఖ దృష్టి సారించింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. అసలు అవసరం లేని ఔషధాలను ఇష్టారాజ్యంగా భారీ మొత్తంలో కొనుగోలు చేసి, వాటిని ఆస్పత్రులకు పంపుతున్నారు.కొన్నిసార్లు ఇండెంట్ పెట్టకపోయినప్పటికీ టీజీఎంఎస్‌డీసీ నుంచి బలవంతంగా ఒత్తిడి చేసి వాటిని పంపిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో డీహెచ్ ఇచ్చిన సర్క్యులర్‌పై పీహెచ్‌సీ వైద్య అధికారులు, ఫార్మసిస్ట్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దోళ్లు చేసే తప్పులకు తమను ఎలా బాధ్యుల్ని చేస్తారని ప్రశ్నిస్తున్నారు. అవసరం లేని ఔషధాలను పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి, వాటిని గడువు తీరకముందే వాడాలంటే ఎలా? అని నిలదీస్తున్నారు. పైగా అలాంటి కాలం చెల్లిన మాత్రలు ఆస్పత్రుల్లో ఉంటే సంబంధిత వైద్యులను ఎలా బాధ్యుల్ని చేస్తారని ప్రశ్నిస్తున్నారు.



'మిసెస్ సౌత్ ఇండియా'గా హైదరాబాదీ వర్షారెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మిసెస్ సౌత్ ఇండియా- 2024 కిరీటం హైదరాబాద్‌కు చెందిన వర్షారెడ్డిని వరించింది. కోయంబత్తూర్‌లో ఇటీవల జరిగిన మిసెస్ సౌత్ ఇండియా పోటీల్లో ఆమె టైటిల్ విజేతగా నిలిచారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ నుంచి వెళ్లి టైటిల్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. మిస్ సౌత్ ఇండియా-2012 పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించిన తాను మిస్ కన్జెనియాలిటీ టైటిల్‌ను సంపాదించానని చెప్పారు. కాగా, వర్షారెడ్డి హైదరాబాద్‌లోని పలు ఐటీ కన్సల్టింగ్, డిజిటల్ మార్కెటింగ్, విదేశీ విద్య, హాస్పిటాలిటీ, సినిమా ప్రొడక్షన్ సంస్థలకు వైస్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్నారు.



గాంధీలో మంకీ పాక్స్ ప్రత్యేక వార్డు

అడ్డగుట్ట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మంకీపాక్స్ లక్షణాలున్న రోగుల కోసం గాంధీ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్లు ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి తెలిపారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర సూచనల మేరకు ముందు జాగ్రత్తగా ఐసోలేషన్ వార్డును సిద్ధం చేశామన్నారు. ఈ వార్డులో వైద్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని వెల్లడించారు.



స్పీడ్-19

(మొదటిపేజీ తరువాయి)

ఆయా విభాగాలు ప్రత్యేక ప్రణాళికలను తయారు చేస్తాయి. ఏ గడువులోపల ఎంత పని జరగాలి అనేదానిపై నిర్ణీత కాల వ్యవధిని అధికారులు నిర్దేశిస్తారు. ఎప్పటిలోగా ఆ పనులు పూర్తవుతాయనే అంచనాలను తయారు చేస్తారు. 'స్పీడ్' ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించేందుకు ఆయా విభాగాలు ప్రత్యేక విధానాన్ని అనుసరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్రమం తప్పకుండా పనితీరును సమీక్షించుకుని, పర్యవేక్షణకు ఏర్పాట్లు చేసుకోవాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేసింది. 'స్పీడ్' ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా ప్రణాళికా విభాగం ప్రత్యేక పోర్టల్‌ను నిర్వహిస్తుంది. రోజువారీ పనుల ప్రగతిని అందులో అప్‌లోడ్ చేస్తారు.

స్పీడ్-19 ప్రాజెక్టులు ఇవే..

- మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్
- శాటిలైట్ టౌన్‌ల అభివృద్ధి
- మెట్రో రైలు విస్తరణ
- జీహెచ్‌ఎంసీ పునర్వ్యవస్థీకరణ
- రీజినల్ రింగు రోడ్డు నిర్మాణం
- హైదరాబాద్ సిటీలో ఎలివేటెడ్ కారిడార్లు
- రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాలు
- ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం
- మహిళా శక్తి పథకం అమలు
- జిల్లా సమాఖ్య భవనాల నిర్మాణం
- రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్సుల నిర్మాణం
- అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సంస్థాగత అభివృద్ధి
- ఐటీఐలలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు
- కొత్తగా ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం
- 15 కొత్త నర్సింగ్, 28 కొత్త పారా మెడికల్ కళాశాలల నిర్మాణం
- ఆరోగ్య పర్యాటకానికి ప్రచారం
- ఎకో టూరిజం ప్రాజెక్టుల ప్రమోషన్
- టెంపుల్ సర్క్యూట్ టూరిజం
- మాదక ద్రవ్యాల నిరోధక వ్యూహాల అమలు

ప్రత్యేక యాప్‌తో..
రైతు కుటుంబాల నిర్ధారణ

ఇంకా 4.25 లక్షల కుటుంబాలను గుర్తించాల్సి ఉంది

- వ్యవసాయాధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు
- రూ.2 లక్షలకు మించిన రుణాలూ త్వరలో మాఫీ
- అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేస్తాం
- మంత్రి తుమ్మల వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పంట రుణాలు రూ.2లక్షల్లోపు బకాయిలున్న రైతుల్లో.. కుటుంబ నిర్ధారణ జరగని కుటుంబాలు 4,24,873 ఉన్నట్లుగా గుర్తించినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వీరి వివరాలను సేకరించి ఒక ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ చేస్తామని పునరుద్ఘాటించారు. శుక్రవారం వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, జాయింట్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌తో సచివాలయంలో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. రుణమాఫీకి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదుల సరళిని పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సాంకేతిక సమస్యలను పరిష్కరించుకుంటూ పెండింగ్‌లో ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. ఖాతాదారుల సమాచారాన్ని సేకరించేందుకు వీలుగా ఒక కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు, అందులో వివరాలు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయాధికారులు స్వయంగా రైతుల ఇళ్లకు వెళ్లడంతోపాటు రైతువేదికల వద్ద, వ్యవసాయశాఖ కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉండి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారని తెలిపారు. అదే క్రమంలో ఆధార్ వివరాలు తప్పుగా నమోదైన 1,24,545 ఖాతాల్లో.. ఇప్పటికే 41,322 ఖాతాలను సరిచేసినట్లు పేర్కొన్నారు. ఇక వివిధ బ్యాంకుల్లోని రైతుల ఖాతాల్లో ఇప్పటికే జమ చేసిన సొమ్మును.. తిరిగి రైతలకు కొత్తగా అప్పు రూపంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెన్యువల్ చేసిన రైతు ఖాతాల సొమ్మును తిరిగి చెల్లించేలా, రుణమాఫీ అయిన ఖాతాలకు సంబంధించి తిరిగి కొత్త రుణాలు మంజూరు చేసేలా బ్యాంకులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

రైతులకు తిరిగి రూ.10 వేల కోట్ల చెల్లింపు..

ప్రభుత్వం ఆగస్టు 15 లోపు జమ చేసిన రూ.18 వేల కోట్లలో.. తిరిగి రూ.10,400 కోట్లను రైతులకు రుణాల రూపంలో బ్యాంకులు చెల్లించాయని మంత్రి తుమ్మల తెలిపారు. మిగిలిన ఖాతాదారులకు కూడా కొత్త రుణాలు వెంటనే మంజూరు చేయాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, బ్యాంకు అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు. ఇక రూ.2 లక్షలకు మించి ఉన్న రుణాలను కూడా త్వరలో దశలవారీగా మాఫీ చేస్తామని ప్రకటించారు. సాంకేతిక కారణాలతో నిలిచిన ఖాతాలు, కుటుంబ నిర్ధారణ జరగని రైతులు.. తమ దగ్గరలోని వ్యవసాయశాఖ అధికారిని సంప్రదించాలని సూచించారు. ఒకవేళ రైతు కుటుంబాలకు సంబంధించి కుటుంబ నిర్ధారణ చేసే సమయంలో బ్యాంకర్లు ఏవైనా తప్పులు చేస్తే.. వాటిని సరిచేయాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

పిన్నెల్లికి బెయిల్

- పాస్‌పోర్టును స్వాధీనం చేయాలి
- వారానికోసారి పోలీస్ స్టేషన్‌కు రావాలి
- కోరినప్పుడు విచారణకు హాజరవ్వాలి: ఏపీ హైకోర్టు

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. చార్జిషీట్ దాఖలు చేసే వరకు వారానికి ఓసారి సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌వో) ముందు హాజరుకావాలని స్పష్టం చేసింది. అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లడానికి వీల్లేదని, పాస్‌పోర్టును సంబంధిత మేజిస్ట్రేట్ ముందు స్వాధీనం చేయాలని ఆదేశించింది. దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని పేర్కొంది. సాక్షులను ప్రభావితం చేయడం కానీ, బెదిరించడం కానీ చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. కేసుకు సంబంధించి మీడియాతో మాట్లాడానికి వీల్లేదని స్పష్టం చేసింది. జైలు నుంచి విడుదల అయిన తర్వాత ఎక్కడ నివాసం ఉంటున్నదీ, మొబైల్ నెంబర్ వివరాలను దర్యాప్తు అధికారులకు తెలియజేయాలని ఆదేశించింది. బెయిల్ షరతులు ఉల్లంఘించినప్పుడు, అలాంటి పరిస్థితులు తలెత్తినప్పుడు బెయిల్ రద్దు కోసం కోర్టును ఆశ్రయించేందుకు పోలీసులు హైకోర్టు స్వేచ్ఛనిచ్చింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు శుక్రవారం తీర్పు ఇచ్చారు. అయితే, ఎస్‌హెచ్‌వో విచారణకు హాజరుకావాలనప్పుడు పిటిషనర్ తన న్యాయవాదిని తీసుకెళ్లేందుకు అనుమతించాలని అభ్యర్థించగా.. దీనికి ప్రత్యేక పిటిషన్ వేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

ఇదీ కేసు..

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మే 13న మాచర్లలోని పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వీవీప్యాట్‌ల ధ్వంసం, టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడితోపాటు మే 14న కారంపూడిలో సీఐపై దాడికి సంబంధించి నమోదైన కేసుల్లో ఇప్పటికే పిన్నెల్లి రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిన్నెల్లి హైకోర్టును ఆశ్రయించగా, షరతులతో కూడిన బెయిల్ లభించింది.

ఎసెన్షియా విషాదంపై

సీఎస్, డీజీపీకి ఎన్‌హెచ్ఆర్సీ నోటీసులు

» రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం
» మీడియా కథనాలు సుమోటోగా స్వీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ప్రమాద ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్సీ) స్పందించింది. రెండు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని శుక్రవారం ఏపీ సీఎస్, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 21న జరిగిన ప్రమాదంలో 17 మంది కార్మికులు మరణించారని, మరో 50 మంది గాయపడ్డారని మీడియాలో వచ్చిన వార్తలను కమిషన్ సుమోటోగా స్వీకరించింది. యాజమాన్యం భద్రతా నియమాలు, చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తోందా? అధికారులు పర్యవేక్షిస్తున్నారా? లేదా? దీనిపై తనిఖీ చేయడానికి సమగ్ర దర్యాప్తునకు ఆదేశిస్తూ సీఎస్, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించింది. క్షతగాత్రుల ఆరోగ్యం, చికిత్స, పరిహారం పంపిణీ, గాయపడిన వారితో పాటు చనిపోయిన కార్మిక కుటుంబాలకు అందించిన ఇతర ఉపశమనం, పునరావాసం, బాధ్యులైన అధికారులపై తీసుకున్న చర్యలు.. తదితర సమగ్ర వివరాలు నివేదికలో పొందుపరచాలని సూచించింది.

ఫుడ్ పాయిజన్ ఘటనల్లోనూ నోటీసులు

చిత్తూరు అపోలో హెల్త్ యూనివర్సిటీ, అనకాపల్లి జిల్లాలోని అనాథాశ్రమంలో కలుషిత ఆహారం ఘటనలపై మీడియాలో వచ్చిన వార్తలను జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఆ రెండు ఘటనలపై రెండు వారాల్లో సమగ్ర నివేదికలు సమర్పించాలని సీఎస్, డీజీపీలను ఆదేశించింది.

ఎసెన్షియా ఘటనలో ఖమ్మం వాసి మృతి


సురేంద్ర(ఫైల్)

అశ్వారావుపేట రూరల్: ఏపీలోని అనకాపల్లి సెజ్‌లో ప్రమాదం ఘటనలో అశ్వారావుపేట మండలానికి చెందిన మార్ని సురేంద్ర(37) ప్రాణాలు కోల్పోయాడు. గంగారం గ్రామానికి చెందిన సురేంద్ర చిన్న వయస్సులోనే తండ్రి చనిపోయాడు. తల్లి జమున సురేంద్రను ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) వరకు చదివించింది. తొమ్మిదేళ్లుగా అతడు గాజువాకలో ఉంటూ అనకాపల్లిలోని ఫార్మా కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి గంగారంలోనే ఉంటోంది. రోజులాగే బుధవారం కూడా పరిశ్రమకు బయల్దేరే ముందు సురేంద్ర తన తల్లికి ఫోన్‌చేసి రెండు రోజుల్లో ఇంటికి వస్తానని చెప్పాడు. కానీ, దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయాడు. శుక్రవారం గంగారంలో సురేంద్ర అంత్యక్రియలను నిర్వహించారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన మంద కృష్ణ

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో కోమటిరెడ్డిని మంద కృష్ణ బృందం కలిసింది. అంతకు ముందు వారు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాతో భేటీ అయ్యారు. వీలైనంత త్వరలో వర్గీకరణను అన్ని రంగాల్లో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రులను కలిసిన వారిలో విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎంపీ పసునూరి దయాకర్ ఉన్నారు.


పాఠశాల ముందు మంతన్‌గౌడ్ తండా వాసుల నిరసన

పాత సారొస్తేనే.. పిల్లలను బడికి పంపిస్తాం

» పాఠశాల ఎదుట తల్లిదండ్రుల నిరసన

బషీరాబాద్, ఆగస్టు 23: బదిలీపై వెళ్లిన సారును మళ్లీ తీసుకొస్తేనే తమ పిల్లలను పాఠశాలకు పంపిస్తామని తల్లిదండ్రులు పట్టుబట్టారు. ఆ ఉపాధ్యాయుడు వచ్చే వరకు పిల్లలను బడికి పంపించకుండా ఇళ్ల వద్దనే ఉంచుకుని పాఠశాల ఎదుట గ్రామస్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మంతన్‌గౌడ్‌తండాలోని ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడు శేషగిరి సాధారణ బదిలీల్లో భాగంగా మరో పాఠశాలకు వెళ్లిపోయారు. దీంతో నెలన్నర కాలంగా కొందరు విద్యార్థులు పాఠశాలకు సక్రమంగా వెళ్లడంలేదు. తమ పిల్లలతో మాట్లాడి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాత సారును తిరిగి ఇక్కడే నియమించాలని పట్టుబట్టారు. బషీరాబాద్ విద్యాధికారి సుధాకర్‌రెడ్డికి అప్పట్లో వినతి పత్రం అందజేశారు. స్పందన లేకపోవడంతో శుక్రవారం తమ పిల్లలను బడికి పంపించకుండా తల్లిదండ్రులు, గ్రామస్థులు ఏకమై నిరసనకు దిగారు.

ఉక్రెయిన్‌కు వెయ్యి కోట్ల సాయం

న్యూయార్క్, ఆగస్టు 23: అమెరికాలోని బైడెన్ ప్రభుత్వం ఉక్రెయిన్‌కు మరింత సాయం చేయాలని నిర్ణయించింది. 'కొత్త సైనిక సాయం' కింద 125 మిలియన్ డాలర్ల(సుమారు రూ.1047.61 కోట్లు) రక్షణ పరికరాలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఇతర వ్యవస్థలను అందించనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రష్యాతో యుద్ధం మరింత పెరిగిన నేపథ్యంలో ఉక్రెయిన్ పరిస్థితిని తాము అర్థం చేసుకున్నామని, అందుకే ఈ సాయం ప్రకటిస్తున్నామని ఆ వర్గాలు తెలిపాయి. ఈ నెల 24న(ఈరోజు) ఉక్రెయిన్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ప్రకటన చేయడం విశేషం.

త్రిపురలో వరదలు..22 మంది మృతి

న్యూఢిల్లీ, ఆగస్టు 23: త్రిపురలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఫలితంగా సంభవించిన వరదలు, కొండచరియలు విరిగిపడిన కారణంగా ఇప్పటివరకు 22మంది చనిపోయారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 17లక్షల మంది వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 65,400 మంది పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. 2032చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉందని, ప్రజలు సహాయ సిబ్బందికి సహకరించాలని సీఎం మాణిక్ సాహా కోరారు. త్రిపురలో సహాయ కార్యక్రమాల కోసం కేంద్రం రూ.40కోట్లు విడుదల చేసింది. సహాయ చర్యల్లో సైన్యం పాల్గొంటోంది.

ప్రభుత్వ సాయం పొందే స్కూళ్లు.. లౌకిక విధానాలు అనుసరించాలి

చెన్నై, ఆగస్టు 23: ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం పొందుతున్న మైనారిటీ విద్యా సంస్థలు లౌకిక విధానాలను అనుసరించాలని మద్రాసు హైకోర్టు తేల్చిచెప్పింది. ప్రత్యేకించి ఒక్క మతస్థులనే సిబ్బందిగా నియమించుకోవడం కూడదని స్పష్టం చేసింది. అలాగే, ప్రైవేటు ఎయిడెడ్ విద్యా సంస్థల్లో నియామకాలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేందుకు చట్టం చేయాలని కూడా మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం పిలుపునిచ్చింది. డయాసిసన్ సీనియారిటీ జాబితా నుంచి మాత్రమే ఉపాధ్యాయులను నియమించుకోవాలని తిరునెల్వేలి డయాసిస్ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేకమని జస్టిస్ జీఆర్ స్వామినాథన్ పేర్కొన్నారు.

మీరే టేప్ తెచ్చుకుని కొలుచుకోండి!

నా ఇల్లు చెరువు బఫర్ జోన్లో ఉంటే కూల్చండి.. కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి సవాల్

» రూ.2 లక్షలు దాటిన రుణ మాఫీ తేదీ త్వరలో ప్రకటిస్తాం
» 18 వేల కోట్లు ఇచ్చాం... మరో 13 వేల కోట్లు ఇవ్వనున్నాం
» విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీనివాసరెడ్డి వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): 'రెవెన్యూ మంత్రి ఇల్లు హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో, బఫర్ జోన్‌లో ఉందంటూ కేటీఆర్, ఆయన తొత్తులు కొందరు ఆరోపణలు చేస్తున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ఆదేశిస్తా. గతంలో ఐదేళ్లు ఇరిగేషన్, మున్సిపల్ మంత్రులుగా పని చేసిన హరీశ్‌రావు, కేటీఆర్‌లు.. కొత్త టేప్‌ను ఒక దాన్ని కొనుక్కుని రండి. వెంట వారి తొత్తులనూ తీసుకుని రండి. మా అధికారులు పక్కనే ఉంటారు. మీరే టేప్‌తో కొలుచుకోండి. నా ఇల్లు హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో గానీ, బఫర్ జోన్‌లో గానీ ఉంటే వెంటనే కూల్చేయండి" అని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. కొలిచిన తర్వాత వారి తలలు ఎక్కడ పెట్టుకుంటారో వారే నిర్ణయించుకోవాలన్నారు. కేటీఆర్‌తోనో, ఆయన బావ హరీశ్‌రావుతోనో, వారి నాయన కేసీఆర్‌తోనే చెప్పించుకునే అవకాశం పొంగులేటి ఇవ్వబోడని చెప్పారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. తన ఇల్లు హిమాయత్‌సాగర్ బఫర్ జోన్‌లో ఉందో లేదో కొలిచేందుకు ఎప్పుడు వస్తారో చెబితే తానూ అక్కడే ఉంటానని చెప్పారు. కేటీఆర్ లాగా ఇల్లు తనది కాదని, లీజుకు తీసుకున్నానని చెప్పబోనని, ఆ ఇల్లు తనదేనని, తన కొడుకు పేరున ఉందని ప్రకటించారు. తన ఇల్లు తనదని చెప్పుకునే ధైర్యం కూడా కేటీఆర్‌కు లేదన్నారు. ఆయన ఫాంహౌస్‌ను నిజంగా లీజుకు తీసుకుంటే.. ఎంతకు తీసుకున్నాడో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలు, రిజర్వాయర్ల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలపై ప్రభుత్వం నియమించిన హైడ్రాకు కోర్టు నుంచి ప్రశంసలు లభించాయని, సామాన్యుల నుంచీ అభినందనలు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ స్థలాల్లోను, నిబంధనలకు విరుద్ధంగానూ ఉన్న నిర్మాణాలను కూల్చేస్తుంటే.. బీఆర్ఎస్ వాళ్లకు కడుపు నొప్పేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నేత, కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు కుమారుడి నివాసాన్నీ హైడ్రా కూల్చేసిందని, ఇది బీఆర్ఎస్ నేతలకు కనిపించట్లేదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ఇప్పుడే శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అప్పు రూ.3 లక్షల కోట్లే ఉందనుకున్నం

ఎన్నికలకు ముందు రాష్ట్రం అప్పు రూ.3 లక్షల కోట్లు మాత్రమే ఉందనుకున్నామని, అధికారంలోకి వచ్చాక సీఎం, మంత్రులం కూర్చుని సమీక్ష చేస్తే అప్పు రూ.7.19 లక్షల కోట్లుగా తేలేసరికి షాకై పోయామని పొంగులేటి తెలిపారు. ఆర్థికంగా రాష్ట్ర ఖజానా సహకరించదని తెలిసినా.. దుబారా ఖర్చులు దూరంగా పెట్టి 22 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్ల మేరకు రుణాన్ని మాఫీ చేశామన్నారు. ఇంకా రూ.13 వేల కోట్ల మేరకు మాఫీ చేయాల్సి ఉందని, దాన్నీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. త్వరలోనే రూ.2 లక్షల పైన రుణం తీసుకున్న రైతులు.. పై మొత్తాన్ని బ్యాంకులకు కట్టేందుకు కటాఫ్ తేదీని ప్రకటిస్తామని వెల్లడించారు. తాము అంచనా వేసుకున్న రూ.31 వేల కోట్లకు అదనంగా మరో రూ.1500 కోట్లు ఖర్చయినా అర్హుడైన ప్రతి రైతుకూ రుణాన్ని మాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు.

దేశానికి రోల్‌మోడల్‌గా రెవెన్యూ చట్టం

తెలంగాణ రెవెన్యూ చట్టం దేశానికే రోల్ మోడల్‌గా మారనుందని మంత్రి పొంగులేటి చెప్పారు. చట్టం ముసాయిదాను ఇప్పటికే పబ్లిక్ డొమైన్‌లో పెట్టామన్నారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో అన్ని కలెక్టరేట్ల పరిధిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, ఈ చట్టం పైన క్షేత్రస్థాయి నుంచి వచ్చిన సూచనలూ క్రోడీకరిస్తామని చెప్పారు. అందరి సూచనల్లో మంచి వాటిని స్వీకరిస్తామని చెప్పారు.

మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే!

"పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్కలు రేవంత్‌రెడ్డిని సీఎం సీటు నుంచి దించేస్తారంటూ బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నరు. కానీ.. ఈప్రభుత్వానికి.. మాకు, మా నాయకులకు ఒక స్పష్టత ఉంది. మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే. బీఆర్ఎస్ నేతల కలలు కలలలాగే ఉంటయి. మా మధ్య పెట్టడానికి వారికి ఆవగింజ అంత సందు కూడా దొరకదు" అని పొంగులేటి వ్యాఖ్యానించారు.

సీఎం చేతుల మీదుగా జేఎన్‌జే సొసైటీకి 70 ఎకరాలు అప్పగిస్తాం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రానున్న కొద్ది రోజుల్లో జవహర్‌లాల్ నెహ్రూ సొసైటీకి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆ సొసైటీకి కేటాయించిన 70 ఎకరాలను ఇస్తామని మంత్రి పొంగులేటి అన్నారు. సొసైటీకి 70 ఎకరాల మేరకు భూ కేటాయింపును సుప్రీంకోర్టు క్లియర్ చేసిందని గుర్తు చేశారు. కొద్ది రోజుల్లోనే ఒక మంచి ఫంక్షన్‌ను ఏర్పాటు చేసి, తొలి విడతగా ఈ మేరకు ఇళ్ల స్థలాలను ఇస్తున్నామని, దీని ద్వారా వెయ్యిమందికి పైగా సీనియర్ జర్నలిస్టులకు లబ్ధి చేకూరనుందని వెల్లడించారు. తాము ఎక్కువ చేసి, తక్కువ మాట్లాడతామని, ఇదే తమ ప్రభుత్వం కట్టుబాటు నిబద్ధతని వ్యాఖ్యానించారు.

సివిల్ వివాదాలపై

ఐటీడీఏ పీవోకు అధికారం లేదు

» ప్రభుత్వ ఏజెంట్ అయిన కలెక్టర్‌కు మాత్రమే ఉంది
» తెలంగాణ ఏజెన్సీ రూల్స్‌పై స్పష్టత ఇచ్చిన హైకోర్టు
» ఉమ్మడి ఆదిలాబాద్ కలెక్టర్ నిర్ణయం కొట్టివేత
» కేసులన్నింటినీ ఏజెన్సీ జిల్లాల కలెక్టర్లకు బదిలీ చేయాలని ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ అదనపు ఏజెంట్‌గా వ్యవహరించే ఐటీడీఏ పీవోలకు సివిల్ వివాదాలను పరిష్కరించే అధికారం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ ఏజెన్సీ రూల్స్ - 1924 ప్రకారం సివిల్ సూట్లను పరిష్కరించే అధికారం ఏజెన్సీ ఏరియాల్లో ప్రభుత్వ ఏజెంట్‌గా వ్యవహరించే జిల్లా కలెక్టర్‌కు, ఏజెన్సీ డివిజన్ ఆఫీసర్ కం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌లకు మాత్రమే ఉందని తెలిపింది. ఆస్తి విలువను బట్టి కేసులు ఆయా అధికారుల వద్దకు వెళ్తాయని పేర్కొంది. ఓ సివిల్ వివాదంలో ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) ఇచ్చిన ఆదేశాలను జస్టిస్ కాజా శరత్ ధర్మాసనం కొట్టేసింది. 'నాగార్జున గ్రామీణ బ్యాంక్ వర్సెస్ మేడి నారాయణ' తదితరుల కేసులో ఇదే హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును ఆధారం చేసుకొని ఈ నిర్ణయాన్ని వెలువరించింది. ఏజెన్సీ రూల్స్ -1924లో.. వివాదం విలువ ఎంత ఉంటే ఏ అధికారి విచారించాలనే విషయం స్పష్టంగా ఉంది. రూ. 500 విలువ ఉన్న ఆస్తి వివాదాలను ఏజెన్సీ మున్సిఫ్, రూ. 5వేల వరకు విలువైన ఆస్తివివాదాలను ఏజెన్సీ డివిజనల్ ఆఫీసర్ కం ఆర్డీవో, రూ. 5 వేల పైబడిన విలువైన ఆస్తి వివాదాలను ప్రభుత్వ ఏజెంట్ కం కలెక్టర్ పరిష్కరించాల్సి ఉంటుంది. ప్రత్యేకంగా ఏదైనా సివిల్ వివాదాన్ని మాత్రం కలెక్టర్.. ఐటీడీఏ పీవోకు బదిలీ చేసే వీలుంది. అయితే ఈ రూల్స్‌ను సరిగా అధ్యయనం చేయకుండా 2002లో అప్పటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్.. గవర్నర్/ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోకుండా తన అధికారాలను ఉట్నూరు ఐటీడీఏ పీవోకు బదిలీ చేశారు. దాని ఆధారంగా పీవో నిర్ణయాలను వెలువరించారు. ఇది చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది. సివిల్ కేసుల్లో పీవో ఇచ్చిన ఆదేశాలను కొట్టివేసింది. నెలరోజుల్లో కేసులన్నింటినీ ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమ్రుంభీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు కం గవర్నమెంట్ ఏజెంట్లకు కేసులు బదిలీ చేయాలని ఆదేశించింది. కేసుల విచారణ పురోగతిపై రెండునెలల్లో ఆయా ఏజెన్సీ జిల్లాల కలెక్టర్ల నుంచి నివేదికలు తెప్పించి సమర్పించాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు సూచించింది.

డీజీపీ కార్యాలయం వద్ద భద్రత కుదింపు!

» ఇంటర్‌సెప్టర్ వాహనం తొలగింపు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం(డీజీపీ ఆఫీస్) వద్ద భద్రత తగ్గించారు. ప్రధాన కార్యాలయం వద్ద గత కొన్నేళ్లుగా ఇంటర్‌సెప్టర్ వాహనంతో సాయుధులైన సిబ్బంది విధుల్లో ఉండేవారు. పోలీసు ప్రధాన కార్యాలయం కావడంతో కట్టుదిట్టమైన భద్రత చర్యల్లో భాగంగా ఇంటర్‌సెప్టర్ వాహనం గేటు వద్ద ఉంచేవారు. గత వారం రోజులుగా అధికారులు ఆ వాహనాన్ని భద్రత విధుల నుంచి తప్పించారు. హైదరాబాద్‌లో ఇతర ప్రాంతాల్లో గస్తీకి అవసరమంటూ నగర పోలీసులు డీజీపీ కార్యాలయం వద్ద ఉన్న ఆ వాహనాన్ని తొలగించారు. కాగా టీఎస్ఎస్పీ బెటాలియన్ సిబ్బందితోపాటు సిటీ సెక్యూరిటీ వింగ్ సిబ్బంది డీజీపీ కార్యాలయం భద్రతలో ఉంటారు. వీరితో పాటు గ్రేహౌండ్స్ విభాగంలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిటీ పోలీసుల నుంచి 8 మంది సిబ్బంది రెండు విడతల్లో భద్రత విధుల్లో ఉంటారు. డీజీపీతో సహా కీలక అధికారులు ఉండే కార్యాలయం, నిత్యం రాజకీయ, ఇతర ప్రముఖులు రాకపోకలు సాగించే ప్రదేశంలో సాయుధులైన సిబ్బంది గేటు వద్ద కనిపించకపోవడం వల్ల భద్రతపరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



దళిత బంధు నిధులను విడుదల చేయాలని ప్రజాభవన్ ముందు లబ్ధిదారుల ఆందోళన

దళిత బంధు నిధులు ఇవ్వండి

» ప్రజాభవన్ ముందు లబ్ధిదారుల ఆందోళన

బేగంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దళిత బంధు నిధులను వెంటనే విడుదల చేసి లబ్ధిదారుల ఖాతాలో జమ చేయాలని వందలాది మంది ప్రజావాణికి వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులుగా ఎంపికైన వారికి కొంత మేరకు అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, ఎన్నికల కోడ్ రావడంతో ఆ నిధులు లబ్ధిదారుల ఖాతాలోకి రాలేదని వెల్లడించారు. ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యలు పరిష్కరించాలని 1,150 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ప్రజల నుంచి అర్జీలను తీసుకున్నారు. ప్రధానంగా భూ సమస్యలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఉద్యోగుల సమస్యలతో పాటు పలు అంశాలపై వినతులు వచ్చాయి. ఇళ్లు కావాలని వచ్చిన వారి అర్జీలను అధికారులు తీసుకోలేదు. ప్రస్తుతం ఇళ్ల దరఖాస్తులను తీసుకోవడం లేదని సిబ్బంది చెప్పడంతో వారంతా నిరాశతో వెనుదిరిగారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతి–దౌత్యం

గత నెలలో భారత ప్రధాని నరేంద్రమోదీ రష్యాలో పర్యటించి ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను గాఢంగా ఆలిగనం చేసుకున్నారు. ఆరువారాల అనంతరం ఇప్పుడు తన పర్యటనలో పోలెండ్ నుంచి రైల్లో వెళ్ళి ఉక్రెయిన్ అధ్యక్షుడిని కూడా అదే తీరున గాఢంగా కౌగలించుకున్నారు. సన్నిహితులని తాను అనుకొనే విదేశీప్రముఖులతో భేటీ అయిన సందర్భాల్లో భారత ప్రధాని ఈ తీరున వారిపట్ల ప్రేమాభిమానాలు ప్రదర్శించడం పదేళ్ళుగా చూస్తున్నదే. కానీ, దాదాపు రెండున్నరేళ్లుగా యుద్ధంలో పరస్పరం కత్తులు దూసుకుంటున్న పుతిన్–జెలెన్స్కీలు ఇద్దరినీ నరేంద్రమోదీ కొద్దిరోజుల తేడాలో ఒకేలా అక్కున చేర్చుకోవడం అనేకులను ఆకర్షిస్తున్నది. వారిద్దరి ప్రతిస్పందనల్లో ఎంతో తేడా ఉన్నా, మోదీ మాత్రం ఒకేవిధంగా వ్యవహరించారని కొందరు మెచ్చుకుంటున్నారు.

రష్యాలో నరేంద్రమోదీ ఉన్నసమయంలోనే ఉక్రెయిన్‌లోని పిల్లల ఆస్పత్రిమీద బాంబుదాడులు జరిగి పెద్దసంఖ్యలో పిల్లలు మరణించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు ఎంతో తెలివిగా ధ్వంసమైన ఆస్పత్రి ఫోటోలను ట్విటర్‌లో పోస్టుచేస్తూ, అతిపెద్ద ప్రజాస్వామ్యదేశాధినేత ఓ క్రూరుడైన నేరగాడిని కౌగలించుకున్న ఘట్టం అంటూ పుతిన్–మోదీ ఆలింగనాన్ని ఉటంకించారు. మోదీ రష్యా పర్యటన శాంతియత్నాలకు తీవ్ర విఘాతమని కూడా జెలెన్‌స్కీ దెప్పిపొడిచారు. రష్యాతో యుద్ధం మొదలైన తరువాత జెలెన్‌స్కీ భారతదేశాన్ని నేరుగా తప్పుబట్టడం అదే తొలిసారి. ముచ్చటగా మూడోసారి ప్రధాని అయిన తరువాత నరేంద్రమోదీ తన తొలిపర్యటనకు పొరుగు దేశాలను కాక రష్యాను ఎంచుకుంటే, అది ఎందుకో అంతగా కలిసి రాలేదు. ఇప్పుడు జెలెన్‌స్కీ ప్రవర్తన కాస్తంత గంభీరంగా, భిన్నంగా కనిపించినప్పటికీ మోదీ దానిని గుర్తించనట్టుగానే వ్యవహరించారు. జెలెన్‌స్కీ భుజంమీద చేయివేసి ఉంచడం, మరీ ముఖ్యంగా యుద్ధంలో మరణించిన పిల్లల స్మృతికేంద్రాన్ని సందర్శించి నివాళులు అర్పించడం వంటివి భారతదేశం తన దౌత్యవ్యవహారాల్లో స్వతంత్రంగా ఉంటుందన్న సందేశాన్నిస్తాయి.

ఉక్రెయిన్ వేరుపడిన తరువాత భారతప్రధాని ఆ దేశంలో పర్యటించడం ఇదే ప్రథమం. దాదాపు పూర్తిగా నేలమట్టమైపోయిన దేశంలో, ఒకపక్క యుద్ధం జరుగుతూంటే వెళ్ళిరావడం నిజానికి చాలా ఇబ్బందికరమైన పరిస్థితి. గతనెలలో రష్యా పర్యటనమీద ఉక్రెయిన్‌తోపాటు పాశ్చాత్యదేశాలనుంచి కూడా విమర్శలు ఎదుర్కొన్న నేపథ్యంలో భారత్‌కు దౌత్యపరంగా ఇది అవసరమే. ఉక్రెయిన్ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ప్రధాని అక్కడ కాలూనడం ద్వారా, ఆ దేశాన్ని విస్మరించలేదని, దాని బాధలు, సమస్యల పట్ల తనకు పట్టింపు ఉన్నదని భారత్ చెప్పినట్టు అయింది. మోదీతో తన మనసులో ఉన్నది చెప్పడానికి జెలెన్‌స్కీ కూడా సందేహించలేదు. తటస్థంగా కాదు, పూర్తిగా మా పక్షాన ఉండండి అని ఆయన అంటే, శాంతివైపు ఉన్నామని మనదేశం నిర్మొహమాటంగా చెప్పింది. మహాత్మాగాంధీ, బుద్ధుడూ జన్మించిన భారతదేశం ఆదినుంచీ శాంతికోసమే కట్టుబడివుందని మోదీ వ్యాఖ్యానించారు. భారతదేశం అతిగొప్పదేశమని, శాంతిసాధనలో కీలక భూమిక నిర్వహించగలదని అంటూనే, యుద్ధం ముగియాలంటే తన వైపు ఉండాలంటున్నారు జెలెన్‌స్కీ. పరమ దుర్మార్గుడైన పుతిన్ కారణంగానే యుద్ధం మొదలైందని, తమమీద అకారణంగా కక్షకట్టాడనీ చెప్పుకొస్తూ, చమురు దిగుమతులను తగ్గించుకొని పుతిన్‌నూ, రష్యా ఆర్థికశక్తిని దెబ్బతీయాలన్నది జెలెన్‌స్కీ వ్యాఖ్యల సారాంశం.

భారత ప్రధాని అక్కడ కొద్దిగంటలు మాత్రమే ఉన్నప్పటికీ ఆయన పర్యటనకు విశేష ప్రాచుర్యం లభించింది. యుద్ధంలో ఉన్న ఈ రెండు దేశాల్లోనూ పర్యటించిన ఇతరదేశాధినేతల సంఖ్య చాలాతక్కువ. మోదీ శాంతిదూతగా వ్యవహరించాలని ఉక్రెయిన్ కోరుకుంటోంది. యుద్ధం వల్ల సమస్యలు పరిష్కారం కాబోవనీ, యుద్ధాన్ని ముగించాలనీ మోదీ ఇప్పటికే పలుపర్యాయాలు స్పష్టంచేశారు. పుతిన్‌తో ప్రత్యక్షంగా భేటీ అయిన సందర్భాల్లో కూడా అదే విషయాన్ని చెప్పారు. గతనెలలోనూ తాను పుతిన్‌తో అదేమాట చెప్పానని ఇప్పుడు జెలెన్‌స్కీ సమక్షంలో వ్యాఖ్యానించడంతో పాటు, త్వరలోనే యుద్ధం ముగిసి శాంతిస్థాపన జరగాలని తాను గట్టిగా కోరుకుంటున్నట్టు కూడా మోదీ ప్రకటించారు. ఉక్రెయిన్ యుద్ధం ఆరంభమైన తరువాత గతనెల రష్యాలోనూ, ఇప్పుడు ఉక్రెయిన్‌లోనూ మోదీ తొలిసారిగా పర్యటించారు. ఈ పర్యటనలు ఆ యుద్ధం ముగింపుదిశగా ఉపకరిస్తే కచ్చితంగా సంతోషించాల్సిందే.

ఉమ్మడి పౌరస్మృతిపై తొలగని భయాలు

ఈ ఆగస్టు 15న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వరుసగా 11వ సారి దేశప్రజల నుద్దేశించి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేశారు. ఇది ఒక విధంగా రికార్డే. అయితే అందులో విశిష్టత ఏమీ లేదనుకోండి. అది వేరే విషయం. ఎర్రకోట బురుజుల నుంచి నరేంద్ర మోదీ వెలువరించిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాలలో కెల్లా ఈ పంద్రాగస్టు ప్రసంగం సుదీర్ఘమైనది (98 నిమిషాల పాటు సాగింది). ప్రధానమంత్రిగా మూడో పర్యాయం ఆరంభంలో ఈ ప్రసంగం చేశారు గనుక, రాబోయే ఐదేళ్ల పాలనకు తన ప్రభుత్వ దార్శనిక సంకల్పాలు, ప్రణాళికలను నరేంద్ర మోదీ వెల్లడిస్తారని చాలా మంది ఆశించారు, వినడానికి నిరీక్షించారు.

ప్రధానమంత్రి ప్రసంగం సాహసోపేతమైన కొత్త దార్శనికతను సువ్యక్తం చేసిందని భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రశంసించారు. నిజమా? నిజమే అయితే అది ఒక వర్గం ప్రజలను లక్ష్యంగా చేసుకున్న దార్శనికత (?) మాత్రమే అని నేను భావిస్తున్నాను. నరేంద్ర మోదీ ఏమన్నారో గుర్తు చేస్తాను:' మనం దృఢ సంకల్పంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాం. మరెవ్వరూ వెళ్లని గమ్యాలకు పురోగమిస్తున్నాం. అయితే మన ప్రగతి ప్రస్థానానికి సంబంధించి మరొక సత్యాన్ని కూడా చెప్పవలసి ఉంది. భారతదేశ శీఘ్ర పురోగతిని కొంత మంది భరించలేకపోతున్నారు. ఇది నిజం. భారత్ సాధిస్తున్న విజయాలను, అశేష ప్రజలకు సమకూరుస్తున్న శ్రేయస్సును కొందరు వ్యక్తులు గుర్తించడం లేదు. ఎందుకని? దేశం సాధిస్తున్న అభివృద్ధి వారి స్వార్థ ప్రయోజనాలకు తోడ్పడడం లేదు తమ బాగు మినహా మరెవ్వరి ప్రగతిని వారు కోరుకోరు, ఇష్టపడరు. ఇటువంటి విపరీత, కుటిల స్వభావమున్న వ్యక్తుల సంఖ్య తక్కువేమీ కాదు. అటువంటి వ్యక్తుల పట్ల దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఇంతకూ మోదీ ఆక్షేపించిన 'కొంతమంది ప్రజలు' ఎవరు? వ్యవసాయం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అణు ఇంధనం, అంతరిక్ష పరిశోధన మొదలైన రంగాలలో భారత్ ఘన విజయాలకు గర్వించని వ్యక్తి ఒక్కడూ నాకు తెలియదు మరెవరు? తనకు, ఎన్డీఏకు వ్యతిరేకంగా ఓటు వేసిన 262 మిలియన్ ఓటర్లే ఆ 'కొంత మంది ప్రజలు' అని మోదీ పరోక్షంగా సూచిస్తున్నారా? నిరుద్యోగిత అంతకంతకూ పెచ్చరిల్లిపోవడంపై తనను, తన ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న యువజనులా? లేక ధరల పెరుగుదలతో కుటుంబంపై పడుతున్న ఆర్థిక భారం గురించి వాపోతున్న గృహిణులా? లేక భారత భూభాగాలను చైనా ఆక్రమించుకుంటున్నప్పటికీ భారత్ మౌనంగా తిరోగమించడంపై విభ్రాంతికి లోనవుతున్న సైనికులు, మాజీ జవానులా?

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగమనేది జాతి సర్వతోముఖాభివృద్ధిని లక్ష్యించే దార్శనికతకు మద్దతుగా దేశ ప్రజలను సంఘటితపరిచేందుకు ఉద్దేశించింది. మరి ప్రధాని మోదీ ప్రసంగం అందుకు దోహదం చేసేదిగా ఉన్నదా? లేదు. తన ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల ప్రజలలో నెలకొన్న భయాలు, విభేదాలను మరింత తీవ్రతరం చేసేదిగా ప్రధానమంత్రి ప్రసంగం ఉన్నది. ప్రభుత్వంతో విభేదిస్తున్న, ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న వ్యక్తులను 'విపరీత, కుటిల స్వభావమున్న' వారని ఆక్షేపించడం ప్రజాస్వామిక తీర్పును మోదీ ఎంతగా ఏవగించుకుంటున్నారో అర్థమవుతున్నది.

ప్రజా తీర్పు నుంచి మోదీ పాఠాలు నేర్చుకోరు. లోక్‌సభలో బీజేపీ సీట్లు 240కి తగ్గిపోయినందున కొన్ని నిర్ణయాలను అమలుపరచడంలో మోదీ సర్కార్ జాప్యం చేయగలదని భావించాము. అయితే మేము పొరపడ్డాము. ఉమ్మడి పౌరస్మృతి, ఒక దేశం– ఒకే ఎన్నిక విషయమై ప్రధానమంత్రి ఇప్పటికీ కృత నిశ్చయంతో ఉన్నారని అర్థమవుతోంది. ఆ రెండు అంశాలను ఆయన తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రస్తుతం వేర్వేరు మతాల వారికి ప్రత్యేకంగా ఉన్న వేర్వేరు పౌర స్మృతులను 'మతతత్వ పౌర స్మృతులు' అని ఆయన ఆక్షేపించారు. మోదీ ఇలా అన్నారు: 'జాతిని మత ప్రాతిపదికన విడదీసే చట్టాలకు ఆధునిక సమాజంలో స్థానంలేదు. ఎందుకంటే అవి మత, వర్గ వివక్షకు ప్రాతిపదిక అవుతాయి. దేశానికి ఇప్పుడు అవసరమయింది 'లౌకిక పౌరస్మృతి. మనం 75 సంవత్సరాల పాటు ఒక మతతత్వ పౌర స్మృతిని పాటించాము. ఇప్పుడు ఒక లౌకిక పౌరస్మృతిని రూపొందించుకునే దిశగా వెళ్లవలసి ఉన్నది. మతం ప్రాతిపదికన అనుసరిస్తున్న పౌర స్మృతుల మూలంగా ప్రజలలో నెలకొన్న విభేదాలను లౌకిక పౌరస్మృతితో మాత్రమే రూపుమాపగలం'.



పౌరసత్వ సవరణ చట్టం, ఉమ్మడి పౌర స్మృతి, ఒక దేశం–ఒకే ఎన్నిక ఆలోచనలను పూర్తిగా విరమించుకుని, సంబంధిత బిల్లులను అంతిమంగా ఉపసంహరించుకున్నప్పుడే ప్రజల్లో భయాలు పూర్తిగా తొలగిపోతాయి. ప్రజలలో చీలికలు సృష్టించే, విభేదాలను ప్రకోపింప చేసే విధానాలు, నిర్ణయాలను త్యజించినప్పుడే ఒక కొత్త దార్శనికత ఆవిష్కృతమవుతుంది.

మోదీ చేసిన ఈ ఉద్ఘాటనలో మత చట్టాలపై ఆయన అస్పష్ట అవగాహన స్పష్టంగా కనిపిస్తుంది. ప్రతి వ్యక్తిగత చట్టమూ (పర్సనల్ లా) మతం ప్రాతిపదికన ఉంటుంది. హిందూ వ్యక్తిగత చట్టాలూ అందుకు మినహాయింపు కాదు. మతం ఆధారంగా ఉన్నందున అవి మతతత్వ చట్టాలు ఎలా అవుతాయి? వివాహాలకు సంబంధించి ఒక లౌకిక చట్టం ఉన్నది. అదే 'ప్రత్యేక వివాహ చట్టం'. అయితే ఈ దేశ ప్రజలు దానిని పెద్దగా గుర్తించడం లేదు, పాటించడం లేదు. తన పొరుగువాడు ఒక విభిన్న మత చట్టాన్ని అనుసరిస్తున్నందున తాను 'వివక్ష'కు గురవుతున్నానని ఏ మతానికి చెందిన సామాన్యుడూ భావించడు, భయపడడు. అన్ని మతాలవారు ఉమ్మడి పౌరస్మృతికి అంగీకరిస్తే అద్భుతంగా ఉంటుంది. అయితే ఇది చెప్పినంత తేలికగా కార్యరూపం దాల్చదు.

ఉమ్మడి పౌరస్మృతి భావన, ఒక దేశం–ఒకే ఎన్నిక ప్రతిపాదన ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. తొలుత వాటి విషయమై ప్రజల్లో నెలకొన్న భయాలను తొలగించాలి. ఉమ్మడి పౌరస్మృతి విషయమై ముందుగా అన్ని మతాల వారితోనూ విస్తృతంగా సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇక 'ఒక దేశం– ఒకే ఎన్నిక' ప్రతిపాదనను అమలుపరచాలంటే రాజ్యాంగంలోని అనేక అధికరణలకు తప్పనిసరిగా సవరణలు చేయవలసి ఉంటుంది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో ప్రజలను మతపరమైన చీలికలకు దారితీసే ప్రసంగాలను అధికార పక్షం నాయకులు చేశారు. మోదీ ఏమన్నారో గుర్తు చేస్తాను: 'కాంగ్రెస్ అధికారానికి వస్తే ప్రజల భూములు, బంగారం, ఇతర విలువైన ఆస్తులను ముస్లింలకు పంపిణీ చేస్తుంది; కాంగ్రెస్ మీ మంగళసూత్రాలు, స్త్రీ ధనాన్ని సైతం తీసుకుని అధిక సంతానం ఉన్నవారికి ఇస్తుంది'. అమిత్ షా ఏమన్నారు? 'ఆలయ మాన్యాలను కాంగ్రెస్ స్వాధీనం చేసుకుంటుంది, వాటిని ముస్లింలకు ఇస్తుంది'. రాజ్‌నాథ్ సింగ్ మాట గుర్తులేదూ? 'ప్రజల ఆస్తులను కాంగ్రెస్ కైవశం చేసుకుని వాటిని చొరబాటుదారులకు పునఃపంపిణీ చేస్తుంది'. చివరగా మోదీని మరోసారి ఉటంకిస్తాను: 'గేదెల పైన కూడా వారసత్వ పన్ను రావచ్చు' అని ఆయన హెచ్చరించారు! ఈ వెర్రి మాటలను నిలిపివేసేందుకు మీడియా ప్రయత్నించనే లేదు.

సరే, ప్రజల తీర్పు ఎలా ఉన్నదో మరి చెప్పనవసరం లేదు. మోదీ వ్యవహార శైలిలో సంయమనం కన్పించలేదు. అయితే ఆయన ప్రభుత్వం పలు అంశాలపై వెనుకంజ వేసింది. ఇండెక్సేషన్ బెనిఫిట్ ఫర్ కేపిటల్ గెయిన్స్‌ను పునరుద్ధరించారు. వక్ఫ్ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలనకు నివేదించారు. బ్రాడ్‌కాస్టింగ్ బిల్లును ఉపసంహరించుకున్నారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లో మధ్యస్థాయి, సీనియర్ పోస్టులలో సివిల్ సర్వీస్ అధికారులతో కాకుండా సంబంధిత రంగాలలో నిపుణులైన బయటి వ్యక్తులను నేరుగా నియమించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తుతానికి నిలిపివేశారు. పౌరసత్వ సవరణ చట్టం, ఉమ్మడి పౌర స్మృతి, ఒక దేశం–ఒకే ఎన్నిక ఆలోచనలను పూర్తిగా విరమించుకుని, సంబంధిత బిల్లులను అంతిమంగా ఉపసంహరించుకున్నప్పుడే ప్రజల్లో భయాలు పూర్తిగా తొలగిపోతాయి. ప్రజలలో చీలికలు సృష్టించే, విభేదాలను ప్రకోపింప చేసే విధానాలు, నిర్ణయాలను త్యజించినప్పుడే ఒక కొత్త దార్శనికత ఆవిష్కృతమవుతుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

విశ్వమిత్ర భారత్‌కే ఇరుగు పొరుగు బలిమి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన మొదటి హయాంలోనూ, ఆ తరువాత కూడా విశ్వ–గురుగా భారత్ ప్రభవించనున్నదని ప్రభుత్వ మద్దతుదారులు పెద్ద పెట్టున పదే పదే ప్రకటిస్తుండేవారు. మన నాగరికతా విలువలు, తాత్త్విక సంప్రదాయాలు, సమున్నత ఆధ్యాత్మిక అనుష్ఠానాలు సంస్కృతి విషయంలో మనలను ఎప్పుడో ప్రపంచ అగ్రగామిగా ప్రముఖంగా నిలిపాయని, ఇప్పుడు అసాధారణ ఆర్థికాభివృద్ధి, సాంకేతికతల విజయాలు ప్రపంచ నాయకత్వానికి మనలను అద్వితీయంగా అర్హులను చేశాయని మోదీ ప్రభుత్వ సమర్థకులు ఘోషించారు.



ఈ వాదనను మరింత ముందుకు తీసుకువెళ్లి దానిని వ్యక్తిగతీకరించడానికి సైతం సాహసించారు. భారత్ మాత్రమే కాదు, నరేంద్ర మోదీయే ప్రపంచానికి నాయకత్వం వహించి మానవాళిని అపూర్వ ప్రగతి సీమలకు నడిపించనున్నారని మోదీ భక్తులు చెప్పారు. 2023లో జీ20 దేశాల కూటమి అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టాక ఆ ప్రచారం మరింత ఉధృతమయింది. నా మిత్రుడు ఒకరు చెప్పిన ఒక ఆసక్తికరమైన ముచ్చటను పేర్కొంటాను: ఢిల్లీ మెట్రోలో ఒక ప్రయాణికుడు తన తోటి ప్రయాణికుడితో ఇలా అన్నాడట : 'నీకు తెలుసా, ఇప్పుడు మోదీజీ కేవలం భారత ప్రధానమంత్రి మాత్రమే కాదు, మొత్తం ఇరవై దేశాలకు ప్రధానమంత్రి కూడా!'

యాదృచ్ఛికంగా అదే కాలంలో అధికార పక్షం ప్రచార కాండ పరిభాషలో ఒక చిన్న మార్పు సంభవించింది. భారత్‌ను విశ్వ–మిత్ర (సమస్త దేశాలకు స్నేహితుడు)గా ప్రస్తావించడం ప్రారంభమయింది. ఇది, మోదీ ప్రభుత్వ ఆకాంక్షను తగ్గించడమే, సందేహం లేదు. ఒక నిర్దిష్టమైన, సుస్పష్టమైన మార్పు. ప్రపంచానికి బోధించగల స్థాయికి భారత్ ఇంకా చేరలేదని, అయినప్పటికీ ప్రపంచంలోని ప్రతి ఒక్క దేశంతోను స్నేహం నెరపగల విశిష్టస్థానంలో భారత్ ఉన్నదని అంటూ ఆ మార్పుకు వివరణ ఇవ్వసాగారు. దీనిపై అనేక ఊహాగానాలు జరిగాయి. ఢిల్లీ మెట్రోలో మోదీ భక్త ప్రయాణికుడి వలే కాకుండా నరేంద్ర మోదీ ప్రభుత్వ పక్షాన మాట్లాడే బీజేపీ శ్రేణులకు జీ20 అధ్యక్షత తాత్కాలికం మాత్రమేనన్న వాస్తవం బాగా తెలుసు కనుకనే విశ్వ–గురు అని కాకుండా విశ్వ–మిత్ర అనే మాటను అందుకున్నారా? ప్రజల అంచనాలకు అనుగుణంగా దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి ఏ మాత్రం లేకపోవడమే ఆ మార్పును ప్రేరేపించిందా? హిమాలయ సరిహద్దు ప్రాంతాల్లో చైనా చొరబాటులతో ప్రపంచ నాయకత్వానికి మన ఆరాటాలు అసంబద్ధమైనవనే వాస్తవం తెలిసిరావడం వల్లే ఆ మార్పు అనివార్యమయిందా?

ఏది ఏమైనా ఆ ప్రచార కథనాలలో ఒక స్పష్టమైన మార్పు చోటుచేసుకున్నది. అయితే విమానాలను, ప్లాస్టిక్ సర్జరీని సహస్రాబ్దాల క్రితమే ప్రాచీన హిందువులు కనిపెట్టారని విశ్వసించే మోదీ భక్త గణంలో భారత్ ఇప్పటికే విశ్వగురు అని, కాకపోయినా సమీప కాలంలోనే ఆ విశిష్ట హోదాను సంతరించుకుంటుందనే నమ్మకం పరిపూర్ణంగా ఉంది. వాస్తవికంగా ఆలోచించే రాజకీయ వివేకులు మాత్రం విశ్వ–మిత్ర అనే ప్రశంసనే మరింత తరచుగా ప్రస్తావిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజల తిరుగుబాటు నేపథ్యంలో ఈ మృదు గర్వాతిశయ స్వోత్కర్షను సైతం త్యజించడమే మంచిది. అంతేకాదు, శ్రేయస్కరం కూడా. ఎందుకని? మన ఇరుగు పొరుగు దేశాల ప్రజలు భారత్‌ను ఒక విశ్వసనీయమైన, ఆధారపడదగిన మిత్ర దేశంగా ఏ మాత్రం భావించడం లేదని బంగ్లా పరిణామాలు మరింతగా స్పష్టం చేయలేదూ? షేక్ హసీనా నిరంకుశ పాలనను న్యూఢిల్లీ అన్ని విధాల వెనకేసుకురావడం వల్లే భారత్ ఉద్దేశాలను బంగ్లాదేశీయులు తీవ్రంగా శంకిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో బంగ్లా పార్లమెంటుకు జరిగిన ఎన్నికలలో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీలీగ్ మరోసారి విజయం సాధించింది. ప్రజల మద్దతుతోనేనా? కాదు. ఎన్నికలలో అడ్డు అదుపూ లేని రిగ్గింగ్‌కు పాల్పడడం ద్వారా. అయినా ఎన్నికలను స్వేచ్ఛగా, సక్రమంగా నిర్వహించారంటూ భారత ఎన్నికల సంఘం బంగ్లాదేశ్ ఎన్నికల సంఘాన్ని ప్రశంసించింది!

సమస్త ప్రపంచ దేశాలకు ఒక మంచి స్నేహితుడుగా ఉండాలని భారత్ ఆకాంక్షిస్తుంటే అందుకు మున్ముందుగా తన ఇరుగు పొరుగు రాజ్యాలు ముఖ్యంగా బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకల పట్ల తన వైఖరులను మార్చుకోవడంపై దృష్టి పెట్టాలి. ఈ దేశాలతో మెరుగైన సంబంధాలను నిర్మించుకునేందుకు గౌరవాదరాలు, విశ్వసనీయతను పెంపొందించుకోవాలి. మన పట్ల ఆ సుహృద్భావాలు కేవలం ఆ దేశాల నాయకులలోనే కాకుండా, ఆయా దేశాల పౌరులలో సైతం సుస్థిరంగా నెలకొనేలా మనం ప్రవర్తించాలి.

భారత్ తమ దేశం పట్ల దురహంకారపూరితంగా వ్యవహరిస్తుందనే భావన శ్రీలంక, నేపాల్ ప్రజలలో కూడా ప్రగాఢంగా ఉన్నది. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకకు చెందిన పౌరుల సంయుక్త ప్రకటన ఒకటి తమ తమ దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడాన్ని భారత్ విరమించుకోవాలని విజ్ఞప్తి చేయడమే అందుకొక నిదర్శనం. 'దశాబ్దాలుగా న్యూఢిల్లీ తనకు సానుకూలురు అయిన రాజకీయవేత్తలు, ప్రభుత్వాధికారుల తోడ్పాటుతో తమ పాలనా వ్యవహారాలలో జోక్యం చేసుకుంటూ నిరంతర రాజకీయ అస్థిరతను సృష్టిస్తూ నిరంకుశ ప్రభుత్వాలకు వత్తాసునిస్తుందని ఆ సంయుక్త ప్రకటన నిరసించింది.

ఆ ఆరోపణను ధ్రువీకరించే వాస్తవాలను కూడా ఆ ప్రకటన ప్రస్తావించింది. బంగ్లాదేశ్‌లో ప్రజల మద్దతును కోల్పోయిన షేక్ హసీనా ప్రభుత్వాన్ని ఒక దశాబ్ద కాలంగా నిలబెట్టి అందుకు ప్రతిఫలంగా భారత్ రాజకీయ, ఆర్థిక రాయితీలను పొందిందని ఆ ప్రకటన పేర్కొంది. 'శ్రీలంకకు ఐపికెఎఫ్‌ను పంపక ముందు నుంచీ, ఆ తరువాత కూడా ఆ దేశ రాజకీయాలలో న్యూఢిల్లీ జోక్యం చేసుకొంటోంది. ఇప్పుడు శ్రీలంకలో తమ కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనాలను సాధించేందుకు న్యూఢిల్లీ చురుగ్గా చొరవ చూపుతుంది' అని ఆ ప్రకటన గర్హించింది. నేపాల్‌లో 'ఒకప్పుడు తన అనుకూల రాజకీయవేత్తలు, దౌత్యవేత్తల ద్వారా జోక్యం చేసుకున్న న్యూఢిల్లీ ఇప్పుడు ఇంటెలిజెన్స్ వర్గాలు, ఆరెస్సెస్ కార్యకర్తల ద్వారా ఆ దేశ అంతర్గత వ్యవహారాలను ప్రభావితం చేస్తూ నిర్దేశిస్తుంది. 2015లో పెను భూకంపంతో నేపాల్ ప్రజలు అతలాకుతలమైన తరుణంలో కూడా భారత్ ఆ దేశానికి వ్యతిరేకంగా దిగ్బంధం విధించింది. నేపాల్ కొత్తగా అమలుపరచుకుంటున్న రాజ్యాంగం న్యూఢిల్లీకి నచ్చకపోవడం వల్లే ఆ దిగ్బంధాన్ని అమలుపరిచారని' ఆ సంయుక్త ప్రకటన దుయ్యబట్టింది.



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఈ ధ్రువీకరణలు నిర్దుష్టమైనవి. చాలవరకు వాస్తవమైనవి. ప్రస్తావిత మూడు దేశాలలోను నాకు స్నేహితులు, వృత్తి సంబంధమైన సహచరులు ఉన్నారు. ఆ మూడు దేశాలను నేను అప్పుడప్పుడు సందర్శిస్తుంటాను. ఒక పెత్తందారువలే భారత్ వ్యవహరిస్తుందని, పెద్దన్న మనస్తత్వం న్యూఢిల్లీకి బాగా ఉన్నదనే భావన బంగ్లా, నేపాలీ, సింహళ మేధావులు, రచయితలలో తీవ్రంగా ఉన్నది. ఈ సందర్భంగా 19వ శతాబ్ది మెక్సికో దేశాధ్యక్షుడు ఒకరు అమెరికా విషయమై చేసిన వ్యాఖ్య నొకదాన్ని తప్పక గుర్తుచేయవలసివున్నది. ఆ మెక్సికన్ పాలకుడు ఇలా అన్నాడు: 'అభాగ్య మెక్సికో! భగవంతుడికి ఎంత సుదూరంలో ఉన్నదో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు అంత సామీప్యంలో ఉన్నది'. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ మూడూ అనేక ఆర్థిక సమస్యలు, రాజకీయ సవాళ్లతో సతమతమవుతున్నాయి. భారత్‌కు పొరుగునే ఉన్న కారణంగా ఆ సమస్యలను పరిష్కరించుకోవడం, సవాళ్ళనెదుర్కోవడం ఆ దేశాలకు మరింత క్లిష్టతరమవుతోంది.

ఇరుగు పొరుగు దేశాల పట్ల భారత్ పెద్దన్న ప్రవర్తన మోదీ సర్కార్‌తోనే ప్రారంభమవలేదు. అంతకు ముందు నుంచే ఉన్నది. శ్రీలంకకు ఐపికెఎఫ్‌ను పంపింది రాజీవ్ గాంధీ, నేపాల్‌కు వ్యతిరేకంగా నరేంద్రమోదీ ప్రభుత్వం దిగ్బంధం విధించక ముందే రాజీవ్ సర్కార్ సైతం ఆ అమానుష అమిత్ర చర్యకు పాల్పడింది. నిజానికి ఇటువంటి దురహంకారపూరిత ప్రవర్తనకు ఆద్యుడు మన మొదటి ప్రధానమంత్రి (ఆయనే మన మొదటి విదేశాంగ మంత్రి కూడా) అని చెప్పక తప్పదు. ప్రముఖ దౌత్యవేత్త జగత్ మెహతా ఇలా వ్యాఖ్యానించాడు: 'రెండు భిన్న, అసమాన ఇరుగు పొరుగు దేశాల మధ్య దౌత్యాన్ని నిర్వహించడమంత క్లిష్టసాధ్యమైన కార్యం ఇరవయో శతాబ్దిలో మరొకటి లేదన్న సత్యాన్ని నెహ్రూ పూర్తిగా గుర్తించలేదు. ఈ విషయంలో ఆయనకు ఉపయుక్తమైన సలహానివ్వడంలో విదేశాంగశాఖ విఫలమయింది'.

చరిత్ర తర్కం, భౌమ వాస్తవాలు చైనా, పాకిస్థాన్‌తో భారత్ సంబంధాలు సమస్యాత్మకంగా ఉండిపోవడాన్ని అనివార్యం చేస్తున్నాయి. మెక్‌మహన్ రేఖను చైనా ఎప్పుడూ అంగీకరించలేదు. తాము పాశ్చాత్య సామ్రాజ్య వాదుల నియంత్రణలో ఉన్నప్పుడు ఆ సరిహద్దు ఒప్పందాన్ని బలవంతంగా అంగీకరించవలసివచ్చిందని చైనా స్పష్టం చేసింది. 1962లో భారత భూభాగాలను చైనా దురాక్రమించడం భారతీయులను అమితంగా నొప్పించింది. ఆ పరాభవ మానసిక గాయాల నుంచి ఇప్పటికీ ఉపశమనం లభించలేదు. పాకిస్థాన్ దశాబ్దాలుగా కేవలం కశ్మీర్‌లోనే కాకుండా మన దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహిస్తోంది. ఈ దృష్ట్యా ఆ దేశంతో ఏదో ఒక విధంగా సర్దుబాటు చేసుకునేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించినా సత్ఫలితం సమకూరే అవకాశమే లేదు.

అయితే మన ఇతర ఇరుగు పొరుగు దేశాలతో అటువంటి వివాదాస్పద సమస్యలు లేవు. అందుకు భిన్నంగా సామరస్యపూర్వక సంబంధాలకు దోహదం చేసే పరిస్థితులే ఉన్నాయి. అయినా ఈ మూడు చిన్న దేశాలతో భారత్ సంబంధాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగిన సందర్భాలు అరుదుగా ఉన్నాయి. ఇందుకు తన బాధ్యత ఏ మేరకు ఉన్నదో పెద్ద, శక్తిమంతమైన పొరుగు దేశంగా భారత్ నిజాయితీగా ఆత్మపరిశీలన చేసుకోవాలి.

2007–08లో మన ఆర్థిక వ్యవస్థ అసాధారణంగా అభివృద్ధి చెందుతున్నప్పుడు ప్రపంచ అగ్రరాజ్యంగా భారత్ ఆవిర్భవించనున్నదనే మాట బాగా విన్పించింది. అది అకాల ఆశాభావమని, తొందరపాటుతో అంటున్న మాట అని నేను భావించాను. ప్రపంచ బాధ్యతలు స్వీకరించడానికి ఆరాటపడడం కాకుండా మన సమాజంలోని ఆర్థిక, సామాజిక అసమానతలు, రాజకీయ సమస్యలను పరిష్కరించుకోవడంపై పూర్తి శ్రద్ధ చూపించడం వివేకవంతంగా ఉండగలదని నేను అప్పుడే వాదించాను. మన్మోహన్ సింగ్ రెండో ప్రధానమంత్రిత్వ కాలంలో అగ్రరాజ్య హోదాకు ఆరాటాలు చాలా వరకు తగ్గిపోయాయి. అయితే నరేంద్ర మోదీ తన మొదటి ప్రభుత్వ హయాంలో అవి మళ్లీ సరికొత్తగా వ్యక్తమవ్వడం ఆరంభమయింది. స్వదేశీ ముద్రను సంతరించుకున్నాయి. భారత్ త్వరలో అగ్రరాజ్యంగా ప్రభవించనున్నదని చెప్పుతున్నవారు అచిరకాలంలోనే భారత్ ఇప్పటికే విశ్వగురుగా మారిందని ప్రకటించసాగారు!

ప్రపంచ నాయకత్వానికి భారత్ ఆరాటం వివేకహీనమైనది. అదొక పగటి కల. ఎందుకని? మన దేశం ఎదుర్కొంటున్న సంస్థల, వ్యవస్థల పతనం, అసమానతల పెరుగుదల, పెచ్చరిల్లిన అవినీతి, పరిపాలనలో ఆశ్రిత పక్షపాతం, ఎల్లెడలా పర్యావరణ విధ్వంసం మొదలైన సమస్యలు మన సమాజంలోని వాస్తవ పరిస్థితులను ముఖం మీద గుద్ది చెప్పడం లేదా? విశ్వగురు భారత్ అనే భావన అర్థరహితం, చెత్త వాగుడే కావచ్చు గానీ విశ్వమిత్ర భారత్ అనే ఆదర్శం కొంతవరకు విలువైనది. సమస్త ప్రపంచ దేశాలకు ఒక మంచి స్నేహితుడుగా ఉండాలని భారత్ ఆకాంక్షిస్తుంటే అందుకు మున్ముందుగా తన ఇరుగు పొరుగు రాజ్యాలు ముఖ్యంగా బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకల పట్ల తన వైఖరులను మార్చుకోవడంపై దృష్టి పెట్టాలి. ఈ దేశాలతో మెరుగైన సంబంధాలను నిర్మించుకునేందుకు గౌరవాదరాలు, విశ్వసనీయతను పెంపొందించుకోవాలి. మన పట్ల ఆ సుహృద్భావాలు కేవలం ఆ దేశాల నాయకులలోనే కాకుండా, ఆయా దేశాల పౌరులలో సైతం సుస్థిరంగా నెలకొనేలా మనం ప్రవర్తించాలి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ఔను.. సన్నాఫ్ 'మాణిక్యమే' సీతారాం!!

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో తనదైన సంతకాన్ని చేసిన కవి, విమర్శకుడు, పరిశోధకుడు, అధ్యాపకుడు సీతారాం. బహుముఖ పాత్రలు పోషిస్తున్న ఈ అరుదైన సాహితీ శిఖరం అలుపెరుగని ప్రయాణాన్ని అవలోకిస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలుగకమానదు. రక్తస్పర్శ కవుల్లో ఒకరిగా సీతారాం ప్రపంచానికి పరిచయం. 'ఇదిగో ఇక్కడిదాకే' అంటూ తాను వెలువరించిన కవితా సంపుటి అప్పట్లో ఒక సంచలనంగా నిలిచింది. కవిత్వంలో తాత్విక గాఢత కలిగిన పోస్ట్ మాడర్నిస్ట్ ధోరణిలో సాగిన ఈ కవిత్వం ఇటు పాఠకులనే కాదు అటు విమర్శకులను సైతం ఆలోచింపజేసింది. గ్లోబలైజేషన్ నేపథ్యంలో ఆధునిక మానవుడి అంతఃసంఘర్షణను, లోలోపలి మానని గాయాలను అతి సున్నితంగా, హృద్యంగా పట్టుకోవడంలో సీతారాంది అందెవేసిన చెయ్యి. ఆ తరువాత... కాలం వెంట నడుస్తూనే దాని పరిణామాలను, ప్రతిఫలనాలను ఒడిసి పట్టుకుని కవిత్వంలో హృద్యంగా ఒదిగించిన తీరు అసామాన్యమైంది. వస్తువు ఎంపిక దగ్గరి నుండి, దాని అభివ్యక్తి వరకు నూతనత్వంతో కూడిన తాజాదనమే ప్రతీ కవితలో పొదిగిన కవిత్వ జీవి ఆయన. ఇట్లా కవిత్వం రంగంలో తనదైన సాహిత్య జెండాను ఎగురవేసిన 'సన్నాఫ్ మాణిక్యం' సీతారాం.



సాహిత్యం, జీవితం వేరువేరు కాదని తాను చెప్తున్నదే ఆచరిస్తూ, ఆచరిస్తున్నదే బోధిస్తూ సాహిత్యంలో, సమాజంలో ఒక ధిక్కార బావుటా ఎగురవేస్తున్న బలమైన గొంతుక సీతారాం.

కవికి సృజనకారుడికి సాహిత్య లోతుపాతులను విడమరిచి చెప్పి, సరైన దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యతను సైతం నిండు మనసుతో స్వీకరించిన విమర్శకుడు తాను. అట్లా తాను రాసిన 'అదే పుట' సాహిత్యం విమర్శలో వస్తు, శిల్పాలనే కాదు అభివ్యక్తి విషయంలో సైతం పాశ్చాత్య సాహిత్య విమర్శ సిద్ధాంతాలతో విశ్లేషించి తెలుగు సాహిత్యానికి పరిచయం చేశారు. ఈ రకంగా సీతారాం విమర్శకులు లేని లోటును గడిచిన మూడున్నర దశాబ్దాలుగా తీరుస్తూనే ఉన్నారు. నిర్మొహమాటంగా తాను చేసిన విమర్శ సాహిత్యకారులను ఆ సమయంలో నొప్పించి ఉండొచ్చుగానీ ఆ తర్వాత మాత్రం సీతారాం చూపిన మార్గమే సరైనదని గుర్తించక మానరు. అట్లా సాహిత్య గమనాన్ని నిరంతరం పరిశీలిస్తూ సీరియస్ విమర్శ వెలువరించారు. విమర్శ అంటే అదేదో బ్రహ్మపదార్థం కాదని దాన్ని కూడా సృజన ప్రక్రియగా సృజించి పాఠక అభిమానుల్ని సంపాదించుకున్న విమర్శకాగ్రేసరుడు సీతారాం.

సీతారాం కవిగా, విమర్శకుడిగా చేసిన కృషి ఎంత కీలకమైందో వారు చేసిన పరిశోధన కూడా అంతే ప్రాముఖ్యతను సంతరించుకుంది. తెలుగులో 1955 నుండి వెలువడిన వచన కవిత్వ అభివ్యక్తిని గురించి సీతారాం చేసిన పరిశోధన నేటికీ ఎంతోమంది స్కాలర్‌లకు ఒక దిక్సూచిగా నిలబడి ఉంది. పరిశోధనను సీతారాం కేవలం పీహెచ్‌డీ పట్టా వరకే పరిమితం చేయలేదు. పీహెచ్‌డీ పరిశోధన అనంతరం అనేక అంశాల మీద వారి పరిశోధన దృష్టిని సారించారు. ఆ నేపథ్యంలో వాగ్గేయ సాహిత్యంలో పర్యావరణ వాదం మీద మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టు చేశారు. తద్వారా తెలుగు సాహిత్యంలో పర్యావరణ వాద పరిశోధనకు, సృజనకు దారులు తెరిచారు.

ఇక అధ్యాపకునిగా సీతారాం చేసిన చేస్తున్న కృషి చారిత్రాత్మకమైంది. తన దగ్గర తెలుగు చదువుకుంటున్న విద్యార్థులను సాహిత్యం మార్గం పట్టిస్తున్నారు. సోషల్ మీడియా జమానాలో పుస్తకాలకు దూరమవుతున్న నేటి తరాన్ని సీతారాం కవులుగా మార్చే బాధ్యతను తన భుజాలకు ఎత్తుకున్నాడు. తాను ఏ కళాశాలలో పని చేసినా విద్యార్థులకు కవిత్వ మెలుకువలు నేర్పుతూ రేపటి కవులను తయారు చేస్తున్న 'కవుల గని' సీతారాం. సృజనాత్మకతకు పూర్తిగా దూరమై మరమనుషులుగా మారుతున్న కాలం పట్ల తీరని వేదనతో నిత్యం తాత్విక చింతన చేస్తున్న ఈ కవిని గురువుగా కలిగి ఉన్న విద్యార్థులు అదృష్టవంతులు. బోధనను కేవలం ఉద్యోగధర్మంగా మాత్రమే కాకుండా దానినొక చారిత్రిక బాధ్యతగా గుర్తించాడు. అందుకే ఈ ఆధునిక కాలపు పోకడలకు దూరంగా నేటి తరాన్ని ఎప్పటికప్పుడు ఒక స్పష్టమైన దార్శనికతతో ముందుకు నడుపుతున్నాడు. సాహిత్యం, జీవితం వేరువేరు కాదని తాను చెప్తున్నదే ఆచరిస్తూ, ఆచరిస్తున్నదే బోధిస్తూ సాహిత్యంలో, సమాజంలో ఒక ధిక్కార బావుటా ఎగురవేస్తున్న బలమైన గొంతుక సీతారాం.

నిరంతర అధ్యయనం, అరుదైన సాహితీ వ్యక్తిత్వం సీతారాం సొంతం. వ్యంగ్య తాత్వికత వెనక ఎంత గాఢత దాగి ఉంటుందో సీతారాం పలికే ప్రతీ మాటలో మనకు స్పష్టంగా కనిపిస్తుంది. పోరాటాల గుమ్మం ఖమ్మం నేల అందించిన ఆణిముత్యం సీతారాం. ఈ కాలాన్ని వెలిగించిన సీతారాం ప్రసరించిన సాహిత్య వెలుగుల మీద ఇప్పటికే ఎంతో మంది లబ్ధప్రతిష్ఠులైన విమర్శకులు, పరిశోధకులు ఎంతో బేరీజు వేసి ఉన్నారు. ఇంత నిండైన సాహితీమూర్తిని దేవులపల్లి రామానుజం అవార్డుకు ఎంపిక చేయడం సముచితమైన గౌరవం. అలుపెరుగకుండా సీతారాం చేస్తున్న ఈ కృషి మరింత ముందుకు సాగాలని ఆశిస్తూ...

■ డాక్టర్ పసునూరి రవీందర్

(నేడు తెలంగాణ సారస్వత పరిషత్‌లో సీతారాంకు దేవులపల్లి రామానుజరావు పురస్కారం అందజేస్తున్న సందర్భంగా)

సురక్షితమైన ఆసుపత్రులు సామాజిక బాధ్యత

కోల్‌కత్తాలో ప్రభుత్వ వైద్య కళాశాలలో డ్యూటీలో ఉన్న వైద్యురాలి హత్యోదంతంపై సుప్రీంకోర్టు తనకు తానే సుమోటోగా స్పందించడం, వైద్యుల రక్షణాంశంపై జాతీయ టాస్క్‌ఫోర్స్ నియమించడం ముదావహం. హీనమైన నేరంపై సత్వరం దర్యాప్తు జరిపి, దోషుల్ని బోనెక్కించడం, బాధిత కుటుంబానికి ఊరటనివ్వడం ఎంత ముఖ్యమో, ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా నివారణా చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం. వైద్యులు, ఆసుపత్రి సిబ్బందిపై దాడుల్ని నివారించేలా కఠినమైన చట్టాలు ఉండడంతోబాటు, ఆ చట్టాల ద్వారా వెంటనే న్యాయం జరుగుతుందని, తప్పు చేసిన వారికి శిక్షపడక తప్పదని వ్యవస్థ తన పనితీరు ద్వారా హెచ్చరించాలి. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో అరకొర శిక్షలతో కొనసాగుతున్న చట్టాల స్థానే, దేశ వ్యాప్తంగా అమలుపరిచే బలమైన చట్టాలు కావాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ తరహా చట్టం దశాబ్దం క్రితం తీసుకువచ్చినపుడు అది బలమైనదే. నేరానికి మూడేళ్ల జైలు శిక్షతో. అయితే తర్వాత వచ్చిన మార్పులతో అంటే ఏడేళ్ళలోపు జైలు శిక్ష పడగల నేరానికి వెంటనే బెయిల్ పొందవచ్చు అన్న మార్పుతో ఆ చట్టం వాడి తగ్గిపోయింది. అందుకనే దాడి చేసినట్లు నేరం నిరూపితమైతే పదేళ్ళకు తగ్గని జైలు శిక్షతో కొత్త చట్టం రావాలి. కోవిడ్ సమయంలో అమలైన ప్రజారోగ్య సేవల చట్టం తరహాలో. శాంతిభద్రతలు, ఆరోగ్యం రాష్ట్రాల పరిధిలో ఉన్న అంశాలే కావచ్చు కానీ, ఆరోగ్య సేవలపై దాడులు దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. దాన్ని నియంత్రించడానికి కఠినంగా వ్యవహరించడంలో తప్పేముంది?

ఇక రెండో విషయం. ఆసుపత్రులకు భద్రత, రక్షణ పెంచకపోతే ఎంత గొప్ప చట్టమున్నా, ప్రయోజనం స్వల్పం. ఆధునిక పర్యవేక్షణా వ్యవస్థ అందుబాటులో ఉంచడంతోబాటు వెంటనే స్పందించే టీములు, కొంత భద్రతా సిబ్బందిని కేటాయించడం అవసరం. ఉద్వేగాలతో రోగి బంధువులు ఉంటారు. బ్యాడ్ న్యూస్‌ని తట్టుకోలేని స్థితిలో ఉండొచ్చు. వారిని వైద్యంపై, చట్టంపై అవగాహనా కార్యక్రమాలతో ఒప్పించవచ్చు. వీటితోబాటు జూనియర్ వైద్యులు ఎంత అసౌకర్యాల నడుమ, ఎక్కువ పని గంటలతో వృత్తి నిర్వహిస్తున్నారో ఈ ఆందోళన సమయంలో తెలిసివచ్చింది. వాటిపై కూడా దృష్టి సారించాలి. పరిస్థితి చక్కదిద్దడానికి సమగ్రమైన కార్యాచరణ కావాలి. ఇది సామాజిక బాధ్యత. అందులో పెద్ద పాత్ర కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలది.

– డి.వి.జి శంకరరావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

మామునూరు విమానాశ్రయంలో ఏఏఐ సర్వే విమానాలు (ఫైల్)





- ఇప్పటికే 700 ఎకరాల అప్పగింత.. మరో 300ఎకరాలు అవసరమని గుర్తించిన ఏఏఐ
- ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల రైతులతో అధికారుల చర్చలు
- భూమికి బదులు భూమి లేదా మార్కెట్ రేటు ఇవ్వాలంటున్న అన్నదాతలు
- నష్టపరిహారం చెల్లింపుపై స్పష్టత ఇవ్వని సర్కారు
- ఇప్పటికే మామునూరులో స్కై అండ్ ల్యాండ్ సర్వే పూర్తి
- 150కిలోమీటర్ల నిబంధన సడలింపుపై 'జీఎంఆర్'తో ప్రభుత్వం చర్చలు

భూసేకరణే అడ్డు!



మామునూరు విమానాశ్రయానికి భూమి కోసం ప్రభుత్వం కసరత్తు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్ విమానాశ్రాయానికి భూసేకరణే ప్రధాన అడ్డంకిగా మారుతోంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టు కోసం 700ఎకరాల భూమిని అప్పగించగా, మరో 300ఎకరాల భూమిని కేటాయించాలని ఎయిర్‌పోర్టు ఆథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రభుత్వాన్ని కోరింది. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్న ప్రభుత్వం.. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. అయితే భూమికి బదులు భూమి ఇవ్వాలని లేదంటే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరను చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రూ.1కోటి నుంచి రూ.2కోట్లకు పైగా ధర ఉంది. దీంతో ప్రభుత్వం రైతులకు చెల్లించే నష్టపరిహారం విషయంలో స్పష్టత ఇవ్వ కపోవటంతో ఎయిర్‌పోర్టుకు భూసేక రణ ప్రధాన అడ్డంకిగా మారిందనే చర్చ జరుగుతోంది.

ఎయిర్‌పోర్టుకు సర్వేలన్నీ అనుకూలమే..



2017 ఏప్రిల్ 27న ఉడో దేశ్‌కే ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద వరంగల్ ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఓఎల్ఎస్ సర్వే, సాయిల్ టెస్టింగ్‌తో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు ఆథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి గత 2023 జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతోపాటు మరోసారి గత ఏప్రిల్‌లో ఏఏఐ అధికారులు ఓఎల్ఎస్ సర్వేతో పాటు మట్టి పరీక్షలు నిర్వహించారు. మూడు విమానాలతో ఎయిర్ వ్యూ చేపట్టారు. విమానాల రాకపోకలకు వాతవారణం అనుకూలంగా ఉందా లేదా అని పరి శీలించారు. జియాజికల్ సర్వేతో పాటు స్కై అండ్ ల్యాండ్ సర్వే చేపట్టారు. సుమా రు రెండు వా రాల పాటు ఏఏఐ సిబ్బంది మామునూనులోనే మకాం వేసి ఎయిర్ పోర్టు నిర్వహణకు కావాల్సిన అన్ని టెస్టులను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించారు. ఇక హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పదం మేరకు 150కి.మీ పరిధిలో 2038 వరకు మరో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్ పోర్టుకు మామునూరు 145కిలో మీటర్ల లోపే ఉంది. ఈ నిబంధనల సడలింపుపై ప్రభుత్వం అభ్యర్థన మేరకు జీఎంఆర్ నుంచి సానుకూలత వచ్చిందని సమాచారం.

అంతర్జాతీయ స్థాయి విమానాలకు అనుకూలంగా...

'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా మారింది వరంగల్ ఎయిన్ పోర్టు పరిస్థితి. అన్ని రకాల అనుమతులు, అనుకూలతలు ఉన్నప్పటికి ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ఏదో ఒక అడ్డంకి ఎదురవుతోంది. గత ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం ప్రయత్నాలు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కావాల్సిన మరో 438 ఎకరాల భూమితో పాటు రూ.1,200కోట్ల నిధులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏఏఐ

మిగతా 7వ పేజీలో..

రైతులతో చర్చిస్తున్నాం..



రేవూరి ప్రకాష్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే

"మామునూరు ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని ఇచ్చేందుకు రైతులతో చర్చలు జరుపుతున్నాం. ఇప్పటికే సంగెం మండలంలోని పలు గ్రామాల్లో సభలు నిర్వహించాం. భూమికి బదులు భూమి కావాలని రైతులు కోరుతున్నారు. లేదంటే బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలని అడుగుతున్నారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే వరంగల్ వాసులకు గగనయానం సాకారం అవుతుందనే నమ్మకం ఉంది."



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా మోదీ పాలన

- బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి
- సెప్టెంబరు 1నుంచి 7వరకు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- హనుమకొండలో రెండో రోజూ సాగిన కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు

7



మాట్లాడుతున్న అంబర్ కిషోర్ ఝా

మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యమివ్వండి

- ట్రై సిటీస్‌లో డ్రంకెన్ డ్రైవ్‌ను కట్టడి చేయాలి
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఆగస్టు 23 : మహిళలు, చిన్నారుల భద్రతకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టేషన్‌లలోని పెండింగ్ కేసులు, కేసు ప్రస్తుత స్థితిగతులు, నిందితుల అరెస్టుకు గల కారణాలు కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ నేరాల నియంత్రణకు అధికారులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ కింది స్థాయి సిబ్బంది పనితీరు పర్యవేక్షించాలన్నారు. మహిళలు, పిల్లలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారు ఇచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తూ బాధితులకు న్యాయం చేయాలని కమిషనర్ సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ట్రై సిటీస్ పరిధిలో ట్రిపుల్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్ కట్టడి చేయాలన్నారు. సన్నిహిత నుంచి ప్రతి ఫిర్యాదును స్టేషన్ అధికారులు క్షేత్ర స్థాయిలో దర్యాప్తు చేపట్టి తగిన నివేదిక అందించాల్సి ఉంటుందని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సెంట్రల్, వెస్ట్ జోన్ డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీలు రవి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

'అడ్డగోలు రిజిస్ట్రేషన్ల'పై విజిలెన్స్ ఆరా

- రంగంలోకి అధికారులు.. వెలుగులోకి మరిన్ని అక్రమాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ప్రకంపనలు

వివరాలు : 7లో..

హైడ్రా తరహాలో డీసీపీ స్థాయి అధికారి

- చిల్డ్రన్స్ పార్కు సుందరీకరణకు రూ.2కోట్లు
- అభివృద్ధి పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కావ్య



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, కుడా చైర్మన్ ఇనగాల

బాలసముద్రం, ఆగస్టు 23 : రానున్న రోజుల్లో హైదరాబాద్ హైడ్రా తరహాలో నగరంలోని అక్రమ కట్టడాల నిర్మూలనకు డీసీపీ స్థాయి అధికారిని వరంగల్‌లో నియమించబోతున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని చిల్డ్రన్స్ పార్కు సుందరీకరణకు రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు శుక్రవారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులతో చిల్డ్రన్స్ పార్కులో అంగవైకల్యం కలిగిన పిల్లలకు వసతిగృహం, ఆడిటోరియం నిర్మాణం, సుందరీకరణ పనులను నిర్ణీత సమయంలో జరిగేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.నగరంలో ఉన్న భద్రకాళీబండ్, పద్మాక్షమ్మగార్డెన్, ఏకశిలాపార్కు, పబ్లిక్ గార్డెన్‌లలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీస్ వారికి ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.

ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి వరంగల్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు 7వ డివిజన్ కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, స్థానిక మాజీ కార్పొరేటర్ కేశిరెడ్డి మాధవిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్‌యాదవ్, నాయిని లక్ష్మారెడ్డి, బొంత సారంగం, వల్లపు రమేష్, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

ఓటర్ల జాబితాలో సవరణలకు అవకాశం

- జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 23 : ఓటర్ల జాబితాలో సవరణల కోసం ఎన్నికల సంఘం ఓటర్లకు అవకాశం కల్పించిందని, ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు ఫొటో వివరాలతో కూడిన ఓటర్ల జాబితాలో సవరణలు చేసుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. అక్టోబరు 29న సవరణ చేసిన ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఆ రోజు నుంచి నవంబరు 28 వరకు ఓటర్ల జాబితాలో అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. ఓటర్ల జాబితా 2025 జనవరి 1 తేదీ నాటికి అర్హత అని తెలిపారు. తుది ఓటర్ల జాబితాను 2025 జనవరి 6న విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాలో సవరణల కోసం రాజకీయ పార్టీల ప్రతినిధులు బీఎల్‌వో లకు సహకరించాలని కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సమగ్రంగా నూతన ఆర్‌వోఆర్

- సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ ప్రావీణ్య పిలుపు
- నూతన ఆర్‌వోఆర్‌పై కలెక్టరేట్‌లో చర్చాగోష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 23 : నూతన ఆర్‌వోఆర్-2024 సమగ్రంగా ఉందని, ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జిల్లాస్థాయిలో నూతన రెవెన్యూ(ఆర్ఓఆర్) 2024 ముసాయిదా చట్టంపై రెవెన్యూ అధికారులు, జిల్లాలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్‌లు, విశ్రాంత రెవెన్యూ అధికారులు, న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులతో చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. నూతన చట్టానికి సంబంధించి సలహాలు, సూచనలు ప్రభుత్వానికి నివేదించేందుకు చర్చా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. నూతన ఆర్‌వోఆర్ చట్టంలో పొందుపరిచిన అంశాలతో పాటు ఇంకా ఏవైనా చేర్చాల్సిన అంశాలు, ఏవైనా లోపాలు ఉన్నట్లయితే సలహాలు, సూచనలు తోడ్పడతాయన్నారు. నూతన ఆర్‌వోఆర్ ముసాయి దా చట్టంలో భూ సమస్యల పరిష్కారానికి చాలా అంశాలు ఉన్నాయన్నారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజాప్రభుత్వం నూతన చట్టం రూపకల్పనకు సలహాలు, సూచనలు తీసుకుంటుందన్నారు. నూతన చట్టం ముసాయిదాపై చర్చా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ సంబంధిత అంశాలను తెలియజేసేందుకు ఇదొక మంచి అవకాశమని, నూతన చట్టాన్ని అభిప్రాయాలు తెలియజేయా లన్నారు.

హనుమకొండ ఆర్డీవో వెంకటేష్ మాట్లాడుతూ.. 20 సెక్షన్‌లలో వివిధ అంశాలను నూతన రెవెన్యూ చట్టంలో పొందుపరిచారని పేర్కొన్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు సంబంధించి హక్కులకు ముసాయిదా రూపకల్పన చేస్తుంద న్నారు. ఈ చర్చాగోష్టి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, వ్యవసాయ శాఖ జేడీ రవీందర్ సింగ్, రెడ్‌క్రాస్ సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, మాజీ మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్ రెడ్డి, రైతు సంఘాల ప్రతినిధులు రాయపురం సాంబయ్య, అబ్బు పక్రాశ్ రెడ్డి, కొమ్మల భాస్కర్, బుచ్చిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, కొలుగూరి రాజుతోపాటు అధికారులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

- డీవైఎస్‌వో అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 23 : జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఉపాధి అందించడమే ధ్యేయంగా పని చేస్తున్న వృత్తి నైపుణ్య కేంద్రంలో ప్రవేశ పెట్టిన కోర్సులను నేటి యువత సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి (డీవైఎస్‌వో) గుగులోత్ అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం హనుమకొండ బస్టాండ్ రోడ్డులోని వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో గత మూడు నెలలుగా వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. పరీక్షల పరిశీలకుడు ఎం.నాగేశ్వర్‌రావు పర్యావే క్షణలో ఏర్పాటు చేసిన పరీక్షల కేంద్రాన్ని అశోక్‌కు మార్ సందర్శించి మాట్లాడారు. ఎంఎస్ ఆఫీస్, బ్యూటీషన్, గార్మెంట్ మెకింగ్, మొబైల్స్ సర్వీసింగ్, రిఫ్రిజిరేటర్, ఏసీ, ఫ్యాషన్ డిజైన్‌లో మూడు నెలల పాటు శిక్షణ పొందిన 17వ బ్యాచ్‌కి చెందిన అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి సర్టిఫికెట్లను అందించడం జరుగుతుందన్నారు. దీంతో వారు ఎంచుకున్న రంగంలో స్వయం ఉపాధి పొందడంతో పాటు వివిధ ప్రైయివేటు కంపెనీలు జాబ్ మేళాలు నిర్వహించిన సమయంలో ఇక్కడ శిక్షణ పొంది ఉత్తీర్ణత సాధించిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నా రు. ప్రతీ మూడు నెలల కాల పరిమితితో ఒక్కో బ్యాచ్ వివిధ కోర్సుల్లో యువత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వై. విజయశ్రీ, వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో యువతకు పరీక్షలు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అశోక్‌కుమార్

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

జడ్పీ సీఈవో విద్యాలత

హసన్‌పర్తి, ఆగస్టు 23: మహాత్మా జ్యోతిబా పూలే బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన నాణ్యమైన విద్యను అందించాలని జెడ్పీ సీఈవో విద్యాలత అన్నారు. మండలంలోని ఎల్లాపూర్‌లో గల తిమ్మాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల విద్యాలయాన్ని శుక్రవారం విద్యాలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిస్థితిని, ఉపాధ్యాయుల పనితీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, డైనింగ్ హాల్, స్టాక్ రూం, రన్నింగ్, ఆర్‌వో వాటర్, టాయిలెట్స్‌తో పాటు ఇతర వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా పనిచేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమస్యలు వచ్చినప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులను సమన్వయం చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు మెరుగైన వసతులను సమకూర్చేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులున్నారు.



డైనింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో విద్యాలత



ప్రేమపెళ్లి చేసుకుని ముఖం చాటేశాడు

భర్త, ఆరుగురిపై కేసు నమోదు

భీమదేవరపల్లి, ఆగస్టు 23: మండలంలోని ముల్కనూర్‌లో ప్రేమ వివాహం చేసుకొని ముఖం చాటేసిన భర్తతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ముల్కనూర్ ఎస్‌ఐ సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రికి చెందిన ఉడిపి చంద్రకళను మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన బొల్లంపల్లి రంజిత్ 2018లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. చంద్రకళతో రంజిత్ సుమారు ఏడేళ్లు సహజీవనం చేశాడు. గత నెల జూలై 29న తన ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన రంజిత్.. భార్య చంద్రకళ వద్దకు రావడం లేదు. దీంతో అనుమానం వచ్చిన చంద్రకళ ముల్కనూర్‌లోని అత్తాగారి ఇంటికి వచ్చి తన భర్త రంజిత్ కోసం వాకప్ చేసింది. రూ. 50 లక్షల కట్నం ఇవ్వాలని చంద్రకళను భర్త రంజిత్, అత్తామామలు రామచంద్రం- కనకలక్ష్మి, ఆడబిడ్డలు రమాదేవి, ధనలక్ష్మిలు బెదిరిస్తున్నారు. దీంతో చంద్రకళ పోలీసులకు ఫిర్యాదు చేయగా, భర్త రంజిత్‌తో పాటు వారి కుటుంబ సభ్యులు రామచంద్రం, కనకలక్ష్మి, బొల్లంపలి రాజు, రమాదేవి, ధనలక్ష్మిలపై కేసు నమోదు చేసినట్లు ముల్కనూర్ పోలీసులు తెలిపారు. రంజిత్ పరారీలో ఉన్నాడు.

రికార్డుల్లో ఎక్కువ.. హాస్టల్‌లో ఉన్న విద్యార్థుల సంఖ్య తక్కువ

అధికారుల తనిఖీలో గుట్టు రట్టు

ఆత్మకూరు, ఆగస్టు 23: హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నా.. రికార్డులో మాత్రం విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూపిస్తున్న విషయం అధికారుల తనిఖీల్లో బయటపడింది. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో ఎస్సీ బీసీ రెండు హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో 43 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డుల్లో పేర్లు ఉన్నాయి కానీ రెండు హాస్టల్‌లో కేవల 17 మంది విద్యార్థులు ఉన్నారని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, నాయిని జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య ఆదేశానుసారం రెండు హాస్టల్‌లను ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఆర్‌ఐ రవీందర్‌రావు ఆకస్మిక తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థులకు సరైన వసతులు లేకపోవడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా లేని విషయాలను గుర్తించారు. ఈ విషయాలను జిల్లా కలెక్టర్ కు నివేదికను సమర్పిస్తామన్నారు. సరైన వసతి లేకపోవడంతో విద్యార్థులు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లిపోతున్నట్లు విద్యార్థులు తెలిపారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు















'అడ్డగోలు రిజిస్ట్రేషన్ల'పై విజిలెన్స్ ఆరా

- రంగంలోకి అధికారులు.. వెలుగులోకి మరిన్ని అక్రమాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ప్రకంపనలు



రాంనగర్, ఆగస్టు 23 : వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 'నిబంధనలు మరిచి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు' చేశారన్న అంశంపై విజిలెన్స్ అధికారులు ఆరా తీశారు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనం రిజిస్ట్రేషన్ శాఖలో తీవ్ర ప్రకంపనలు రేపింది. ఈ రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు జిల్లాలోని మిగిలిన కార్యాలయాల్లో పరిస్థితంతా గప్‌చుప్‌గా మారినట్టు తెలిసింది. ఇటీవల బదిలీపై వచ్చిన ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వహించినట్టు సమాచారం. ఎవరితో మాట్లాడితే ఏమవుతుందో అనే అనుమానంతో మౌనంగానే విధులు నిర్వహించి వెళ్లినట్టు తెలిసింది. కాగా బదిలీపై వెళ్లిన ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు నిబంధనలు విస్మరించి నాన్ లేఅవుట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి అందినకాడికి దండుకున్నారనే విషయమై విజిలెన్స్ అధికారులు ఆరా తీసినట్టు సమాచారం. రెండు కార్యాలయాల్లో గత ఆరు నెలల్లో జరిగిన ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వివరాలు సేకరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. సోమవారం రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని రికార్డులను పరిశీలించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

వెలుగులోకి మరిన్ని అక్రమాలు

కాగా వరంగల్ రూరల్, ఖిలా వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు పరకాల, మహబూబాబాద్, ములుగు కార్యాలయాల్లో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు తెలిసింది. నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లతో పాటు పహాణీలతో రిజిస్ట్రేషన్లు చేసినట్టు తెలిసింది. పూర్వీకులు అమ్ముకున్న స్థలాలను కుటుంబ సభ్యులు విక్రయించడం లాంటి రిజిస్ట్రేషన్లు చేశారని, వరంగల్ రూరల్ కార్యాలయంలో కొద్దిరోజులు ఇన్‌చార్జ్‌గా బాధ్యతల్లో ఉన్న ఒక అధికారి వరంగల్ ప్రాంతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారని సమాచారం. ఈ అధికారి నిబంధనలు తుంగలో తొక్కి పహాణీలతో రిజిస్ట్రేషన్లు చేశాడనే ఆరోపణలున్నాయి. పరకాలలో కూడా నాన్ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు, పార్ట్ రిజిస్ట్రేషన్లు భారీగానే జరిగినట్లు తెలిసింది. ఈ దందాలో పెద్ద మొత్తంలో కాసులు చేతులు మారినట్టు తెలుస్తుండగా ఇటీవల ఏసీబీకి పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ హయంలో జరిగిన రిజిస్ట్రేషన్లు పరిశీలిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశమున్నట్టు చర్చ జరుగుతోంది. ఇక మహబూబాబాద్, ములుగు కార్యాలయాల పరిధిలో నాన్ లేఅవుట్ వెంచర్లకు సంబంధించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లు పెద్ద ఎత్తున జరిగినట్లు తెలుస్తుండగా గతేడాది కాలంగా ఈ దందా విచ్చలవిడిగా జరిగినట్లు సమాచారం. అధికారులు వరంగల్ రూరల్, ఖిలా వరంగల్, పరకాల, మహబూబాబాద్, ములుగు కార్యాలయాల్లోని రికార్డులు పరిశీలిస్తే మరిన్ని అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 23: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం యార్డు బంద్, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు కార్యదర్శి ఆ ప్రకటనలో తెలిపారు. మంగళవారం మార్కెట్లో క్రయవిక్రయాలు యథావిధిగా నిర్వహించబడుతాయని, రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని కోరారు.

మెట్టుగుట్ట ఆలయ అర్చకుడిపై ఫిర్యాదులు

విచారణ చేపట్టిన డిప్యూటీ కమిషనర్?

వరంగల్ కల్చరల్, ఆగస్టు 23 : మడికొండ మెట్టుగుట్టలోని మెట్టు రామలింగేశ్వర దేవాలయం ఆలయ అర్చకుడిని శుక్రవారం జిల్లా సహాయ కమిషనర్ రాయల సునీతతో కలిసి ఆలయానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు సమాచారం. డబ్బులు వసూలు చేయడమేకాక, డబ్బున్న వారికే ప్రాధాన్యమిస్తున్నారంటూ భక్తులు దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావుకు అర్చకుడు అభిలాష్‌శర్మపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఆలయానికి చేరుకొని దేవాదాయ శాఖ ఆలయ క్లర్క్ భాస్కర్‌పై కూడా ఆరోపణలు ఉన్న నేపథ్యంలో డీసీ భక్తులను అర్చకుడిని, క్లర్క్‌ను విచారించినట్లు తెలిసింది.



మన్‌షాన్‌పల్లి పాఠశాలను శుభ్రం చేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ పర్వరాములు

కొలువులకు.. భద్రతేదీ?

- ఆర్థిక ఇబ్బందులతో పార్ట్‌టైం స్వీపర్లు
- పర్మినెంట్ చేస్తారని 30ఏళ్లుగా ఎదురుచూపు
- హైపవర్ కమిటీ వేసినా ఫలితం శూన్యం
- ఏపీలో పాతికేళ్ల క్రితమే క్రమబద్ధీకరణ
- తెలంగాణలో ఇప్పటివరకు అతీగతీ లేదు

బచ్చన్నపేట, ఆగస్టు 23: మంచి రోజులు రాకపోతాయా.. దశ మారకపోతుందా.. అని పార్ట్ టైమ్ స్వీపర్లు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. ఎప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందుతామని, కనీస వేతనం అందుతుందని 30 ఏళ్లకు పైగా చాకిరీ చేస్తున్నారు. చాలీచాలని జీతంతో ఇబ్బందులు పడుతూ బతుకుబండిని నెట్టుకొస్తున్నారు. రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో దశాబ్ధాలుగా పని చేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ల దుస్థితి ఇది. వీరిలో ఇప్పటికే అనేక మంది మృతి చెందగా, కొందరు రిటైర్ అయ్యారు. 1983లో పార్ట్‌టైం స్వీపర్లుగా ఆంధ్ర, తెలంగాణాలో ఒకేసారి నియామకం అయినప్పటికీ 1994లో అక్కడి వారిని పర్మినెంట్ చేశారు. కాని తెలంగాణలో ఇప్పటి వరకు మోక్షం కలగలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయని ఆశించినప్పటికీ వారికి నిరాశే ఎదురైంది. మొదట్లో వీరికి నెలకు రూ. 150 జీతం వచ్చేది. అతి తక్కువ జీతమైనప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో కొలువు అన్న భావనతో పని చేస్తున్నారు. పర్మినెంట్ అయితే జీతం పెరుగుతుందని ఆశతో జీవిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 500 మంది ప్రస్తుతం పనిచేస్తున్నారని సంఘం నేతలు చెబుతున్నారు. వారిలో జనగామ జిల్లా నుంచి 35 మంది ఉన్నారు.

హైపవర్ కమిటీ వేసినా ఉపయోగం లేదు..

వేతనాలు పెంచాలని, పర్మినెంట్ చేయాలని పార్ట్‌టైం స్వీపర్లు చేసిన ఆందోళనలతో 1992లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వారిని పర్మినెంట్ చేసేందుకు హైపవర్ కమిటీ వేశారు. ఏపీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీ స్వీపర్ల క్రమబద్దీకరణకు అనుకూలంగా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. వీరి వేతనాన్ని స్థిరీకరించి టైమ్ స్కేల్ ఇవ్వాలని ఆదేశించింది. కాని, ఈ ఉత్తర్వులు అమలు కాకపోవటంతో హైకోర్టుకు వెళ్లారు. దీంతో ఈ విషయంలో ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీవోఎంఎస్ నెం.212 ద్వారా 1994 ఏప్రిల్ 22న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో స్వీపర్లు ఇక తమ కష్టాలు గట్టెక్కినట్టేనని సంబరాలు చేసుకున్నారు. కాని ఆంధ్ర ప్రాంతంలో పని చేసిన అధికారులు అక్కడ పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లను పర్మినెంట్ చేశారు. వారు ప్రస్తుతం రూ.20 వేల జీతం పొందుతున్నారు. కానీ తెలంగాణలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. తర్వాత తమ సమస్యలు పరిష్కరించాలని 2007లో చలో సీఎం కార్యక్రమం నిర్వహించి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఎదుట తమ గోడును వెళ్లబోసుకున్నారు. అయినా స్పందన లేకపోవడంతో మానవ హక్కుల సంఘాన్ని సైతం ఆశ్రయించారు. దీంతో వారికి అనుకూలంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, ఆర్థిక శాఖల అధికారులను సంఘం ఆదేశించింది. వీరి వివరాలు తెప్పించుకున్న అధికారులు అంతటితోనే చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం నెలకు రూ. 5200 ల వేతనంతో జీవితం గడుపుతున్నారు. పార్ట్ టైం స్వీపర్లు పనిచేస్తున్న పాఠశాలల హెచ్‌ఎంలు అటెండెన్స్ పత్రాలను ఎంపీడీవోకు ప్రతీనెల పంపిస్తే వారు బిల్లులు చేసి ఎస్‌టీవోకు పంపుతారు. మూడు మాసాలు, ఆరు మాసాలకోమారు జిల్లా పరిషత్ నుంచి వచ్చే కాంటిన్‌జెన్సీ నిధులు జమచేస్తే వీరికి జీతాలు ఖాతాల్లో పడుతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తమ బాధను అర్థం చేసుకుని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు అమలు చేయాలని స్వీపర్లు కోరుతున్నారు.

ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలి

- గూడముల అయోధ్య, పార్ట్‌టైం స్వీపర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



తెలంగాణ రాష్ట్రం వచ్చాక మా బతుకులు మారుతాయనుకున్నాం. కాని, మమ్మల్ని పర్మినెంట్ చేయటంలో కేసీఆర్ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. 1983 నుంచి అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రస్తుతం పని చేస్తున్నావారిని పర్మినెంట్ చేయడంతో పాటు మృతి చెందిన వారి కుటుంబాలకు, రిటైర్ అయిన వారి కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలి.

కట్కూరు బడిలో 35 ఏళ్లు పనిచేశా..

- బాలమల్లయ్య, రిటైర్డ్ పార్ట్‌టైం స్వీపర్, కట్కూరు



కట్కూరు ప్రైమరీ పాఠశాలలో 35 ఏళ్లు పనిచేశా. ప్రారంభంలో రూ. 150 జీతం ఇచ్చేవారు. రిటైర్‌మెంట్ సమయానికి రూ. 4 వేలు చేశారు. ఉద్యోగంలో చేరే సమయంలో కొద్ది రోజుల్లోనే పర్మినెంట్ చేస్తామన్నారు. ఇప్పటి వరకు అమలు చేయలేదు. అనేక సార్లు ఆందోళనలు చేశాం. కోర్టుకు వెళ్లాం. అయినా మా బతుకులు మారలేదు. మంచి రోజులు రాకపోతాయా అని ఎదురు చూస్తూ మా జీవితాలను బజారున పడేసుకున్నాం. ప్రస్తుతం పనిచేస్తున్న వారికైనా ప్రభుత్వం న్యాయం చేయాలి.

సీఆర్‌పీఎఫ్ వాహనం నుంచి కిందపడ్డ కార్బన్ వెపన్

- ఆయుధాన్ని పోలీస్ స్టేషన్‌లో అందజేసిన ఆటోడ్రైవర్
- సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి గన్‌ను అప్పగించిన పోలీసులు

మట్టెవాడ, ఆగస్టు 23: వరంగల్ ఎంజీఎం జంక్షన్ సమీపంలో సీఆర్‌పీఎఫ్ ట్రక్ వాహనం నుంచి కార్బన్ వెపన్ ఎంజీఎం జంక్షన్ సమీపంలో కిందపడిపోయింది. అదే సమయంలో అటు వైపు నుంచి వస్తున్న ఆటో డ్రైవర్ గమనించి ఆ ఆయుధాన్ని మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో అప్పగించిన ఘటన వరంగల్‌లో చోటు చేసుకుంది. వరంగల్ మట్టెవాడ సీఐ గోపి కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో భీమారంలోని సీఆర్‌పీఎఫ్ బెటాయిన్ మణిపూర్‌కు వెళ్లేందుకు ప్రత్యేక వాహనాల్లో సిబ్బందితోపాటు ఆయుధాలను వరంగల్ రైల్వేస్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో వాహనం నుంచి సీలింగ్ ఊడిపోయి కార్బన్ వెపన్ కింద పడిపోయింది. అదే సమయంలో పైడిపల్లికి చెందిన ధరావత్ శ్రీను ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా, ఓ షోరూం ఎదురుగా ఉన్న రోడ్డుపై ఆయుధం ఉండడాన్ని గుర్తించాడు. వెంటనే అతడు మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో విధుల్లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ ధర్మనాయక్‌కు అప్పగించారు.

కొంత సమయం తర్వాత సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వెపన్ వెతుకుతున్న క్రమంలో స్టేషన్‌లో అప్పగించినట్లు తెలుసుకున్నారు. దీంతో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ రాజేష్‌కుమార్ పోలీసు స్టేషన్‌కు చేరుకొని విషయం వెల్లడించగా వారు ఆయుధాన్ని అప్పగించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీరకం)	2711	2572
పల్లికాయ(పచ్చిది)	3900	3200
పల్లికాయ(సూక)	5900	5000
పెసర	5855	5155
పత్తి	7410	5000
పసుపు(కాడి)	12223	12223
పసుపు(గోల)	12226	12226
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	18000	15000
వండర్‌హాట్ ఏసీ	14800	11000
యూఎస్341 ఏసీ	14500	11000
తాలు మిర్చి	6000	3000

రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా మోదీ పాలన

- బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శులు నారాయణ
- హనుమకొండలో రెండో రోజూ సాగిన కౌన్సిల్ నిర్మాణ సమావేశాలు



వయనాడ్ బాధితుల కోసం డి.రాజాకు చెక్కు అందిస్తున్న నాయకులు

బాలసముద్రం, ఆగస్టు 23 : నరేంద్రమోదీ ఎన్నికల్లో గెలిచినా నైతికంగా ఓడిపోయారని, ఆయన పాలన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా సాగుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. హనుమకొండలోని హరితకాకతీయ హోటల్‌లో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. 'దేశంలోని మహిళలకు న్యాయం చేస్తాం.. సబ్ కే సాత్.. సబ్ వికాస్' అని ప్రకటించిన మోదీ ప్రభుత్వం తమ నినాదాన్ని మార్చుకుని తమతో ఎవరుంటే.. వారితో తాముంటాం అనే కొత్త నినాదాన్ని అమలు చేస్తోందని ఆరోపించారు. దేశంలో మహిళలకు రక్షణ లేదని, వివిధ రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలలో కేంద్రం ద్వారా నామినేట్ చేయబడిన గవర్నర్లతో రాజ్యాంగ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగుతోందని, ఏపీ సీఎం చంద్రబాబు, నితీష్‌కుమార్ మద్దతు ఇవ్వకుంటే కేంద్ర ప్రభుత్వం పడిపోతుందన్నారు. దేశంలో సీబీఐ సంస్థ అత్యంత పవర్‌ఫుల్ సంస్థ అని ఆ సంస్థ అదానీ చేతిలోకి వెళ్లిందని విమర్శించారు. దేశంలోని బీజేపీ వ్యతిరేక పార్టీలు అధికారంలో ఉన్న తమిళనాడు, కేరళ, ఢిల్లీ, కర్నాటక సీఎంలను సీబీఐ సంస్థలతో ఇబ్బందులకు గురి చేసిందన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మధ్య దూరం పెరిగిందని, ప్రధాని మోదీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు జాతీయ స్థాయిలో ఉన్న ఇమేజ్‌ను వాడుకుని దేశంలో రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన చేస్తున్నారన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, అమరావతికి రూ.వేల కోట్ల నిధులు ప్రపంచ బ్యాంకుల నుంచి అప్పులు ఇప్పించి మోదీ చంద్రబాబును పావుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తీర్పును సీపీఐ స్వాగతిస్తున్నట్లు నారాయణ తెలిపారు. వర్గీకరణకు క్రీమీలేయర్‌కు సంబంధంలేదని, రాష్ట్రంలో ప్రజల సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బీజేపీలో బీఆర్‌ఎస్ విలీన మవుతుందని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతుండగా, రేవంత్ బీజేపీలో చేరుతారని బీఆర్‌ఎస్ నాయకులు అంటున్నారన్నారు. రెండు పార్టీలు రాజకీయ క్రీడ ఆడుతున్నారని, ప్రజలకు కావాల్సింది, అభివృద్ధి, సంక్షేమం అని నారాయణ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన సరిగ్గా చేసుకోవాలని హితవు పలికారు. దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపో యాయని ధరల నియంత్రణ డిమాం డ్ చేస్తూ సెప్టెంబరు 1 నుంచి 7వరకు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నామని, ఈ ప్రజా పోరాటాలలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ, సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా మాట్లాడుతూ ప్రజలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకువచ్చిందని, ప్రజలకు, ప్రజాస్వామిక వాదులతో చర్చించకుండా ఇటీవల న్యాయ చట్టాలు రూపొందిం చిందన్నారు. దేశంలో విద్యా, వైద్యం పేద ప్రజలకు అందడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, పల్లా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మా, కలవేణ శంకర్, ఎం. బాలనరసింహా, బి. విజయసారథి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వయనాడు బాధితులకు సీపీఐ తెలం గాణ సమితి నుంచి రూ.5.41లక్షల ఆర్థిక సహాయాన్ని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అందించారు.



మాట్లాడుతున్న ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్, చైర్మన్ కరుణాకర్‌రెడ్డి

ఏకశిల ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతం

వరంగల్ మెడికల్, ఆగస్టు 23 : తెలంగాణలో (హైదరాబాద్ మినహా) తొలి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను హనుమకొండలోని ఏకశిల ఆస్పత్రిలో విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్, చైర్మన్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏకశిల హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాయపర్తి గ్రామానికి చెందిన గాదె విజయ్ కుమార్ గత ఏడు సంవత్సరాలుగా కిడ్ని సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా డయాలసిస్‌పై ఉండగా హాస్పిటల్‌లోని నెఫ్రాలజిస్టు డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన్ కుమార్‌ల సూచన మేరకు డయాలసిస్ టెక్నికల్ మేనేజర్ రమేశ్ ప్రోద్బలంతో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పేషంట్ భార్య ఉమాదేవి కిడ్నీని దానం చేసింది. ఈ క్రమంలో భార్యాభర్తలిద్దరిని వైద్య బృందం సునిశితంగా పరీక్షించి శస్త్ర చికిత్సకు వెళ్లవచ్చని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ శస్త్ర చికిత్సలో ట్రాన్స్‌ప్లాంట్ యూరాలజిస్టు డాక్టర్ ఎస్.జయరాంరెడ్డి, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి, డాక్టర్ శివకుమార్, నెఫ్రాలజిస్టు డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన్‌కుమార్, అనస్థీషియా డాక్టర్ వి.రమేశ్‌ల ఆధ్వ ర్యంలో ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా చేసినట్లు తెలిపారు. శస్త్ర చికిత్స అనంతరం పేషంట్‌తోపాటు కిడ్నీ దాత ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నట్లు వివరిం చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, డాక్టర్లు, వైద్య బృందం, హాస్పిటల్ ఆర్‌ఎంవో డాక్టర్ వెంకట్‌రెడ్డి, జనరల్ మేనేజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కొడుకు మృతి..

- తట్టుకోలేక ఆగిన సవతితల్లి గుండె
- మహబూబాబాద్‌లో విషాద ఘటన

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 23 : తన కడుపున పుట్టకపోయినా.. కన్నవారితో సమానంగా ఆ కుమారుడిని సాకింది ఆ తల్లి. సవతితల్లి అనే మాటే కానీ పిల్లలను పెంచే విషయంలో ఎక్కడా సొంత తల్లి లేని లోటును కనిపించకుండా పెంచి పోషించింది. అలాంటి ఆ తల్లి అనారోగ్యంతో మృతి చెందిన కుమారుడి మృతదేహంపై పడి రోదిస్తూ ప్రాణాలొదిలిన విషాద సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు శనిగపురంలో శుక్రవారం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.

శనిగపురం గ్రామానికి చెందిన మంద వెంకన్న రైల్వే ట్రాక్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వెంకన్న భార్య స్వరూప 30 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటికే వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. భార్య చనిపోవడంతో వెంకన్న పిల్లల ఆలనాపాలన కోసం చిన్న గూడూరు మండలం జయ్యారానికి చెందిన జ్యోతి (50)ని రెండో వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత జ్యోతి ఆ ముగ్గురు పిల్లల బాగోగులు చూసుకునేది. ఈ క్రమంలోనే వెంకన్న, జ్యోతికి ఓ కుమారుడు, కుమార్తెకు జన్మించారు. అయినప్పటికి జ్యోతి ఐదుగురు పిల్లలను తారతమ్యం లేకుండా పెంచి పెద్ద చేసింది. మొత్తం ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులకు వివాహాలు చేసింది. ఏడాది క్రితం వెంకన్న కూడా చనిపోవడంతో జ్యోతి ఖమ్మంలోని తన కూతురు వద్ద ఉంటోంది. ఈ క్రమంలో వెంకన్న మొదటి భార్య కుమారుడు రవి (32) శనిగపురంలో ఆటో నడుపుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కానీ, ఇటీవల కాలంలో మద్యానికి బానిసైన రవి తరచూ గొడవపడటంతో అతడి భార్య స్వప్న నాలుగు నెలల క్రితం నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలోని తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయిన రవి అనారోగ్యం పాలై గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు ఖమ్మంలో ఉన్న సవతితల్లి జ్యోతికి సమాచారం అందించారు. శుక్రవారం ఉదయం శనిగపురం చేరుకున్న జ్యోతి రవి మృతదేహంపై పడి గుండెలవిసేలా రోదించింది. ఈ క్రమంలోనే గుండెపోటుకు గురై కొడుకు మృతదేహంపైనే అపస్మారక స్థితిలో పడిపోవడంతో కుటుంబసభ్యులు స్థానిక వైద్యుడికి చూపించారు. అయితే అప్పటికే జ్యోతి మృతి చెందినట్టు నిర్ధారించారు. అనంతరం కుటుంబసభ్యులు రవి అంత్యక్రియలను నిర్వహించి.. జ్యోతి మృతదేహాన్ని ఆమె పుట్టినిల్లయిన చిన్నగూడూరు మండలం జయ్యారానికి తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు రవికి భార్య స్వప్న, నాలుగేళ్ల కుమారుడు నవనీత్‌కుమార్ ఉండగా.. నాలుగేళ్ల నవనీత్ కుమార్ తండ్రికి తలకొరివి పెట్టడం చూసి స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ఇక తనకు పుట్టకపోయినా చిన్నప్పటి నుంచి ప్రేమగా పెంచి పోసించిన కుమారుడు ఇలా చనిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయిన జ్యోతి అతడి మృతదేహంపై పడి మృతి చెందడం తమను కలిచివేసిందని కుటుంబసభ్యులు, గ్రామస్థులు చెబుతున్నారు.




మంద రవి (ఫైల్) జ్యోతి (ఫైల్)



రమేష్ అంతిమసంస్కారాలు నిర్వహిస్తున్న చిన్నారి నవనీత్

భూసేకరణే అడ్డు!

5వ పేజీ తరువాయి

కోరింది. అయితే గత ప్రభుత్వం రూ.520కోట్ల నిధులతో పాటు 253 ఎకరాల భూమిని కేటాయించేందుకు ముందుకు వచ్చింది. దీనికి సంబంధించి 2023 ఆగస్టు నెలలో జీవో ఎంఎస్ నెం.36ని జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను ఏఏఐ పరిగణనలోకి తీసుకోకపోవటం, భూసేకరణ, నిధులు విడుదల చేయటంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విమానాశ్రయం పనులు 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అనే చందంగా మారింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మామునూరు ఎయిర్‌పోర్టుపై దృష్టి పెట్టింది. దీంతో రంగంలోకి దిగిన ఏఏఐ అధికారులు మామునూరులో ఉన్న పాత 1.8కి.మీ రన్‌వేను పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయిలో విమానాలు నడిపించేందుకు అనుకూలంగా ఉండేలా ప్రస్తుతం ఉన్న 1.8కి.మీల రన్‌వేను 3.9కి.మీలకు పెంచాలని ఏఏఐ అధికారులు సూచించారు. ఇప్పటికే పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 694ఎకరాల వరకు భూమి ఉంది. కనీసం మరో 306 ఎకరాల భూమిని కేటాయిస్తే పెద్ద విమానాలు నడిపించేలా రన్‌వేను నిర్మించవచ్చునని ఏఏఐ అధికారులు ప్రభుత్వానికి సూచించారు. వరంగల్ ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ స్థాయిలో విమానాలను నడిపించేందుకు కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నట్లుగా అధికారులు నిర్ధారించినట్లుగా సమాచారం.

భూసేకరణే ప్రధాన అడ్డంకి..

వరంగల్ ఎయిర్‌పోర్టుకు ప్రధానంగా భూసేకరణే అడ్డంకిగా మారుతోంది. నిజాం కాలంలో 1,875ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టు కోసం కేటాయించారు. అయితే ప్రస్తుతం ఇందులో నుంచి జవహర్ నవోదయ విద్యాలయానికి 23.20ఎకరాలు, పోలీస్ శిక్షణ కళాశాలకు 59ఎకరాలు, ఏసీపీ కార్యాలయానికి 10ఎకరాలు, వరంగల్ సెంట్రల్ జైలుకు 101ఎకరాలు, ఫోర్త్ బెటాలియన్‌కు 241.24ఎకరాలు, మరో 675 ఎకరాల భూమిని వెటర్నరీ యూనివర్సిటీకి కేటాయించారు. రోడ్లు, ఇతర వాటికి పోగా ప్రస్తుతం 696ఎకరాల స్థలం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. అయితే ఎయిర్‌పోర్టుకు 1,200ఎకరాల భూమి అవసరం కాగా, కనీసం వెయ్యి ఎకరాల భూమి అయినా ఇవ్వాలని కేంద్ర విమానాయశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇంకా 304ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. జూన్ 29న వరంగల్ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఏఏఐ అధికారులతో ప్రభుత్వం జరిపిన చర్చల మేరకు త్వరగా ఎయిర్‌పోర్టుకు భూమి కేటాయించాలని రెవెన్యూ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో వరంగల్ జిల్లా కలెక్టర్‌తో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగెం మండలంలోని గుంటూరుపల్లి, నక్కలపల్లి, గడపల్లి, మామునూరు గ్రామాల్లో భూసేకరణ కోసం గ్రామసభలు నిర్వహించారు. ఎయిర్‌పోర్టుకు కావాల్సిన భూమిని రైతుల నుంచి 259ఎకరాల వరకు సేకరించాలని నిర్ణయించారు. అయితే ఎయిర్‌పోర్టుకు భూములు ఇచ్చేందుకు రైతులు సానుకూలంగానే ఉన్నారు. కానీ, తమకు భూమికి బదులుగా మరో చోట భూమి కావాలని పట్టుబడుతున్నారు. వెటర్నరీ కాలేజీలో అదనంగా ఉన్న సుమారు 60ఎకరాల భూమిని రైతులు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్చలు జరిపింది. అయితే ఆ భూమి సాగుకు అనుకూలంగా లేని చౌడు నేల కావటంతో రైతులు విముఖత చూపుతున్నట్లుగా సమాచారం. ప్రత్యామ్నాయంగా భూమి లేకపోవటంతో నష్టపరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఎకరానికి రూ.80లక్షలు చెల్లించేందుకు రైతులతో అనధికారికంగా చర్చలు జరిపారు. తమ భూములకు ప్రభుత్వం ధర కాకుండా బహిరంగ మార్కెట్‌లో ధరను చెల్లించాలని రైతులు పట్టుబడుతున్నారు. ఎయిర్‌పోర్టు వస్తుండటంతో ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.1.50కోట్ల నుంచి రూ.2కోట్లకు పైగా ధర పలుకుతోందని, ఆ ధరనే తమకు చెల్లించాలని రైతులు పట్టుబడుతున్నారు. దీంతో 259ఎకరాలకు రూ.388.5కోట్ల నుంచి రూ.518కోట్లు నష్టపరిహారం కిందనే చెల్లించాల్సి వస్తుంది. ఇంత పెద్దమొత్తంలో రైతులకు నష్టపరిహారం ఇవ్వడం కుదరదని అధికారులు పేర్కొంటున్నారు. నష్టపరిహారంపై రైతుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అయితే ప్రభుత్వం నుంచి రైతులకు చెల్లించే నష్టపరిహారంపై ఎలాంటి స్పష్టత రాకపోవటంతో ఎయిర్‌పోర్టు పనులకు ఆటకం ఎదురవుతోంది. రైతుల నుంచి 259 ఎకరాలతో పాటు వెటర్నరీ కాలేజీకి చెందిన 40 ఎకరాల భూమి కూడా కలుపుకుని సుమారు 299 ఎకరాల భూమిని ఏఏఐకి కేటాయించాలని అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దీంతో ఏఏఐ కావాల్సిన సుమారు వెయ్యి ఎకరాల భూమి కేటాయింపు పూర్తి అవుతుందని భావిస్తున్నారు.

ఎకరాకు రూ.2కోట్ల పరిహారం ఇవ్వాలి

- దండ నరేష్, గుంటూరుపల్లి, సంగెం మండలం, వరంగల్ జిల్లా



ఎయిర్‌పోర్టు కోసం భూములు ఇచ్చేందుకు అభ్యంతరం లేదు. కానీ, ఎయిర్‌పోర్టు కోసం భూములను త్యాగం చేస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. బహిరంగ మార్కెట్‌లో ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.2కోట్ల వరకు ధరలు ఉన్నాయి. అవే ధరలను భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించాలి. అలాగే రైతు కుటుంబంలోని అర్హతలను బట్టి ఎయిర్‌పోర్టు ఉద్యోగావకాశాలు కల్పించాలి.

సఖీ సెంటర్‌పై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న హైమావతి

పరకాల, ఆగస్టు 23: గృహహింస, పనిచేసే ప్రాంతాల్లో లైంగిక వేధింపుల నుంచి రక్షణ పొందడానికి సఖీ సెంటర్ పని చేస్తుందని సఖీ సెంటర్ అడ్మిన్ పి.హైమావతి తెలిపారు. శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ హై స్కూల్‌లో సఖీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్, వైద్య సహాయం, పోలీసు, తాత్కాలిక వసతి తదితర సేవల గురించి మహిళలకు వివరించారు. సఖీ సెంటర్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు

ఎంజీఎం ఏడీని కలిసిన ఉద్యోగులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 23 : వరంగల్ ఎంజీఎం అసిస్టెంట్ డైరెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎం.డీ ఇస్మాయిల్‌ను దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి నున్న నర్సమ్మ, స్వర్ణలత, సునీత, రవీందర్, వేణు తదితరులు పాల్గొన్నారు..

కలెక్టరేట్‌లో నేడు ప్రత్యేక ప్రజావాణి

హనుమకొండ సిటీ, ఆగస్టు 23 : దివ్యాంగుల కోసం కలెక్టరేట్‌లో శనివారం ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి బి.రాజమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

నాబార్డు సమావేశంలో పాల్గొన్న 'మార్నేని'



నాబార్డు చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, ఆగస్టు 23 : ముంబై నాబార్డు (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర సహకార బ్యాంకుల జాతీయ సమాఖ్య ఆధ్వర్యంలో స్వల్పకాలిక సహకార క్రెడిట్ విధానాలపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. (ఎస్‌టీసీసీఎస్) నాబార్డు చైర్మన్ షాజీ కేవి ముఖ్య అతిథిగా విచ్చేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ డైరెక్టర్లు కొండూరు రవీందర్‌రావు, చిట్టి దేవేందర్‌రెడ్డి, బోజారెడ్డి, కుంభం శ్రీనివాసరెడ్డి, టెస్కాబ్ సీజీఎం జ్యోతి, డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.2.50లక్షల విలువైన గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం, ఆగస్టు 23 : ఆత్మకూరు మండలం పెద్దాపూర్ గ్రామంలో జి.సాయినాథ్, నగేష్ అనే ఇద్దరు వ్యక్తుల ఇళ్లల్లో గుట్కా నిల్వలున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసుల శుక్రవారం దాడులు చేశారు. రూ.2 లక్షల 50 వేల సరుకు స్వాధీనం చేసుకుని సాయినాథ్‌ను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో విచారణ నిమిత్తం అప్పగించారు. నగేష్ పరారయ్యారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్ ధ్రువీకరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కాజీపేట, ఆగస్టు 23 : కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి, నలుపు రంగు పొడవైన ముఖం, నలుపు తెలుపు గడ్డం కలిగిన వ్యక్తి మృతిచెంది పడిఉన్నాడు ఛాతిపై శంకర్, స్వప్న అని పచ్చబొట్టు ఉంది. ఆనవాళ్ల బట్టిచూస్తే యాచకుడిగా భావిస్తున్నామని, స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరిచామని ఆచూకీ తెలిసిన వారు 87126 85008, 87126 85122 ఫోన్‌నంబర్‌లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి

బల్దియా ఎదుట ఉద్యానశాఖ కార్మికుల ధర్నా



బల్దియా కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్మికులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 23 : తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ, చాలా సంవత్సరాలుగా గ్రేటర్ వరంగల్ హార్టికల్చర్ విభాగంలో దినసరి కూలీలుగా పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.15,500 అందించాలని శుక్రవారం కార్మికులు, సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. తమకు నెల వారీగా వచ్చే వేతనాలు సైతం మూడు మాసాలకు ఒక మారు వస్తున్నాయని, ప్రతీ నెల 5వ తేదీ వరకు వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించడంతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలని వారు అదనపు కమిషనర్ రవీందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించాలి

బతుకమ్మ పండుగనాటికి శుభ్రం చేయాలి : బల్దియా కమిషనర్‌కు పర్యావరణ వేత్తల విజ్ఞప్తి



బల్దియా కమిషనర్‌కు వినతి పత్రం అందచేస్తున్న పెరుమాళ్ల లక్ష్మణ్

హనుమకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలోని చెరువుల్లో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్కను తొలగించాలని, చెరువులను శుభ్రం చేయాలని కోరుతూ చిన్నవడ్డెపల్లి చెరువు పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు వినతి పత్రం అందచేశారు. శక్రవారం ఆంధ్రజ్యోతిలో 'కాలుష్య కోరల్లో చెరువు ' పేరుతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు స్పందించిన ఆయన ఈ మేరకు కమిషనర్‌ను కలిసి చెరువుల్లోని గుర్రపు డెక్కతో పాటు ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించేందుకు రూ. 2 కోట్లతో కొనుగోలు చేసిన ఫ్లోటింగ్ ట్రాష్ మిషన్ నిరుపయోగంగా ఉన్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీనిని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ఆ వినతి ప్రతంలో కోరారు. త్వరలో బతుకమ్మ పండుగ రానున్నదని, మహిళలు బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేసేందుకు వీలుగా ఈ మిషన్ సాయంతో చెరువుల్లోని గుర్రపు డెక్కను తొలగించాలని కోరారు. చెరువులను ప్రక్షాళన చేయడంతో పాటు వాటి వద్ద సందర్శకుల కోసం ఏర్పాట్లు కూడా చేయాలని అభ్యర్థించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో లక్ష్మణ్‌తో పాటు చిన్నవడ్డెపల్లి చెరువు పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి సిలువేరు నాగేశ్ కుమార్ తదితరులు ఉన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

టీడీపీ రాష్ట్ర నేత గట్టు ప్రసాద్‌బాబు



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న గట్టు ప్రసాద్‌బాబు

వడ్డెపల్లి, ఆగస్టు 23: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని టీడీపీ రాష్ట్ర నేత, కుడా మాజీ చైర్మన్ గట్టు ప్రసాద్‌బాబు అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి అనేక పథకాలను నెరవేర్చలేదని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పది సంవత్సరాలు అధికారంలో ఉండి విభజన చట్టంలో పొందుపర్చిన హామీలను అమలు చేయించకపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ త్వరలోనే ఖాళీ అవుతుందని చెప్పారు. టీడీపీ నుంచి ఇతర పార్టీలకు వెళ్లిన వారంతా తిరిగి ఘర్‌వాపస్ ప్రోగ్రాం ద్వారా సొంత గూటికి చేరనున్నారని స్పష్టం చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు టీడీపీ ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతున్నారని పేర్కొన్నారు. సెప్టెంబరులో టీడీపీ సభ్యత్వ నమోదును చేపట్టి గ్రామ, మండల కమిటీలు, అడహక్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు గట్టు ప్రసాద్‌బాబు తెలిపారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర, జిల్లా నేతలు హన్మకొండ సాంబయ్య, భైరపాక ప్రభాకర్, పిట్టల శ్రీనివాస్ ముదిరాజ్, కందుకూరి నరేష్, కొంగర ప్రభాకర్, కుమారస్వామి పాల్గొన్నారు.

క్యాంటీన్ పనులు త్వరగా పూర్తి చేయండి

బల్దియాలో పనులను పరిశీలించిన కమిషనర్



క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 23 : బల్దియా ప్రధాన కార్యాలయంలో పునఃనిర్మాణం జరుగుతున్న క్యాంటీన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శుక్ర వారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పేయింటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్‌వో కోల రాజేశ్‌కుమార్, డీఈ రవికిరణ్, సీఎంసీ రమేష్, ఏఈ శ్రీనివాస్, వర్క్ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

మాజీ ఆర్సీవోపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 23 : అనేక అక్రమాలకు పాల్పడిన సాంఘీక సంక్షేమ గురుకులాల మాజీ ఆర్సీవో విద్యారాణిపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జె. వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యారాణిపై శుక్రవారం సంబంధిత జోనల్ అధికారి స్వరూపారాణికి ఫిర్యాదు చేశారు. న్యూశాయంపేటలోని హాస్టల్ తనిఖీకి వచ్చిన ఆమెకు ఫిర్యాదు చేసినట్లు వంశీకృష్ణ పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వచ్చిన జూనియర్ అసిస్టెంట్‌ను ఆర్సీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ పోస్టులో అక్రమంగా కొనసాగించిందని ఆరోపించారు. రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్ వచ్చినప్పటికీ ఏజెన్సీ నుంచి వచ్చిన జూనియర్ అసిస్టెంట్‌ను కొనసాగించిన విద్యారాణిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

హసన్‌పర్తి, ఆగస్టు 23: ఇటీవల తాటి చెట్టుపై నుంచి కింద పడి మృతి చెందిన జనగాని సదానందంగౌడ్ కుటుంబాన్ని శుక్రవారం గౌడ సంఘం నాయకులు కలిసి ఆర్థిక సాయం అందజేశారు. పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి గోపిగౌడ్ నాయకత్వంలో సదానందం గౌడ్ కుటుంబాన్ని కలిసి మనోధైర్యాన్ని కల్పించారు. బాధిత కుటుంబాన్ని కలిసిన వారిలో తెలంగాణ గౌడ సంఘం స్టేట్ జాయింట్ సెక్రటరీ జనగాం వెంకటేశ్వర్లుగౌడ్, హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి పల్లె రాజుగౌడ్, జిల్లా నాయకుడు చిర్ర వెంకటస్వామిగౌడ్, తాళ్లపెల్లి రమేష్‌గౌడ్, మార్క రవిందర్‌గౌడ్, జయగిరి సొసైటీ అధ్యక్షుడు పంజాల సాంబరాజుగౌడ్, వైస్ ప్రెసిడెంట్ మోటపోతుల రాజుగౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సామాజికవేత్త శ్రీనివాస్‌కు జాతీయ స్థాయి అవార్డు



ఈవీ శ్రీనివాస్‌కు అవార్డును అందజేస్తున్న స్వర్ మహతి కళా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ ఆదిత్య

కాళోజీ జంక్షన్, ఆగస్టు 23 : హనుమకొండకు చెందిన సామాజికవేత్త ఈవీ శ్రీనివాస్‌కు జాతీయ స్థాయిలో సేవారత్న అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో స్వర్ మహతి కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సృజనోత్సవ్ -2024 అవార్డుల ప్రధానోత్సవాన్ని నిర్వహించారు. భారత దేశ సనాతన కళలను పరిరక్షించి భావితరాలకు అందజేయాలన్న లక్ష్యంతో స్వర్ మహతి కళా పరిషత్ ఆధ్వర్యంలో కళలను ప్రోత్సహించేవారికి అవార్డులను అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో ఈవీ శ్రీనివాస్‌కు శాలువా, మెమొంటోతో సత్కరించి కళా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బి. ఆదిత్య కిరణ్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు.

వెల్లివిరిసిన శ్రావణ శోభ

వైభవంగా మహిళల పూజలు



భద్రకాళి ఆలయంలో భక్తులు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 23 : పవిత్ర శ్రావణమాసంలో మూడవ శుక్ర వారం నగరంలోని అన్ని ఆలయాల్లో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా కొలుస్తూ ప్రత్యే క పూజలు చేశారు. ప్రసిద్ధ భద్రకాళి ఆలయంతోపాటు వేయిస్తంభాల ఆలయం, ఇతర ఆలయాల్లోనూ మహిళా భక్తుల రద్దీ విపరీతంగా ఉంది. హనుమకొండ లష్కర్ బజారులోని వైభవలక్ష్మీ, హంటర్‌రోడులోని వైభవలక్ష్మీ ఆలయాల్లోనూ మహిళల సందడి నెలకొంది. చారిత్రక రుద్రేశ్వరాలయంలో ఆలయ ప్రధాన అర్చ కులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో రుద్రేశ్వరుడిని శ్రావణ శుక్రవారం వేళ మహాలక్ష్మీ అవతారంలో రుద్రేశ్వరీగా అలంకరింపజేయడడం విశేషం. గుడి మల్కాపూర్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన గులాబీ, చామంతి, బంతి, లిల్లీ తదితర పుష్పా లతో ఆలయ అర్చకులు మణికంఠ శర్మ, సందీప్ శర్మ, ప్రణవ్‌లు లక్షనామాలతో వైభవోపేతంగా లక్ష పుష్పార్చన నిర్వహించారు. మహాలక్ష్మీ అనుగ్ర హాన్ని కోరుతూ మహిళలు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. మంత్ర పుష్పంతోపాటు నృత్యం, గీతం, వాయిద్యాలతో అమ్మవారికి నీరాజ నాలు అర్పించారు. ఎక్సైజ్ కాలనీ వెంకటేశ్వర ఆలయం, అదాలత్ సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయాల్లో మహా లక్ష్మీ అష్టోత్తర శత నామార్చనలు నిర్వహించారు.

శివాని స్కూల్‌లో అంతరిక్ష దినోత్సవం



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

రాంనగర్, ఆగస్టు 23 : హసన్‌పర్తి మండలం భీమారంలోని శివాని హైస్కూల్‌లో శుక్ర వారం జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి మాట్లాడారు. గత సంవత్సరం ఆగస్టు 23న చంద్రయాన్ 3 చంద్రుని దక్షిణ భాగాన విజయవంతంగా ల్యాండ్ కావడం జరిగిందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ ప్రతీ సంవత్సరం ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునివ్వడం జరిగిందన్నారు. మోదీ ఇచ్చిన పిలుపు మేరకు పాఠశాలలో కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ విజయం ప్రతీ భారతీయుడి సొంతమని, అగ్రదేశాల సరసన భారత్ సముచిత స్థానం సంపాదించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు నృత్య ప్రదర్శన, ఛాయాచిత్ర ప్రదర్శన తదితర కార్యక్రమాలు అలరించాయి.

వైద్యుల భద్రతపై పోలీసుల దృష్టి



మాట్లాడుతున్న ఏసీపీ నందిరాం నాయక్

వరంగల్ మెడికల్, ఆగస్టు 23 : వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి, కాకతీయ మెడికల్ కళాశాల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో భద్రతపై వరంగల్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం సాయంత్రం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి ఎంజీఎం, కేఎంసీ వైద్య విద్యార్థుల భద్రతపై కేఎంసీ ప్రిన్సిపాల్‌తో సమావేశమై చర్చించారు. సీసీ కెమెరాల పనితీరు, మహిళా డాక్టర్ల భద్రత, నర్సింగ్ కాలేజ్ విద్యార్థుల భద్రతపై చర్చించారు. ఈ సమావేశంలో భద్ర తపై తీసుకోవాల్సిన అంశాలను కూలంకషంగా చర్చించారు.

'రుణమాఫీని ఓర్వలేక ఆరోపణలు'

వేలేరు, ఆగస్టు 23: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన రుణమాఫీని చూచి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు సద్దాంహుస్సేన్ అన్నారు. వేలేరు మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు అధికారంలో ఉండి చేయలేనిది, సీఎం రేవంత్‌రెడ్డి 2.లక్షల రుణమాఫీ చేసి చూపించారని అన్నారు. వేలేరు మండలంలో రుణమాఫీ కాని రైతులు ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ఏమైనా సమస్యలుంటే ఏఈవోలను సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ యూత్ అధ్యక్షుడు సంపత్ ప్రశాంత్, శ్రీకాంత్, అజయ్, బన్ని, సలీమ్ మాలిక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

నూతన ఆవిష్కరణలు రూపొందించాలి

జూలైవాడ, ఆగస్టు 23 : భవిష్యత్‌లో మన దేశం అంతరిక్ష పరిశోధనలో అగ్రగామిగా నిలవడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జూలైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యావికాస ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మనం నివసిస్తున్న ఈ విశ్వం ఎంతో విశాలమైందని, ఇందులో తెలియని విషయాలు, రహస్యాలు ఉన్నాయని అన్నారు. విద్యార్థులుగా ఈ రహస్యాలను పరిశోధించే అవకాశం ఉందని తెలిపారు. ప్రతీ విద్యార్థి అంతరిక్షంలో ఉన్న సాంకేతికతను, ఆవిష్కరణలను తెలుసుకోవ్వాని, అధ్యాయనాల్లో కొత్త కొత్త ఆవిష్కరణలు రూపొందించాలని సూచించారు. సాహసోపేతమైన ఆలోచనలు చేసి విశ్వాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.భాస్కర్‌రెడ్డి, ప్రేరణ ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి, మండల పరశురాములు, విద్యార్థులు పాల్గొన్నారు.



భట్టుపల్లిలో మడేలయ్యకు ప్రత్యేక పూజలు చేస్తున్న రజక సంఘం నేతలు

ఘనంగా మడేలయ్య బోనాలు

మడికొండ, ఆగస్టు 23: రజకుల ఇలవేల్పు మాచిరాజు మడేలయ్య బోనాలను శుక్రవారం కాజీపేట మండలం భట్టుపల్లిలో కాకతీయ రజక సంఘం ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రజక సంఘం కుల పెద్దలు బోనాలతో ఊరి పొలిమేరలోని మడేలయ్య దేవాలయానికి డప్పు చప్పుళ్లతో తరలి వెళ్లారు. మడేలయ్యకు ఇష్టమైన పప్పు, బెల్లం, పసుపు, కుంకుమలు, కొబ్బరికాయలు, నైవేద్యం, బెల్లం శాకతోపాటు నూతన వస్త్రాలు నైవేద్యాన్ని సమర్పించుకున్నారు. పిల్లా పాపలతో, పాడిపంటలతో తులతూగే విధంగా దీవించి సల్లంగా చూడమని మడేలయ్యను వేడుకున్నారు. కార్యక్రమంలో భట్టుపల్లి కాకతీయ రజక సంఘం ప్రతినిధులు నాగపురి జగదీశ్వర్, నాగపురి రాజు, నాగపురి శ్రీకాంత్, నాగపురి రాజేష్, నాగపురి అశోక్, బాలరాజు, సమ్మయ్య, పాల్గొని పూజలు చేశారు.

రుణమాఫీ వర్తించని రైతులు ఏఈవోను సంప్రదించాలి

ధర్మసాగర్, ఆగస్టు 23: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన రుణమాఫీ పథకం అమలు కాని రైతులు ఏఈవోలను సంప్రదించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పాలకుర్తి రాజేష్ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. రైతులకు ఇప్పటి వరకు రెండు లక్షల రుణా మాఫీ జరిగిందన్నారు. రుణా మాఫీ కాని రైతులు మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలోని గ్రీవెన్ సెల్‌లో తమ పేరును నమోదు చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తి

శిక్షగా రెండు రోజుల సమాజసేవ

ధర్మసాగర్, ఆగస్టు 23: మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి న్యాయాధికారి సమాజసేవను శిక్షగా విధించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని రాంపూర్‌కు చెందిన సంగి సారయ్య మద్యం సేవించిన కారు డ్రైవింగ్ చేస్తూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో బుధవారం పోలీసులకు పట్టుబడ్డాడు. కేసునమోదు చేసి న్యాయాధికారి కె.విద్యాసాగర్ రావు ఎదుట హాజరు పరుచగా, ఆయన వాహదారుడికి రెండు రోజుల పాటు సమాజ సేవ చేయాల్సింగా తీర్పు ఇచ్చారు. దీంతో సారయ్యను స్థానిక పోలీసులు తహసీల్దార్ ఎదుట హాజరు పరిచి శిక్షను అమలు పరిచారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 24 ఆగస్టు 2024

వేసవారం... విషదోషాలకు విరుగుడు

ఇప్పుడైతే అన్ని రకాల పొడులు మనకు మార్కెట్లో దొరికేస్తున్నాయి. కానీ ఒకప్పుడు వీటిని ఇళ్లలోనే తయారు చేసుకొనేవారు. ఇలా తయారు చేసుకున్న పొడినే వేసవారం అంటారు. దీన్ని అన్ని రకాల కూరల్లోనూ వాడుకోవచ్చు. కూరలకు రుచినివ్వడమే కాదు... ఆరోగ్యదాయిని కూడా.

క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో వేసవారాన్ని ఆరు సుగంధ ద్రవ్యాల మిశ్రమంగా అభివర్ణించాడు. ఇంగువ, అల్లం, మిరియాలు, జీలకర్ర, పసుపు, ధనియాలతో చేసిన ఈ మిశ్రమాన్ని చాలా శ్రద్ధతో.. జాగ్రత్తగా చేయాలని ఆయన సూచించాడు. ఈ మిశ్రమంలో ఏ పదార్థాన్ని ఎంత పాళ్లలో వేయాలో కూడా చెప్పాడు. 'క్షేమకుతూహలం' గ్రంథం ప్రకారం... ఒక చెంచా ఇంగువపొడి తీసుకుంటే.. దానికి రెట్టింపు అల్లం ముద్ద తీసుకోవాలి. ఆ అల్లం ముద్దకు రెట్టింపు మిరియాల పొడి తీసుకోవాలి. ఆ మిరియాల పొడికి రెట్టింపు జీలకర్ర పొడి, దానికి రెట్టింపు పసుపు, దీనికి



రెట్టింపు ధనియాల పొడిని వేసి బాగా నూరాలి. ఇలా నూరిన మిశ్రమంలో తగినంత సైంధవ లవణం వేసి కలపాలి. ఈ వేసవారం చాలా కాలం నిల్వ ఉంటుంది.

విషదోషాల నివారణ...

మనం రోజూ తినే ఆకుకూరలు, కూరగాయల్లో రకరకాల రసాయనాలు కలుస్తున్నాయి. వీటివల్ల మన శరీరంలో అనేక విషాలు ప్రవేశించవచ్చు. ఈ విషాలన్నింటినీ వేసవారం తొలగిస్తుందని క్షేమశర్మ పేర్కొన్నాడు. అంతే కాకుండా వేసవారంవల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. దీనిని మసాలాలకు బదులుగా కూరలు, పచ్చళ్లు, పులుసుల్లోనూ వాడవచ్చు. కూరగాయాలను ఉడికించి.. దానిలో పెరుగు, వేసవారం వేస్తే అది సుగంధభరితమైన పెరుగుపచ్చడి అవుతుంది. పప్పులో కానీ.. పులుసులో కానీ వేస్తే, తాళింపు పెట్టుకొనే అవసరం ఉండదు.

మాంసం శుద్ధి...

మాంసం, చేపలు మొదలైన వాటిలో వాసన ఉంటుంది. ఈ వాసన పోవటానికి వేసవారం ఉపకరిస్తుంది. మాంసం లేదా చేపలను తీసుకొని వాటిని వేసవారం వేసిన నీళ్లలో ఉడికించాలి. ఇలా ఉడికించిన తర్వాత మళ్లీ ఆ మాంసం లేదా చేపలను మజ్జిగలో ఉడికించాలి. దీనివల్ల మాంసం లేదా చేపల్లో ఉన్న విష పదార్థాలేమైనా ఉంటే అవి తొలగిపోతాయి. ఒకవేళ మజ్జిగ లేకపోతే దానిమ్మ రసంలోనైనా వీటిని ఉడికించవచ్చు.

• గంగరాజు అరుణాదేవి



క్రీడాకారిణిగా విజయాలు, వైఫల్యాలే కాదు... కోచ్‌గా అవమానాలు, ఛీత్కారాలు కూడా చూశారు **దీపాలి దేశ్‌పాండే**. టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ రైఫిల్ షూటింగ్ జట్టు దారుణ వైఫల్యం, ఆ తరువాత కోచ్‌గా తనను తొలగించడం ఆమెను మానసికంగా కుంగదీసింది. దాని నుంచి బయటపడి, సర్వశక్తులూ కూడదీసుకొన్నారు. నిన్నటి ఒలింపిక్స్‌లో... దీపాలి శిష్యుడు స్వప్నిల్ కుశాలె గెలిచిన కాంస్యం... కోచ్‌గా ఆమె స్థాయిని చాటి చెప్పింది.

పడి లేచిన కెరటం

"విజయాన్ని ఆస్వాదించినంత సులువుగా వైఫల్యాన్ని స్వీకరించలేం. కానీ క్రీడల్లోనే కాదు, జీవితంలో కూడా వైఫల్యాలు ఎదురవుతూనే ఉంటాయి. ఎంత త్వరగా వాటి ప్రభావం నుంచి తేరుకున్నామన్నదే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది" అంటారు దీపాలి దేశ్‌పాండే. ముంబయిలో పుట్టి పెరిగిన ఈ ఆర్కిటెక్చర్ గ్రాడ్యుయేట్‌ను రైఫిల్ షూటింగ్ అమితంగా ఆకర్షించింది. తీవ్ర సాధన చేసి... పలు పోటీల్లో తన నైపుణ్యాన్ని చాటారు. 2004 ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించారు. అదే ఏడాది ఒలింపిక్స్‌లో భారత్ తరఫున పోటీ పడ్డారు. క్రీడాకారిణిగా బరిలో నుంచి క్రమంగా తప్పుకొని... కోచింగ్ మీద దృష్టి సారించారు. 'నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' (ఎన్ఆర్ఎఐ)లో పదేళ్లపాటు సీనియర్ కోచ్‌గా వ్యవహరించారు. ఎంతోమంది యువ షూటర్స్ ప్రతిభకు మెరుగులు దిద్దారు. కానీ టోక్యో ఒలింపిక్స్ తరువాత ఆమెకు తీవ్ర అవమానాలు ఎదురయ్యాయి.

ఆ రోజులు పెద్ద పీడకల...



'ఒలింపిక్స్‌లో ఏ క్రీడాంశంలోనైనా విఫలం కావచ్చు కానీ... షూటింగ్‌లో మాత్రం భారత్‌కు పతకం పక్కా' అనే నమ్మకం ఒకప్పుడు ఉండేది. 2004 నుంచి 2012 వరకూ... మూడు ఒలింపిక్స్‌లో ఒక స్వర్ణం, రెండు రజతాలు, ఒక కాంస్యం గెలిచిన చరిత్ర మనది. కానీ 2016 రియో ఒలింపిక్స్‌కు ఎన్నో ఆశలతో వెళ్ళిన భారత షూటర్స్ బృందం ఉత్తచేతులతో తిరిగొచ్చింది. ఈ నేపథ్యంలో మాజీ షూటర్స్ దీపాలి దేశ్‌పాండే, జస్పాల్ రాణాలతో యువ షూటర్లకు ఎన్ఆర్ఎఐ ప్రత్యేక శిక్షణ ఇప్పించింది. 2018లో ప్రపంచకప్ పోటీల్లో గొప్పగా రాణించిన భారత షూటర్లు టోక్యో ఒలింపిక్స్‌లో తేలిపోయారు. దాంతో కోచింగ్ సిబ్బందిని మార్చడానికి ఎన్ఆర్ఎఐ సిద్ధపడింది. ఆరుగురు కోచ్‌లు తమ కాంట్రాక్ట్‌లు నిలబెట్టుకున్నారు. దీపాలి బయటకు రావలసి వచ్చింది. ఇది ఆమె మానసిక ఆరోగ్యం మీద తీవ్రమైన ప్రభావం చూపించింది. "మెలకువగా ఉన్నంతసేపూ అవే ఆలోచనలు. నాకేమవుతోందో అర్థమయ్యేది కాదు. ఇంటినుంచి ట్రైనింగ్ సెంటర్‌కు బయలుదేరి... ఎటో వెళ్ళిపోయేదాన్ని. కొంతసేపటికి ఆలోచనల్లోంచి బయటపడ్డాక... నేను నా గమ్యానికి వ్యతిరేక దిశలో... చాలా దూరంగా వచ్చానని అర్థమయ్యేది. ఇలా పదిహేను రోజుల వ్యవధిలో రెండు సార్లు జరిగింది. ఎన్నో ఏళ్ళుగా నేను ప్రయాణిస్తున్న మార్గంలో డ్రైవ్ చేస్తున్నప్పుడే నా ఆలోచనలు స్తంభించిపోతున్నాయంటే... నాలో ఏదో తేడా జరుగుతోందని గ్రహించాను" అన్నారు దీపాలి. పరిస్థితి మరీ ముదిరిపోకుండా దిద్దుబాటు చర్యలను వెంటనే తీసుకున్నారు. "షూటర్స్‌కు ఏకాగ్రత చాలా ఎక్కువగా ఉండాలి. కానీ ఒక దాని మీద దృష్టి కేంద్రీకరిస్తున్నప్పుడు... మిగిలిన విషయాలను పెద్దగా పట్టించుకోకపోవడం, మరచిపోవడం సాధారణంగానే జరుగుతూ ఉంటుంది. అది మతిమరపుగా మారితే ప్రమాదం. షూటింగ్ కాకుండా డ్రాయింగ్, ట్రెక్కింగ్, పెయింటింగ్ నా అభిరుచులు. అవి కూడా ఆ సమయంలో నాకు గుర్తుకురాలేదు. అదృష్టవశాత్తూ... నాకు మంచి కుటుంబం ఉంది. అన్ని విషయాలను మేము కలిసి చర్చించుకుంటాం. వారి సలహాతో యోగా, వ్యాయామం మళ్ళీ ప్రారంభించాను. క్రమం తప్పకుండా కొనసాగించాను. ఆ రోజులు నా జీవితంలో 'పెద్ద పీడకల'" అంటారు దీపాలి.

అది నా అదృష్టం...

అయితే దీపాలి దగ్గర శిక్షణ పొందుతున్న షూటర్స్‌కు ఆమెపై అపారమైన నమ్మకం ఉంది. తమకు వ్యక్తిగత కోచ్‌గా ఆమే ఉండాలని పట్టుపట్టారు. "వారు నా పక్షాన ఉండడం నా అదృష్టం. నేను త్వరగా కోలుకోవడానికి వాళ్ళు కూడా కారణం. వారు టీనేజ్‌లోకి రాక ముందు నుంచీ చూస్తున్నాను. అందరూ నా బిడ్డల్లాంటివారు" అని ఆమె చెప్పారు. ఇక సంస్థలకు కాకుండా... షూటర్లకు వ్యక్తిగత కోచ్‌గా ఉండాలనీ, ప్యారిస్ ఒలింపిక్స్ మీద దృష్టి కేంద్రీకరించాలనీ దీపాలి నిర్ణయించుకున్నారు. కానీ మళ్ళీ ఎదురుదెబ్బ తగలకూడదంటే... ప్రణాళికలు మరింత కచ్చితంగా ఉండాలని ఆమెకు తెలుసు. "ప్రపంచం మీద కొవిడ్ విరుచుకుపడడానికి ముందు... 2019 డిసెంబర్‌లో భారత రైఫిల్ షూటింగ్ సీనియర్ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నాను. అప్పట్లో నేను వేసుకున్న ప్రణాళికలు ఫలితాన్ని ఇవ్వలేదు. దానికి కారణాలేవిటి? కొవిడ్ కారణంగా యువ షూటర్లలో మానసికంగా ఒత్తిడి ఏర్పడి, వాళ్ళ సామర్థ్యం దెబ్బతిందా? వాళ్ళ సామర్థ్యాన్ని మరీ ఎక్కువగా ఊహించుకున్నామా? లేదంటే... ఒలింపిక్స్ వాయిదా కారణంగా మరీ ఎక్కువ కాలం శిక్షణ శిబిరంలో ఉండడం వారి ప్రదర్శన మీద ప్రభావం చూపించిందా? ఈ ప్రశ్నలన్నిటికీ జవాబులు తెలుసుకోవాలని ప్రయత్నించాను" అని చెప్పారు. దీపాలి. ఏం చేయాలనే స్పష్టత వచ్చాక... ఆమె వెనుతిరగలేదు. తనను నమ్మి వచ్చిన యువ షూటర్లకు కఠినమైన శిక్షణ ఇచ్చారు. వారందరూ ప్యారిస్ ఒలింపిక్స్ కోటాలో ఎంపికయ్యారు. అయితే ఇద్దరు ట్రయల్స్‌లో వెనుకపడగా... నలుగురు ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు.

ఆ బాధ పోయింది...

షూటర్ స్వప్నిల్ కుశాలె 60 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో కాంస్య పతకం అందుకున్నాడు. ఈ విభాగంలో భారత్ పతకం సాధించడం ఇదే తొలిసారి. "ఈ ఘనత ఎవరికైనా దక్కాలంటే... అది నా కోచ్ దీపాలికే" అంటూ తను గెలిచిన పతకాన్ని స్వప్నిల్ ఆమె చేతికి అందించినప్పుడు... ఆమె ఉద్వేగాన్ని ఆపుకోలేకపోయారు. "అర్జున్ బబుతా కనీసం రజత పతకం సాధిస్తాడనుకున్నాను. కొద్దిలో కాంస్య పతకాన్ని కోల్పోయి నాలుగో స్థానంలో నిలిచాడు. కానీ అది చిన్న విషయం కాదు. టోక్యో ఒలింపిక్స్ నాటికి భారత జట్టుకు నేను అత్యున్నతస్థాయి రైఫిల్ కోచ్‌గా ఉన్నాను. కానీ ఆ తరువాత ఎలాంటి ఉద్యోగం లేకుండా మిగిలిపోయాను. నన్ను మాత్రమే తొలగించినందుకు ఎంతో బాధపడ్డాను. కానీ కుశాలె పతకంతో ఆ బాధ తొలగిపోయింది. ఇదంతా ఉద్యోగం పోయినందుకు మాత్రమే కాదు... నేనిక పనికిరాననే భావనకు ఆ సంఘం వచ్చినందుకు. క్రీడాకారులు ఓడిపోయినా... వారిని కాపాడడానికి ఎవరో ఒకరుంటారు. కోచ్‌ల మీద కనీసమైన సానుభూతి కూడా ఎవరూ చూపించరు. వైఫల్యముద్రతో జీవితాంతం బతకాల్సిందే. ఇప్పుడు ఆ ముద్ర పోయినందుకు సంతోషంగా ఉంది" అంటున్నారు 55 ఏళ్ళ దీపాలి.

వంటిల్లు



దక్కనీ రుచులు

రొటీన్‌కు కాస్త భిన్నంగా... ఇంట్లోనే వండుకోగలిగిన దక్కనీ వంటకాలున్నాయి. అవే పనీర్ చట్‌పట్, ముర్గ్ మజెదార్, ఘోష్ కాలీమిర్చీ. ఈ వీకెండ్‌లో వీటిని ప్రయత్నించి చూడండి.

ఘోష్ కాలీమిర్చీ




కావాల్సిన పదార్థాలు: మటన్- అర కేజీ, అల్లం, వెల్లుల్లి పేస్ట్- 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు- రుచికి సరిపడ, పసుపు- అర టీస్పూన్, షాజీరా- టీస్పూన్, నల్లమిరియాల పొడి- 2 టీస్పూన్లు, దాల్చిన చెక్క- 1, ధనియాల పొడి- టీస్పూన్, పెరుగు- 200 గ్రాములు, కొత్తిమీర- 1 టేబుల్ స్పూన్, పుదీనా- టేబుల్ స్పూన్, పచ్చిమిర్చి-2 (సన్నగా తరగాలి), ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), నూనె- 4 టేబుల్ స్పూన్లు, నిమ్మకాయ రసం- అర టీస్పూన్

తయారీ విధానం: శుభ్రం చేసిన మటన్ ముక్కలను బౌల్‌లో వేయాలి. ఇందులోకి పసుపు, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేయాలి. ఆ తర్వాత షాజీరా, దాల్చిన చెక్క, నల్లమిరియాల పొడి, ధనియాల పొడి వేసి కలపాలి. ఇందులో పెరుగు పోసి బాగా కలిపితే మటన్ ముక్కలకు పడుతుంది. ఇందులోకి కొత్తిమీర, పుదీనాతో పాటు పచ్చిమిర్చి వేసి కలపాలి.

కుక్కర్‌లో నూనె పోసి ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. గోల్డెన్ బ్రౌన్ రంగు వచ్చాక మటన్ మిశ్రమాన్ని వేయాలి. పొంగులా వచ్చే ముందు గరిటెతో కదుపుతూ ఉండాలి. ఇలా ఐదు నిముషాలు కుక్ చేశాక కుక్కర్ మీద మూత ఉంచి ఐదారు విజిల్స్ వచ్చేంత వరకు ఉడికించాలి. మటన్ ముక్కలు బాగా ఉడికిన తర్వాత కొత్తిమీరతో గార్నిష్ చేసుకోవాలి. ఘోస్ట్ కాలీ మిర్చీ కర్రీ రెడీ.

పనీర్ చట్‌పట్

కావాల్సిన పదార్థాలు: పనీర్ క్యూబ్స్- 250 గ్రాములు, తరిగిన అల్లం- టీస్పూన్, తరిగిన వెల్లుల్లి- టీస్పూన్, నెయ్యి- రెండు టీస్పూన్లు, తరిగిన పచ్చిమిర్చి- 1 టీస్పూన్, కారం- టీస్పూన్, ఉల్లిపాయ- 1 (సన్నగా తరగాలి), పసుపు- చిటికెడు, ఉప్పు- తగినంత, చిల్లీ సాస్- రెండు టేబుల్ స్పూన్లు, టమోటా సాస్- రెండు టేబుల్ స్పూన్లు, నిమ్మకాయ-1, తరిగిన కొత్తిమీర- టీస్పూన్, చాట్ మసాలా- టీస్పూన్



తయారీ విధానం: పనీర్ ముక్కలను శుభ్రంగా కడిగి పక్కన ఉంచుకోవాలి. ప్యాన్ వేడయ్యాక నెయ్యి వేయాలి. అందులో సన్నగా తరిగిన వెల్లుల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. సన్నగా తరిగిన అల్లం వేసి కలపాలి. ఈ రెంటినీ వేయించాక.. పచ్చిమిర్చి ముక్కలు వేసిన వెంటనే ఉల్లిపాయ ముక్కలు వేసి లోఫ్లేమ్‌లో వేయించాలి. బంగారు రంగులోకి ఉల్లిపాయ ముక్కలు మారిన తర్వాత పసుపు, కారంతో పాటు సరిపడినంత ఉప్పు వేసి కలపాలి. చిల్లీ సాస్‌తో పాటు టమోటా సాస్ వేసి రెండు నిముషాల పాటు కలపాలి. కొన్ని నీళ్లు వేయాలి. పనీర్ ముక్కలను వేసి ముక్కలు విరగకుండా కలపాలి. మూడు నిముషాల తర్వాత కాస్త కొత్తిమీర వేసి కలపాలి. కొద్దిగా చాట్ మసాలా వేసి చివరగా నిమ్మకాయ రసం వేసి కలపాలి. ఈ పనీర్ చట్‌పట్‌ను చపాతీతో కలిపి తినొచ్చు.

ముర్గ్ మజెదార్

కావాల్సిన పదార్థాలు: బోన్‌లెస్ చికెన్- 600 గ్రాములు, ఉల్లిపాయలు- 3 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి ముక్కలు- అర టీస్పూన్, జీడిపప్పు పేస్ట్- టేబుల్ స్పూన్, టమోటా పేస్ట్- టేబుల్ స్పూన్, అల్లం, వెల్లుల్లి పేస్ట్- రెండు టేబుల్ స్పూన్లు, కారం పొడి- టేబుల్ స్పూన్, కసూరీ మేతీ- కొద్దిగా, గరం మసాలా- టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, నూనె- టేబుల్ స్పూన్, కొత్తిమీర- 2 టేబుల్ స్పూన్లు, వెన్న- టీస్పూన్, క్రీమ్- టీస్పూన్, పసుపు- చిటికెడు, ధనియాల పొడి- టేబుల్ స్పూన్, తరిగిన వెల్లుల్లి- టీస్పూన్



తయారీ విధానం: ముందుగా బోన్‌లెస్ చికెన్‌ను శుభ్రం చేసి క్యూబ్స్‌లా కట్ చేసుకోవాలి. ప్యాన్‌లో వెన్న, నూనె వేసి కలపాలి. ఇందులో తరిగిన వెల్లుల్లి ముక్కలతో పాటు ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. ఉల్లిపాయ రంగు మారిన తర్వాత జింజర్ గార్లిక్ పేస్ట్ వేసి కలపాలి. ఆ తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, చికెన్ ముక్కలు వేసి కలపాలి. మూడు నిముషాల పాటు కుక్ అయ్యాక.. ఇందులోకి జీడిపప్పు పేస్ట్, టమోటా పేస్ట్ వేసి కలపాలి. తగినన్ని నీళ్లు పోసి నాలుగైదు నిముషాలు కలుపుతూ ఉండాలి. వెంటనే ధనియాల పొడి, కారంపొడి, కొద్దిగా పసుపు, కసూరీ మేతీ పౌడర్ వేసి కలపాలి. రుచికి తగినంత ఉప్పు వేసి మళ్లీ కలపాలి. చివరగా క్రీమ్, వెన్న వేసి కలపాలి. చివరగా కొత్తిమీర వేసి కలపాలి. చికెన్ ముక్కలు ఉడికేంత వరకూ లోఫ్లేమ్‌లో కుక్ చేసి సర్వ్ చేసుకోవాలి. అన్నం లేదా చపాతీలోకి రుచిగా ఉంటుంది.

'హెయిర్ సైక్లింగ్' తెలుసా?

నిగనిగలాడే జుట్టు కావాలంటే సరైన ఆహారం తీసుకోవాలి. జాగ్రత్తలు పాటించాలి. అయితే కొందరు ఒకే తరహా ఉత్పత్తులను జుట్టు కోసం వాడుతూ ఉంటారు. ఇలా ఉపయోగించటం సరి కాదంటున్నారు నిపుణులు. వారు ప్రతిపాదిస్తున్న కొత్త పద్ధతే హెయిర్ సైక్లింగ్.

అంటే ఏమిటి?

అందరి జుట్టు అన్ని సమయాల్లో ఒకే విధంగా ఉండదు. వయస్సు, మనం తినే ఆహారం, మన చుట్టూ ఉన్న వాతావరణం- వీటన్నింటిపైనా ఆధారపడి ఉంటుంది. అందువల్ల మన జుట్టుకు అవసరమైన వాటిని- అవసరమైన సమయంలో అందించటాన్నే హెయిర్ సైక్లింగ్ అంటారు. ఉదాహరణకు బయట తిరగటం వల్ల కొందరి జుట్టు రాలిపోతూ ఉంటుంది. ఆ సమయంలో జుట్టు రాలిపోకుండా ఉండాలంటే- పౌష్టికాహారం తీసుకోవాలి. తగిన షాంపులు వాడాలి. ఆ సమయంలో కూడా మనకు అలవాటు అయిన ఆహారమే తింటే- పరిస్థితిలో మార్పు రాదు. ఇదే విధంగా కొందరికి జుట్టు పొడిగా ఉంటుంది. మరి కొందరికి నూనె రాసినట్లు ఉంటుంది. వయస్సు మీద పడినప్పుడు- పొడి జుట్టు నూనె రాసినట్లు మారిపోవచ్చు. నూనె రాసినట్లు ఉండే జుట్టు పొడిగా అవ్వచ్చు. ఇలాంటి సమయంలో సౌందర్య నిపుణులను అడిగి తగిన ఉత్పత్తులను వాడితే మంచి ఫలితాలు ఉంటాయి.



ఎలా మొదలుపెట్టాలి?

1) ముందు- మన జుట్టు పరిస్థితి ఏమిటో అంచనా వేసుకోవాలి. జుట్టు పొడిగా ఉందా? రాలిపోతోందా? చివర్లు చీలిపోతున్నాయా? చుండ్రు పడుతోందా? తలపై నల్లటి మచ్చలు వస్తున్నాయా? మొదలైన విషయాలను జాగ్రత్తగా గమనించాలి.

2) మన అంచనాలకు తగిన ఉత్పత్తులను ఎంచుకోవాలి. ఉదాహరణకు జుట్టు పొడిగా ఉంటే- తేమను అందించే హైడ్రేటింగ్ షాంపును వాడాలి. నూనె రాసినట్లు ఉంటే క్లారిఫైయింగ్ షాంపును వాడాలి. వీటితో పాటుగా మనకు ముందు నుంచి అలవాటు ఉన్న ఉత్పత్తులను కూడా వెంటనే మానకూడదు. వాటిని కూడా ఉపయోగిస్తూ ఉండాలి. మనకు అనువైన ఒక రొటీన్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

3) మన ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తున్నాయో- ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ ఉండాలి. ఒక వేళ ఎక్కడైనా తేడా వస్తే- వెంటనే ఉత్పత్తులను మార్చుకోవాలి.



దీపికకు మేకప్ చేసేది నేనే!

చిన్నప్పుడు అమ్మ మేకప్ కిట్ తస్కరించిన అమ్మాయి... ఇప్పుడు బాలీవుడ్ భామల అందానికి మెరుగులు అద్దుతోంది. కార్పొరేట్ కొలువును కాదనుకుని... అభిరుచికి పట్టం కట్టి... చిత్ర పరిశ్రమలో తిరుగులేని కెరీర్‌ను నిర్మించుకుంది. దీపికా, అలియా, కత్రినా, కరీనా... అందరికీ అభిమాన మేకప్ ఆర్టిస్ట్ అయిన **సంధ్యా శేఖర్** జర్నీ ఇది.

"ఇది నేను కోరివచ్చిన రంగం. కానీ ఈ స్థాయికి వస్తానని, ఇంతమంది అభిమాన తారలకు రంగులు అద్దుతానని ఎన్నడూ ఊహించలేదు. చిన్నప్పటి అభిరుచే నన్ను ఇక్కడివరకు నడిపించింది. కర్ణాటకలోని ఉడుపి మా సొంత పట్టణం. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తయింది. ఫైనాన్స్ అండ్ మార్కెటింగ్‌లో ఎంబీఏ చదివాక యస్‌బ్యాంక్‌లో మంచి ఉద్యోగం వచ్చింది. ఎందుకో తెలియదు... ఆ కార్పొరేట్ కొలువు నాకు అస్సలు నచ్చలేదు. ఉదయం లేవడం... ఆఫీస్‌కు పరుగెత్తడం... తిరిగి ఇంటికి రావడం... 'ఇదేనా జీవితం' అనిపించింది. అతి కష్టం మీద పన్నెండు నెలలు గడిచాయి.

వద్దంటే వినలేదు...

ఉద్యోగం మానేస్తానని అమ్మానాన్నలకు చెప్పాను. 'మానేసి ఏంచేస్తావ్' అన్నారు. మేకప్ ఆర్టిస్ట్‌గా కొత్త కెరీర్ ప్రారంభిస్తానని బదులిచ్చాను. వాళ్లు వద్దంటే వద్దన్నారు. రెండు నెలలు నచ్చజెప్పే ప్రయత్నం చేశాను. అయినా వారి నిర్ణయం మార్చు రాలేదు. ఇంత మంచి ఉద్యోగం వదిలేసి, ఏమాత్రం అవగాహన లేని రంగంలోకి దూకుతానంటే ఏ తల్లితండ్రులైనా అలానే స్పందిస్తారు. వాళ్ల ఆందోళన నాకు అర్థమవుతోంది. కానీ దాని కోసం నా ఇష్టాన్ని చంపుకోదలుచుకోలేదు. చివరకు 2005లో, నా పుట్టినరోజునాడు ఇల్లు వదిలి బెంగళూరు వెళ్లిపోయా. ప్రొఫెషనల్ మేకప్ కోర్సులు ఎక్కడెక్కడ నేర్పిస్తారు? నేర్పించేవారికున్న అర్హతలేమిటి? ఇలా నగరమంతా తిరిగి అన్నిటి గురించీ తెలుసుకున్నా.

చిన్న కోర్సుతో...

నాకున్న అవగాహనతో మొదట బెంగళూరులో నాకు తెలిసిన ఒక హెయిర్ అండ్ మేకప్ ఆర్టిస్ట్ దగ్గర చిన్న కోర్సు నేర్చుకున్నాను. తరువాత బ్రిటన్ వెళ్లాను. అక్కడి 'లండన్ స్కూల్ ఆఫ్ బ్యూటీ అండ్ మేకప్'లో నెల రోజుల కోర్సు పూర్తి చేశాను. తిరిగి వచ్చాక ముంబయిలో మరో ప్రొఫెషనల్ కోర్సు నేర్చుకున్నాను. ఇప్పటికీ నేర్చుకోవడం నా వృత్తిలో ఒక భాగం అయింది. దానికోసం దేశవిదేశాల్లోని వర్క్‌షాప్‌లు, మాస్టర్‌క్లాస్‌లు, ట్రేడ్ ఎగ్జిబిషన్లకు వెళుతూ ఉంటాను. వాటివల్ల ప్రస్తుత ట్రెండ్, నూతన పద్ధతులు తెలుసుకొనే అవకాశం కలుగుతుంది.

అలా తిరిగింది...

నా కెరీర్‌కు అతిపెద్ద బ్రేక్ వచ్చింది మాత్రం ఎంటీవీ ప్రోమో షూట్‌తో. దాని కోసం నేను మేకప్, హెయిర్ డ్రెస్సింగ్ చేశాను. అది నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇక అక్కడి నుంచి నా ప్రయాణం జెట్ స్పీడ్ అందుకుంది. కొన్ని టీవీ షోలకు న్యాయనిర్ణేతగా కూడా వ్యవహరించాను. ఔత్సాహికులకు తరగతులు నిర్వహిస్తున్నాను. గెస్ట్ లెక్చర్స్ ఇస్తున్నాను. దీపికా పదుకొనే, కత్రినా కైఫ్, అనుష్కా శర్మ, కంగనా రనౌత్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, అదితీరావ్ హైదరీ, పరిణీతి చోప్రా తదితర టాప్ బాలీవుడ్ స్టార్స్‌కు మేకప్ వేశాను. ముఖ్యంగా దీపికా పదుకొనేకు అయితే కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్, మెట్ గాలా, కొన్ని అంతర్జాతీయ మ్యాగజైన్స్ కోసం పని చేశాను. ఆమె పెళ్లి మేకప్ కూడా నేనే వేశాను. అన్నిటికంటే ప్రతిష్టాత్మక మెట్ గాలా కోసం దీపికను ముస్తాబు చేయడాన్ని నేను ఎంతో గౌరవంగా భావిస్తాను. అలాగే కేన్స్ ఉత్సవానికి కూడా. ఇది నాకు దక్కిన అద్భుత అవకాశం.

ప్రముఖులు ఎందరితోనో...

ఈ వృత్తిలోకి వచ్చాక సితారా కుడిగె పనితనం నాకు ప్రేరణనిచ్చింది. తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలి ఉంది. ఏ రంగంలోనైనా పోటీని తట్టుకొని నిలబడాలంటే మనకంటూ




ఒక ప్రత్యేకత ఉండాలి కదా. దాని కోసం నేనూ ప్రయత్నించాను. ఇప్పుడు నా పేరు చెప్పగానే 'నో మేకప్ లుక్స్' అనే ట్యాగ్‌లైన్ గుర్తుకువస్తుంది పరిశ్రమలో ఎవరికైనా. ఇదే నా మేకప్ ప్రత్యేకత. అందానికి మెరుగులు అద్దాలే కానీ, మేకప్ పేరుతో సహజ సౌందర్యాన్ని దాచేయకూడదనేది నా ఉద్దేశం. అంతర్జాతీయంగా ప్రసిద్ధి పొందిన ఫ్రెంచ్ హెయిర్ డ్రెస్సర్ లారెంట్ ఫిలిప్పన్, అమెరికా మేకప్ ఆర్టిస్ట్ రోషర్‌తో కలిసి కొన్ని ప్రాజెక్ట్‌లో పని చేశాను. ఆ అనుభవం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. అలాగే వోగ్, హార్పర్ బజార్, గ్రాజియా, జీక్యూ, కాస్మోపాలిటన్ తదితర మ్యాగజైన్లు, టెలివిజన్ కమర్షియల్స్‌కు సేవలు అందించాను. అందుకే చెబుతున్నాను... మనసు చంపుకొని పని చేయవద్దు. నచ్చిన రంగంలో మనసు పెట్టి కష్టపడితే విజయం తప్పక వరిస్తుంది."

ఎన్నడూ ఊహించలేదు...

నాకు చిన్నప్పటి నుంచి మేకప్ అంటే అమితమైన ఇష్టం. అందుకు మా అమ్మే నాకు ప్రేరణ. ఆవిడ మేకప్ వేసుకోవడం చూసి నాకూ ఆసక్తి కలిగింది. ఒకసారి తన మేకప్ కిట్ తస్కరించి, ఎవరికీ తెలియకుండా నాకు నేను మేకప్ వేసుకున్నాను. నన్ను నేను చూసుకుని మురిసిపోయాను. వయసుతోపాటు ఆ అభిరుచి కూడా నాలో అంతర్లీనంగా పెరుగుతూ వచ్చింది. కెరీర్ ఆరంభంలో కొన్నాళ్లు బ్రైడల్ మేకప్‌లు కూడా చేశాను. రోజువారీ ఖర్చుల కోసం. అయితే సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్ కావాలని ఎప్పుడూ అనుకోలేదు. అసలు అది నా ఊహల్లోనే లేదు. ఈ వృత్తి పట్ల నాకున్న అంకితభావం, కష్టపడి పని చేసే తత్వమే ఇవాళ నన్ను ఇంత ఎత్తులో నిలబెట్టిందనేది నా నమ్మకం.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శనివారం • 24 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



మహేశ్ సినిమా పేరు అదేనా?

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో డా.కె.ఎల్.నారాయణ నిర్మించే చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మహేశ్ పుట్టినరోజున సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వస్తుందని ఆశగా ఎదురు చూసిన ఆయన అభిమానులు ఏదీ రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. యాక్షన్ అడ్వెంచర్‌గా ఈ సినిమా ఉంటుందన్న సమాచారం తప్ప కొత్త వార్తలేమీ బయటకు రావడం లేదు. సినిమా టీమ్ మాత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో సీరియస్‌గా నిమగ్నమై ఉంది. ఇటువంటి నేపథ్యంలో ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. విజువల్ డెవలప్‌మెంట్ ఆర్టిస్ట్ టీపీ విజయన్ తన ఇన్‌స్టా స్టోరీస్‌లో బంగారు వర్ణంలో ఉన్న గద్ద రెక్కలు ఉంచి మహేశ్ సినిమా టైటిల్ ఇదే అని అర్థం వచ్చేలా పోస్ట్ చేయడంతో అభిమానుల్లో చర్చ మొదలైంది. ఈ సినిమాకు 'గరుడ' అనే టైటిల్ పెట్టవచ్చు అనే ఊహాగానాలు ఊపందుకొన్నాయి. గతంలో దర్శకుడు రాజమౌళి 'బాహుబలి' తర్వాత తను చేయబోయే ప్రాజెక్ట్ 'గరుడ' అని వెల్లడించారు. ఆ ప్రాజెక్ట్ ఇదే అయి ఉంటుందని, సినిమాకు 'గరుడ' అని పేరు పెడతారని సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. మహేశ్ చిత్రానికి 'గరుడ' టైటిల్ ఖాయమో కాదో అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

సమంతకు ఏమైంది?



సిటాడెల్ వెబ్‌సిరీస్ ఇండియన్ వెర్షన్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించనున్నారు సమంత. ఆమె సినిమాలు తగ్గించినా.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. అలానే అప్పుడప్పుడు పలు ఈవెంట్లలో పాల్గొని ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తుంటారు. అయితే ఇటీవల ముంబైలో జరిగిన ఓ కార్యక్రమానికి సమంత బ్లాక్ డ్రస్సులో వచ్చారు. ఈ సందర్భంగా తీసుకున్న వీడియోను ఆమె అభిమానులతో సోషల్‌మీడియాలో పంచుకున్నారు. ఇక అప్పటి నుంచి అభిమానుల కామెంట్లు మొదలైయ్యాయి. 'సమంతకు ఏమైంది... ఆమె మునుపటిలా ఎందుకు అందంగా కనిపించట్లేదు. బరువు తగ్గినట్లుంది. ముఖంలో ఆనందం కనిపించట్లేదు' అని పలువురు అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు.

రవితేజకు శస్త్ర చికిత్స



హీరో రవితేజ కుడిచేతికి సర్జరీ జరిగింది. చికిత్స చేసిన వైద్యులు ఆయనని ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. 'ఆర్‌టీ75' సినిమా చిత్రీకరణలో రవితేజకు ఇటీవలే స్వల్ప గాయమైంది. ఆ గాయాన్ని లెక్కచేయకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. దాంతో ఆ గాయం మరింత పెద్దదవ్వడంతో డాక్టర్లు సర్జరీ చేశారు. కాగా, 'సామజవరగమన' చిత్రానికి రచయితగా పనిచేసిన భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

అలా కామెంట్ చేసినందుకు చింతిస్తున్నా



హీరో నాని నటించిన తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఓ మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రభాస్‌పై అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. 'ఆ వ్యాఖ్యల వల్ల అర్షద్‌కు ఎప్పుడూ రానంత ఫేమ్ వచ్చింది" అని అన్నారు. అయితే ఇప్పుడా మాటలు సోషల్‌మీడియాలో హాట్ టాపిక్కయ్యాయి. ఆ మాటల వల్ల సోషల్‌మీడియాలో అభిమానులు నాని వర్సెస్ అర్షద్ అంటూ రెండు వర్గాలుగా చీలిపోయారు. తాజాగా, 'సరిపోదా శనివారం' ప్రమోషన్స్ కోసం ముంబై వెళ్లిన నాని.. తాను అర్షద్‌పై చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. "అర్షద్ చాలా గొప్ప నటుడు. ఆయన గురించి అలా మాట్లాడినందుకు బాధపడుతున్నాను. నటులుగా ఉన్నప్పుడు మాట్లాడే ప్రతీ మాట విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే అవి వైరల్ అయ్యి ప్రమాదంగా మారే అవకాశం ఉంది. ఇప్పుడు ప్రభాస్‌పై అర్షద్ చేసిన వ్యాఖ్యల్లో.. అర్షద్‌పై నేను చేసిన వ్యాఖ్యల్లో ఆ పొరపాటే జరిగింది. నిజానికి నేను అర్షద్‌ని అలా అనాలనుకోలేదు. నా మాటలు సోషల్‌మీడియా ద్వారా అలా తప్పుదోవ పట్టాయి. నేను ఆయనపై అలా మాట్లాడినందుకు వచ్చిన రియాక్షన్స్‌ను చూసి అర్షద్ పూర్తి ఇంటర్వ్యూ చూశాను. అందులో ఆయన మాట్లాడిన మాటలు తప్పుదోవ పట్టాయని అర్థమైంది. అదే విధంగా నా వ్యాఖ్యలు కూడా మరో రకంగా ప్రజల్లోకి వెళ్లాయి" అని పేర్కొన్నారు.

హేమపై నిషేధాన్ని తొలగించిన 'మా'



నటి హేమ ఊపిరి పీల్చుకున్నారు. ఆమెపై 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) నిషేధాన్ని తొలగించింది. 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. మేలో జరిగిన ఓ రేవ్ పార్టీలో ఆమె డ్రగ్స్ తీసుకుందని.. పోలీసులు నిర్వహించిన డ్రగ్స్ టెస్టులో నిర్ధారణ కావడంతో ఆమెపై 'మా' సస్పెన్షన్ విధించింది. అయితే ఆమె అందులో నిరపరాధినని పేర్కొంటూ.. ఓ ల్యాబ్‌లో మెడికల్ టెస్టులు చేసుకుని ఆ నివేదికల్ని మంచు విష్ణుకు ఓ లేఖతో పాటు అందించారు. ఈ అంశాలన్నింటినీ పరిశీలించిన 'మా' ఆమెపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు.

సినీటాకు మంచు విష్ణు లేఖ

ప్రభాస్‌పై బాలీవుడ్ అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలు ఎంతటి దుమారాన్ని రేపాయో తెలిసిందే. ఈ వివాదంపై స్పందిస్తూ.. మంచు విష్ణు 'మా' తరపున 'సినీటా' (సినిమా అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షురాలు పూనమ్ ధిల్లాన్‌కు లేఖ రాశారు. "ప్రతీ ఒక్కరికి నచ్చినట్లు మాట్లాడే స్వేచ్ఛ ఉంది. కానీ ప్రభాస్‌ని కించపరుస్తూ అర్షద్ చేసిన వ్యాఖ్యల వల్ల అభిమానుల మనోభావాలు దెబ్బతిన్నాయి. సినీనటుల ఐక్యత, గౌరవాన్ని కాపాడటంలో ఎల్లప్పుడూ ముందుండే 'సినీటా'.. ఈ వివాదంపై స్పందిస్తుందని ఆశిస్తున్నాను. ఇలాంటి వ్యాఖ్యలు భవిష్యత్తులో మరోసారి పునరావృత్తం కాకుండా తగిన సూచనలు అర్షద్‌కు చేస్తారని ఆశిస్తున్నాను. మనమంతా ఒకే కుటుంబం. ఆ ఐక్యతను కొనసాగిద్దాం" అని లేఖలో పేర్కొన్నారు.



'ఎమర్జెన్సీ'ని బ్యాన్ చేయాల్సిందే!

సిక్కుల డిమాండ్




కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం ఇప్పుడు మరో వివాదంలో చిక్కుకుంది. సెప్టెంబర్ 6న ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. అయితే సిక్కుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా 'ఎమర్జెన్సీ' చిత్రం ఉందనీ, సిక్కులకు వ్యతిరేకంగా రూపుదిద్దుకున్న ఈ సినిమాను వెంటనే బ్యాన్ చేయాలనీ, విడుదల చేయడానికి వీల్లేదని శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) అకల్ తక్త్ డిమాండ్ చేశాయి. ఎస్‌జీపీఎస్ చీఫ్ హర్‌జిందర్ సింగ్ ధామి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి కంగనను తీవ్రంగా విమర్శించడమే కాకుండా ఆమెపై కేసు పెట్టాలని కూడా కోరారు. సిక్కులను వ్యతిరేకించే సన్నివేశాలు ఈ మధ్య సినిమాల్లో ఎక్కువ అయ్యాయనీ, అందుకే సెన్సార్‌బోర్డ్‌లో సిక్కులకు కూడా తగినంత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. 'ఎమర్జెన్సీ' చిత్రం తీస్తున్నట్లు 2021లో కంగనా ప్రకటించినప్పటి నుంచీ ఈ సినిమాకు చిక్కులే. ఇందులో ఆమె మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషిస్తూ, దర్శకత్వం వహించారు. ఇది ఇందిరా గాంధీ బయోపిక్ కాదనీ, ఓ పొలిటికల్ డ్రామా అని ఎన్నోసార్లు కంగనా వెల్లడించానా వివాదాలు ఈ సినిమాను వదల్లేదు. ఎన్నో అవరోధాలు తట్టుకుని, విడుదలకు సిద్ధం చేస్తే ఇప్పుడు సిక్కుల నుంచి కంగనాకు ప్రతిఘటన ఎదురైంది.

పెళ్లిపీటలపై మరో హీరోయిన్!



తెలుగు హీరోయిన్లు వరుసగా పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్ పెళ్లి అయిన రోజునే అంటే గురువారం రాత్రే మరో హీరోయిన్ మేఘా ఆకాశ్, ఆమె చిరకాల ప్రియుడు సాయివిష్ణుల నిశ్చితార్థం కేరళలో జరిగింది. తమకు ఎంగేజ్‌మెంట్ జరిగిన విషయాన్ని గురువారం అర్థరాత్రి వెల్లడించి, ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది మేఘా ఆకాశ్. పెళ్లి ఎప్పుడన్నది మాత్రం ఆమె పేర్కొనలేదు. సాయివిష్ణు, మేఘా ఆకాశ్ ఆరేళ్లుగా ప్రేమలో ఉన్నారట.









అనిల్ అంబానీపై సెబీ వేటు

రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ నిధుల మళ్లింపు వ్యవహారంలో కఠిన చర్యలు


రూ.25 కోట్ల జరిమానా

- ఐదేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్లో పాల్గొనకుండా నిషేధం
- కుప్పకూలిన రిలయన్స్ గ్రూప్ షేర్లు
- మరో 24 సంస్థలపైనా చర్యలు

న్యూఢిల్లీ: పారిశ్రామికవేత్త, రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ అంబానీతో పాటు మరో 24 మందికి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ పెద్ద షాకిచ్చింది. అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీ రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్) నిధుల మళ్లింపు వ్యవహారంలో ఆయనపై ఏకంగా రూ.25 కోట్ల జరిమానా విధించింది. దీనికి తోడు ఆయన ఐదేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్లో పాల్గొనకుండా నిషేధం విధించింది. ఈ కాలంలో అనిల్ ఏ లిస్టెడ్ కంపెనీలో గానీ, సెబీ వద్ద నమోదైన సంస్థల్లో గానీ ఎటువంటి డైరెక్టర్ లేదా కీలక మేనేజ్‌మెంట్ పదవులు (కేఎంపీ) చేపట్టకూడదని స్పష్టం చేసింది. దీంతో ఇప్పటికే పీకల్లోతు సమస్యల్లో ఉన్న అనిల్ అంబానీ వ్యాపార సామ్రాజ్యం కథ ముగిసినట్టేనని భావిస్తున్నారు. భారత కార్పొరేట్ చరిత్రలో సెబీ ఒక పారిశ్రామికవేత్తపై ఇంత భారీగా జరిమానా విధించడం ఇదే మొదటిసారి. కాగా ఈ విషయంపై అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ ఇంతవరకు స్పందించలేదు.

ఇదీ కథ

అనిల్ అంబానీ.. అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ (అడాగ్) ఛైర్మన్‌గా తన పరపతిని ఉపయోగించి రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ బోర్డు పదే పదే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా, కంపెనీ నిధులను రుణాల పేరుతో తన నిర్వహణలోని అల్లాటప్పా కంపెనీలకు రూ.14,577.68 కోట్లు దారి మళ్లించినందుకు సెబీ ఈ చర్య తీసుకుంది. ఇందులో రూ.12,487.56 కోట్ల మొత్తాన్ని ఊరూ పేరు లేని 47 డొల్ల కంపెనీలకు మళ్లించారని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలింది. ఈ విషయంలో అనిల్ అంబానీకి సహకరించిన 24 సంస్థలపైనా ఐదేళ్ల నిషేధంతో పాటు రూ.21 కోట్ల నుంచి రూ.25 కోట్ల చొప్పున మొత్తం రూ.625 కోట్ల భారీ జరిమానాలు విధించింది. ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్‌పైనా ఆరు నెలల నిషేధంతో పాటు రూ.6 లక్షల జరిమానా విధించింది. మరోవైపు సెబీ కూడా 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంస్థ ఖాతాలను పరిశీలించి నిధుల మళ్లింపు నిజమేనని నిర్ధారించుకుంది. ఈ విషయంలో అనిల్ అంబానీకి అమిత్ బప్నా, రవీంద్ర సుధాల్కర్, పింకేష్ ఆర్ షా అనే వ్యక్తులు సహకరించినట్టు విచారణలో తేలింది.



గ్రూప్ షేర్లు ధమాల్

తాజా పరిణామాలతో రిలయన్స్ గ్రూప్ కంపెనీల షేర్లు శుక్రవారం కుప్పకూలాయి. బీఎస్ఈలో రిలయన్స్ ఇన్‌ఫ్రా షేరు 10.07 శాతం నష్టంతో రూ.211.70 వద్ద ముగియగా ఎన్ఎస్ఈలో 10.91 శాతం నష్టంతో రూ.209.99 వద్ద క్లోజైంది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ షేరు కూడా బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో 5 శాతం నష్టంతో రూ.4.46 వద్ద ముగిసింది. రిలయన్స్ పవర్ షేరు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో ఏకంగా లోయర్ సర్క్యూట్ బ్రేకర్‌ను తాకి వరుసగా రూ.34.48, రూ.34.45 వద్ద ముగిశాయి.

ఇతర సమస్యలు

రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ కమ్యూనికేషన్స్‌తో పాటు తన నిర్వహణలోని రిలయన్స్ క్యాపిటల్‌తోనూ అనిల్ అంబానీ నిండా మునిగారు. రూ.24,000 కోట్ల విలువైన రుణ పత్రాలు చెల్లించలేక 2021లో ఈ కంపెనీ కూడా దివాలా తీసింది. ముంబైలో తొలి మెట్రో లైన్‌ను నిర్మించిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ కూడా ప్రస్తుతం రుణ పత్రాల బకాయిలు చెల్లించలేక ఆపసోపాలు పడుతోంది.

మసకబారిన చరిత్ర

తండ్రి ధీరూభాయ్ అంబానీ మరణానంతరం ఆస్తుల పంపకం దగ్గర అన్న ముకేశ్ అంబానీతో అనిల్ అంబానీ బాగానే గొడవ పడ్డారు. చివరికి కొంతమంది పెద్దల మధ్యవర్తిత్వంతో 2005లో ఇద్దరి మధ్య ఆస్తుల పంపకం ఒప్పందం కుదిరింది. టెలికాం, ఇంధనం, ఫైనాన్స్ రంగాలను అనిల్ తన అధీనంలోకి తెచ్చుకున్నారు. ముకేశ్ అంబానీ పెట్రో రసాయనాలతో సరిపుచ్చుకున్నారు. ఆస్తుల పంపకం తర్వాత అనిల్ అంబానీ పెద్ద ఎత్తున తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇవేవీ కలిసి రాక చివరికి దాదాపు అన్ని సంస్థలు దివాలా తీశాయి. దీంతో 2008లో 4,200 కోట్ల డాలర్ల ఆస్తులతో ప్రపంచ కుబేరుల్లో ఆరో స్థానంలో ఉన్న అనిల్ అంబానీ ఇప్పుడు కనీసం సోదిలో కూడా లేకుండా పోయారు. మరోవైపు అన్న ముకేశ్ అంబానీ మాత్రం టెలికాం, ఫైనాన్స్, రిటైల్ రంగాల్లోకి ప్రవేశించి ప్రపంచ కుబేరుల్లో ఒకరిగా ఎదిగారు. రిలయన్స్ కమ్యూనికేషన్ (ఆర్‌కామ్) కోసం ఎరిక్సన్ ఏబీ ఇండియా నుంచి తీసుకున్న రూ.550 కోట్ల అప్పు చెల్లించలేక పోవడంతో 2019లో సుప్రీంకోర్టు.. అప్పు చెల్లిస్తారా? లేక జైలుకు వెళతారా? అని అనిల్ అంబానీని హెచ్చరించింది. దాంతో తమ్ముడిని జైలు శిక్ష నుంచి రక్షించేందుకు, ముకేశ్ అంబానీ ఆ అప్పు తీర్చి అనిల్ అంబానీని ఆదుకున్నారు.

వడ్డీ రేట్ల కోతకు సమయం ఆసన్నమైంది..

యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్

కాన్సాస్ సిటీ (అమెరికా): ప్రామాణిక వడ్డీ రేట్లను త్వరలో తగ్గించనున్నట్లు అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ స్పష్టమైన సంకేతాలిచ్చారు. జాక్సన్ హోల్, వ్యోమింగ్‌లో శుక్రవారం జరిగిన ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ కాన్సాస్ సిటీ వార్షిక సదస్సులో పావెల్ ప్రసంగించారు. "ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను సర్దుబాటు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. భవిష్యత్ ప్రయాణ దిశ స్పష్టంగా ఉంది. అయితే, వడ్డీ రేట్లను ఎప్పుడు తగ్గించాలి, ఎంత మేర తగ్గించాలనేది ముందు విడుదల కానున్న స్థూల ఆర్థిక గణాంకాలు, భవిష్యత్ పరిణామాలు, లాభ, నష్టాల సమతుల్యత వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంద"ని ఆయన అన్నారు. దేశం (అమెరికా)లో వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం క్రమంగా ఫెడ్ నియంత్రణ లక్ష్యమైన 2 శాతం దిశగా తగ్గుతూ వస్తోందన్న నమ్మకం పెరిగిందన్నారు. చారిత్రక గరిష్ఠానికి పెరిగిన ద్రవ్యోల్బణానికి కళ్లెం వేసేందుకు ఫెడ్ రిజర్వ్ 2022 మార్చి నుంచి 2023 జూలై మధ్యకాలంలో ప్రామాణిక వడ్డీ రేట్లను వరుసగా 11 సార్లు పెంచింది. దాంతో ఫెడ్ ప్రామాణిక రేట్ల శ్రేణి రెండు దశాబ్దాలకు పైగా గరిష్ఠ స్థాయి 5.25-5.50 శాతానికి చేరుకుంది. గడిచిన కొన్ని నెలల్లో అమెరికాలో ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గడంతో వచ్చే నెలలో ఫెడ్ రేట్లు తగ్గవచ్చని మార్కెట్లో ఊహాగానాలు ఇప్పటికే ఊపందుకున్నాయి. పావెల్ తాజా వ్యాఖ్యలు ఆ అంచనాలకు మరింత బలం చేకూర్చాయి.

జడ్చర్లలో పిడిలైట్ రోఫ్ ప్లాంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పిడిలైట్ ఇండస్ట్రీస్‌కు చెందిన టైల్స్ అతికింపు (అడ్‌హెసివ్) ఉత్పత్తుల తయారీ సంస్థ రోఫ్ తెలంగాణలోని జడ్చర్లలో కొత్త ప్లాంట్‌ను ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఈశాన్య కర్ణాటక మార్కెట్ల అవసరాలు ఈ ప్లాంట్ తీరుస్తుందని కంపెనీ తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లలో ప్రీమియం, స్పెషలైజ్డ్ ఉత్పత్తులకు డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని పిడిలైట్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ పురి అన్నారు. టైల్స్, రాళ్లు అతికించే ఉత్పత్తుల పరిశ్రమను ఆధునీకరించాలన్న తమ విజన్‌కు అనుగుణంగా ఈ ప్లాంట్‌ను నెలకొల్పినట్టు చెప్పారు. అయితే ప్లాంట్‌పై ఎంత పెట్టుబడి పెట్టిందీ ఆయన వెల్లడించలేదు. కస్టమర్లకు అత్యున్నత నాణ్యత గల అడ్‌హెసివ్ ఉత్పత్తులు అందుబాటులోకి తేవడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. జడ్చర్ల ప్లాంట్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరించుకోగల సదుపాయాలు కూడా మెండుగా ఉన్నాయన్నారు.

ఊగిసలాటల్లోనూ స్వల్ప లాభం

సెన్సెక్స్ 33 పాయింట్లు అప్

ముంబై: వారాంతం ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటలకు లోనైన ప్రామాణిక ఈక్విటీ సూచీలు.. చివరికి అతి స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. సెన్సెక్స్ 33.02 పాయింట్ల వృద్ధితో 81,086.21 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 11.65 పాయింట్ల పెరుగుదలతో 24,823.15 వద్ద క్లోజైంది. జాక్సన్ హోల్ సింపోజియమ్‌లో అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగం నేపథ్యంలో అంతర్జాతీయంగా ఈక్విటీ ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణిని కనబరిచారని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో సగమే లాభపడ్డాయి.

ఇంటర్నేషనల్ జెమ్మాలజికల్ రూ.4,000 కోట్ల ఐపీఓ: అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు కలిగిన ఇంటర్నేషనల్ జెమ్మాలజికల్ ఇన్‌స్టిట్యూట్ (ఇండియా) లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా రూ.4,000 కోట్ల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది.

ఎకోస్ మొబిలిటీ ఇష్యూ ధరల శ్రేణి రూ.318-334: ఎకోస్ (ఇండియా) మొబిలిటీ అండ్ హాస్పిటాలిటీ లిమిటెడ్ ఐపీఓ ఈ నెల 28న ప్రారంభమై 30న ముగియనుంది. ఐపీఓ ద్వారా రూ.601 కోట్ల వరకు సమీకరించనుంది. కాగా ఈ కంపెనీ ఇష్యూ ధరల శ్రేణిని రూ.318-334 గా నిర్ణయించింది.

నిఫ్టీ-50 నుంచి దివీస్ ఎగ్జిట్

హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్‌తో పాటు ఎల్‌టీఐ మైండ్‌ట్రీ.. నిఫ్టీ-50 సూచీ నుంచి వైదొలగనున్నాయి. వీటి స్థానాన్ని టాటా గ్రూప్ కంపెనీ ట్రెంట్, ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) భర్తీ చేయనున్నాయి. సెప్టెంబరు 30 నుంచి ఈ మార్పు జరగనుందని ఎన్ఎస్ఈ ఇండిసెస్ వెల్లడించింది.

అదానీ కుటుంబం.. రూ.30,000 కోట్ల వాటాల విక్రయం!

అంబుజా సిమెంట్స్‌లో ఇప్పటికే రూ.4,250 కోట్ల వాటా అమ్మకం

న్యూఢిల్లీ: భారత్‌లో రెండో అతిపెద్ద ధనవంతుడైన గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం.. తమ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల్లో వాటాలను సర్దుబాటు చేసుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. వచ్చే 9 నెలల్లో గ్రూప్ కంపెనీల్లో మొత్తం రూ.30,000 కోట్ల విలువైన వాటాలను విక్రయించాలనుకుంటున్నట్లు తెలిసింది. ఈ కుటుంబం అంబుజా సిమెంట్స్‌లో రూ.4,250 కోట్ల విలువైన 2.8 శాతం వాటాను బహిరంగ మార్కెట్లో బ్లాక్‌డీల్స్ ద్వారా శుక్రవారం విక్రయించింది. భారతీయ అమెరికన్ రాజీవ్ జైన్‌కు చెందిన జీక్యూజీ పార్ట్‌నర్స్‌తో పాటు నేషనల్ పెన్షన్ సిస్టమ్ ట్రస్ట్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సహా పలువురు ఇన్వెస్టర్లు ఈ వాటా షేర్లను చేజిక్కించుకున్నాయి. అంబుజా సిమెంట్స్‌లో ప్రమోటరైన అదానీ కుటుంబానికి 70.33 శాతం వాటా ఉంది. బ్లాక్‌డీల్ తర్వాత ఇది 67.53 శాతానికి తగ్గింది. కాగా, ఈ ఏడాది చివరికల్లా అదానీ పవర్‌లోనూ 3 శాతం వరకు వాటా విక్రయం ద్వారా రూ.8,000-10,000 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది. గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల్లో వాటాను 64-68 శాతం స్థాయిలో ఉండేలా అదానీ ఫ్యామిలీ విక్రయ ప్రణాళికను రూపొందించుకుందని ఓ ఆంగ్లదినపత్రిక కథనం పేర్కొంది.

అంబుజాలో జీక్యూజీకి 3.13 శాతం వాటా: అంబుజా సిమెంట్స్‌లో ఇప్పటికే 1.35 శాతం వాటా కలిగిన జీక్యూజీ పార్ట్‌నర్స్.. తాజా లావాదేవీలో మరో 1.78 శాతం వాటాను రూ.2,746.79 కోట్లకు కొనుగోలు చేసింది. దాంతో కంపెనీలో జీక్యూజీ మొత్తం వాటా 3.13 శాతానికి పెరిగింది.

మహిళల కోసం ప్రత్యేక పొదుపు ఖాతా

బంధన్ బ్యాంక్

బంధన్ బ్యాంక్ తన వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కొత్తగా రెండు పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా మహిళల కోసం ప్రత్యేకంగా అవ్నీ పేరుతో పొదుపు ఖాతాను ప్రారంభించింది. ఈ ఖాతా కింద మహిళలకు లాకర్ అద్దెపై 25 శాతం రాయితీతో పాటు బంగారం రుణాల ప్రాసెసింగ్ ఫీజుపై 50 శాతం డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తోంది. అలాగే అవ్నీ ఖాతా ద్వారా ప్రత్యేక డెబిట్ కార్డుతో ఉచిత ఎయిర్‌పోర్ట్ లాంజ్ ప్రవేశం, రూ.10 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమాను ఆఫర్ చేస్తోంది. దీంతో పాటు బంధన్ బ్యాంక్ డిలైట్స్ పేరుతో కస్టమర్ లాయల్టీ ప్రోగ్రామ్‌ను బ్యాంక్ అందుబాటులోకి తీసుకువచ్చింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,650▼	66,600▼	91,700▼
ముంబై	71,424▼	65,424▼	84,615▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	485
వరంగల్	452	గోదావరి	485
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	విజయవాడ	113
వరంగల్	109	గుంటూరు	110
కరీంనగర్	109	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	102
కర్నూలు	109	నెల్లూరు	102
విశాఖపట్నం	109	అనంతపురం	110
గోదావరి	113		

స్పోర్ట్స్

కాజల్‌కు స్వర్ణం



అమ్మాన్ (జోర్డాన్): అండర్-17 వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత మహిళా రెజ్లర్ల జోరు కొనసాగుతోంది. శుక్రవారం మన మహిళలు స్వర్ణ, రజత పతకాలు సొంతం చేసుకున్నారు. మహిళల 69 కి. ఫైనల్లో ఒలెక్సాండ్రా (ఉక్రెయిన్)ను 9-2తో చిత్తు చేసిన కాజల్ స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఇక..మహిళల 46 కి. స్వర్ణ పతక పోరులో యు కట్సుమి (జపాన్) చేతిలో ఓడిన శ్రుతిక రజత పతకంతో సరిపెట్టుకుంది. మహిళల 40 కి.లలో రాజ్‌బాల, మహిళల 53 కి.లలో ముస్కాన్ కాంస్య పతకాలు దక్కించుకున్నారు. అయితే పురుషుల విభాగంలో బరిలోకి దిగిన ఐదుగురు భారత రెజ్లర్లలో ఒక్కరు కూడా సెమీస్‌కు చేరలేకపోయారు. కాగా..మహిళల ఫ్రీస్టయిల్‌లో గురువారం భారత్ నాలుగు స్వర్ణాలు సాధించిన విషయం విదితమే.

ఇస్లామ్ సెంచరీ మిస్



బంగ్లాదేశ్ 316/5
పాక్‌తో తొలి టెస్ట్

రావల్పిండి: ఓపెనర్ షాద్‌మన్ ఇస్లామ్ (93) పునరాగమనంలో శతకం చేజార్చుకోగా, మోమినుల్ హక్ (50), ముష్ఫికర్ రహీమ్ (55 బ్యాటింగ్), లిటన్ దాస్ (52 బ్యాటింగ్) రాణించడంతో తొలి టెస్ట్‌లో పాకిస్థాన్‌కు బంగ్లాదేశ్ దీటైన జవాబిచ్చే దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 27/0తో శుక్రవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన పర్యాటక జట్టు మూడోరోజు ఆఖరికి ఐదు వికెట్లకు 316 పరుగులు చేసింది. పాకిస్థాన్ స్కోరుకు ఇంకా 132 పరుగుల వెనుకంజలో నిలిచింది. ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 448/6 (డిక్లేర్డ్) స్కోరు చేసింది. కాగా..ఈ మ్యాచ్ మిగిలిన రెండో రోజులు అభిమానులకు ఉచితంగా ప్రవేశం కల్పించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిర్ణయించింది.

విజయం దిశగా ఇంగ్లండ్

మాంచెస్టర్: శ్రీలంకతో తొలి టెస్ట్‌లో ఇంగ్లండ్ జట్టు విజయం దిశగా అడుగులు వేస్తోంది. రెండో ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆట ఆఖరికి శ్రీలంక 204/6 స్కోరు చేసింది. 82 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉన్న పర్యాటక జట్టుకు కేవలం నాలుగు వికెట్లే చేతిలో ఉన్నాయి. అంతకుముందు ఓవర్‌నైట్ 259/6తో మూడోరోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 358 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 236 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

కిశోర్ కుమార్ రికార్డు

మాల్దీవ్స్: అండర్-18 ఆసియన్ సర్ఫింగ్ చాంపియన్‌షిప్స్‌లో సెమీస్‌కు చేరిన తొలి భారత ప్లేయర్‌గా కిశోర్ కుమార్ రికార్డు నెలకొల్పాడు. మొత్తం ఎనిమిది మంది భారత ఆటగాళ్లు పాల్గొనగా తమిళనాడుకు చెందిన కిశోర్ ఒక్కడే పోటీలో మిగిలాడు. హీట్ 3 క్వార్టర్స్‌లో కిశోర్ అత్యధికంగా 11.50 స్కోరు సాధించాడు. అలాగే ఈ చాంపియన్‌షిప్స్‌లో భారత్ తరఫున ఇదే అత్యధికం కావడం విశేషం. శనివారం సెమీస్ జరుగుతుంది.

ఈ స్టార్ల ప్రతిభకు పసిడి పంటే!

పారాలింపిక్స్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

సమ్మర్ ఒలింపిక్స్‌ను ఘనంగా ముగించిన పారిస్ ఇప్పుడు పారాలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. 22 క్రీడాంశాల్లో 4500 మంది అథ్లెట్లు పాల్గొనబోతున్న ఈ ఈవెంట్ ఈనెల 29 నుంచి 11 రోజుల పాటు జరగనుంది. ఇందులో గత పారాగేమ్స్‌లో విశేష ప్రతిభ కనబర్చడంతో పాటు బరిలోకి దిగిన ప్రతీ అంతర్జాతీయ వేదికపై అద్భుతంగా రాణిస్తున్న గ్లోబల్ స్టార్లున్నారు. తాజా గేమ్స్‌లోనూ వారిపై అంచనాలు ఆకాశాన్నంటాయి. ఓసారి అలాంటివారిపై లుక్కేద్దాం..





బంగారు చేప.. సిమోన్ బార్లామ్ — స్విమ్మింగ్

పారాగేమ్స్ స్విమ్మింగ్‌లో ఇటలీ ఆధిపత్యానికి బార్లామ్‌దే కీలక పాత్ర. మిలన్‌కు చెందిన 24 ఏళ్ల సిమోన్ కాలు మరో కాలితో పోలిస్తే చిన్నదిగా ఉంటుంది. చిన్నతనంలో సర్జరీల కోసం అతను పారిస్‌లో కొంతకాలం గడిపాడు. 14 ఏళ్ల వయస్సులో స్విమ్మింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్న బార్లామ్ ఎస్ 9 కేటగిరీలో టోక్యో గేమ్స్‌లో ఓ స్వర్ణం, రెండు రజతాలు, ఓ కాంస్యం సాధించాడు. అలాగే గతేడాది వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ఆరు విభాగాల్లో ఆరు స్వర్ణాలు అందుకుని తాజా పారాలింపిక్స్‌లో ప్రత్యర్థులకు దడ పుట్టించబోతున్నాడు.



అజేయుడు... అలెక్సిస్ హాన్‌క్విన్‌క్వాంట్ — ట్రయాథ్లాన్

పీటీఎస్4 ట్రయాథ్లాన్‌లో పోటీపడే 38 ఏళ్ల అలెక్సిస్ డిఫెండింగ్ చాంపియన్ కూడా. టోక్యో గేమ్స్ తర్వాత అతను పాల్గొన్న ఏ టోర్నీలోనూ అపజయమే లేదు. 2010లో యాక్సిడెంట్‌కు గురైన అలెక్సిస్ కుడి మోకాలి కింది భాగం నుంచి కాలును తీసేయాల్సి వచ్చింది. అయినా నిరాశచెందకుండా 2016 నుంచి పారా ట్రయాథ్లాన్‌లో జోరు కొనసాగిస్తున్నాడు.

నెంబర్‌వన్.. డీడే డి గ్రూట్

వీల్‌చెయిర్ టెన్నిస్

వీల్ చెయిర్ టెన్నిస్‌లో 27 ఏళ్ల డీ గ్రూట్ మహిళల సింగిల్స్, డబుల్స్‌లోనూ వరల్డ్ నెంబర్‌వన్‌గా కొనసాగుతోంది. ఆమె ఖాతాలో మొత్తం 42 టైటిళ్లున్నాయి. ఆ జోరుతోనే టోక్యో పారాలింపిక్స్ సింగిల్స్, డబుల్స్‌లోనూ స్వర్ణాలు సాధించగలిగింది. కుడి కాలు లోపంతో జన్మించిన గ్రూట్ ఏడో ఏట టెన్నిస్‌పై ఆసక్తి పెంచుకుంది. 2017లో తొలి టైటిల్ అందుకున్న తర్వాత ఇక వెనుదిరిగి చూడలేదు. అంతేకాకుండా 2021 నుంచి ఈ ఏడాది వరకు వరుసగా ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను ఖాతాలో వేసుకుని చరిత్ర సృష్టించింది. ఈ ఘనతలకు గుర్తుగా ఈ ఏడాది ఆరంభంలో అంగవైకల్య విభాగంలో ప్రతిష్ఠాత్మక లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ద ఇయర్‌గానూ నిలవడం విశేషం.



బ్లేడ్ జంపర్.. మార్కస్ రెహ్మ్ — అథ్లెటిక్స్

ఇప్పటికే 4 ఒలింపిక్ స్వర్ణాలను ఖాతాలో వేసుకున్న మార్కస్ రెహ్మ్‌ను అంతా బ్లేడ్ జంపర్‌గా పిలుచుకుంటారు. లాంగ్‌జంప్‌లోనే అతను మూడు గోల్డ్ మెడల్స్ సాధించాడు. పారిస్ పారా అథ్లెటిక్స్‌లోనూ అతడినే ఫేవరెట్‌గా పరిగణిస్తున్నారు. నీటిలో వేక్‌బోర్డింగ్ చేస్తున్న సమయంలో రెహ్మ్ తన కుడి కాలిని కోల్పోయాడు. 2011లో ప్రొస్థెసిస్ కాలుతో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొని టీ64 ఈవెంట్‌లో ఆధిక్యం ప్రదర్శిస్తున్నాడు. అలాగే 8.72మీ. దూరంతో వరల్డ్ రికార్డు నెలకొల్పాడు.



ఒక్సానా మాస్టర్స్ — సైక్లింగ్

చెర్నోబిల్ రియాక్టర్ పేలుడు జరిగిన మూడేళ్లకు శారీరక లోపాలతో జన్మించిన ఒక్సానా అనాథాశ్రమంలో పెరిగింది. ఆ తర్వాత ఏడేళ్ల వయస్సులో యూఎస్ మహిళ దత్తత తీసుకోవడంతో ఉక్రెయిన్ నుంచి తరలివెళ్లింది. ముందు రోయర్‌గా లండన్ పారాగేమ్స్‌లో కాంస్యం సాధించిన ఒక్సానా అనంతరం పారా సైక్లింగ్, క్రాస్ కంట్రీ స్కీయింగ్ వైపు దృష్టి సారించింది. టోక్యోలో సైక్లింగ్ రెండు విభాగాల్లోనూ స్వర్ణాలు దక్కించుకుంది.

సిల్వర్ బుల్లెట్.. మార్సెల్ హగ్

అథ్లెటిక్స్

తలకు సిల్వర్ హెల్మెట్‌తో బరిలోకి దిగే మార్సెల్ దృష్టి మాత్రం ఎప్పుడూ స్వర్ణంపైనే ఉంటుంది. ఎందుకంటే 38 ఏళ్ల ఈ స్విస్ గ్రేట్ ఖాతాలో ఇప్పటికే ఆరు పారాలింపిక్స్ స్వర్ణాలున్నాయి. వెన్నెముక సమస్యతో జన్మించిన హగ్ టోక్యో పారాగేమ్స్ టీ54 కేటగిరీలో మారథాన్‌తో పాటు 800, 1500, 5000మీ.లలోనూ స్వర్ణాలు దక్కించుకున్నాడు. అంతకుముందు రియో పారాగేమ్స్‌లో రెండు స్వర్ణాలు అందుకున్నాడు. ఈసారి కూడా హగ్ ఈ నాలుగు విభాగాలను క్లీన్‌స్వీప్ చేస్తాడనే అంతా భావిస్తున్నారు.



90 మీ. లక్ష్యానికి చేరువలో నీరజ్



లాసన్నే: పారిస్ ఒలింపిక్స్ బరిలో దిగిన నీరజ్ చోప్రా..జావెలిన్ త్రోలో రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. అయితే పారిస్‌లో నీరజ్ విసిరిన ఆరు త్రోలలో ఐదు ఫౌల్ కావడం ఆశ్చర్యపరిచింది. గజ్జల్లో గాయంతో బాధపడుతుండడమే అన్ని ఫౌల్స్‌కు కారణమని చోప్రా ఆ తర్వాత వివరణిచ్చాడు. ఈ నేపథ్యంలో నీరజ్..గురువారం అర్ధరాత్రి జరిగిన లాసన్నే డైమండ్ లీగ్ జావెలిన్ ఫైనల్లో ప్రశంసనీయ రీతిలో రాణించాడు. ఎంతో కాలంగా తనను ఊరిస్తున్న 90 మీటర్ల మార్క్ సమీపానికి చేరుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్ (89.45మీ.)ను మించి 89.49మీ. దూరం ఈటెను విసిరిన చోప్రా రెండో స్థానంలో నిలిచాడు.

అతడి సలహాతోనే..: కెన్యా జావెలిన్ త్రోయర్ జులియస్ ఎగో ఇచ్చిన సలహా పాటించి తాను లాసన్నేలో రెండో స్థానం చేజిక్కించుకున్నట్టు నీరజ్ వెల్లడించాడు. 'ఆఖరి రౌండ్‌లో అండర్సన్ 90 మీ. విసరడంతో నేను ఒత్తిడికి లోనయ్యా. అయితే ప్రశాంతంగా ఉంటే అనుకున్న దూరం విసరగలుగుతావని ఎగో సలహా ఇచ్చాడు' అని నీరజ్ తెలిపాడు. అది ఫలించి చోప్రా దాదాపు 90 మీ. దరిదాపులకు రావడం విశేషం. కాగా జులియస్ ఎగో ఆరో స్థానంలో నిలిచాడు.

ఆసీస్ మహిళలకు ఆధిక్యం

గోల్డ్‌కోస్ట్: ఇండియా 'ఎ'తో అనధికార టెస్ట్‌లో ఆస్ట్రేలియా 'ఎ' మహిళల జట్టు పట్టుబిగించింది. మిన్ను మణి ఐదు వికెట్లు పడగొట్టడంతో ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆటఆఖరికి 164/7 చేసింది. అంతకుముందు ఇండియా 'ఎ' 184 రన్స్‌కు ఆలౌటైంది. ఆస్ట్రేలియా 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులు చేసింది.

ఆ టెస్టుకు రెస్ట్ డే

కివీస్‌తో శ్రీలంక సిరీస్

కొలంబో: శ్రీలంక-న్యూజిలాండ్ జట్ల మధ్య వచ్చేనెల 18నుంచి గాలె వేదికగా జరిగే టెస్టుకు రెస్ట్ డే కేటాయించారు. ఇందులో 21వ తేదీని విశ్రాంతిరోజుగా ప్రకటించారు. రెండో టెస్టు మాత్రం ఐదు రోజులే జరగనుంది.

ఎందుకీ విశ్రాంతి? : సెప్టెంబరు 21ని విశ్రాంతి దినంగా ప్రకటించడం వెనుక కారణం.. అదే రోజు శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు ఉండడమే. అందుకే తొలి రెండు రోజుల మ్యాచ్ తర్వాత మూడో రోజున మ్యాచ్‌ను నిర్వహించడం లేదు. మరోవైపు 23 ఏళ్ల తర్వాత శ్రీలంక జట్టు స్వదేశంలో ఆరు రోజుల టెస్టును నిర్వహించబోతోంది. 2001లో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లోనూ విశ్రాంతి దినం కేటాయించారు. 2008లో బంగ్లాదేశ్ కూడా పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శ్రీలంకతో ఆరు రోజుల టెస్టు ఆడింది.

ధోనీ విషయంలో తప్పు చేశా



దినేశ్ కార్తీక్

చెన్నై: మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ గతవారం తన ఆల్‌టైమ్ ఫేవరెట్ ఎలెవన్ జట్టును ప్రకటించాడు. అయితే ఇందులో ఆశ్చర్యకరంగా ఎంఎస్ ధోనీకి చోటివ్వలేదు. దీంతో నెట్టింట డీకేపై తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో అతడు వివరణ ఇచ్చాడు 'ధోనీ విషయంలో నేను చాలా పెద్ద తప్పు చేశాను. ఆ జాబితా బయటికి వచ్చాకే ఈ పొరపాటును గమనించాను. అందుకే అందరూ నన్ను క్షమించాలి. లిస్టులో ద్రవిడ్ ఉండడంతో అతడినే కీపర్‌గా అనుకున్నారు. కానీ నిజానికి నేను కీపర్ పేరును మర్చిపోయా. నా జట్టుకు ధోనీనే కెప్టెన్' అని డీకే తెలిపాడు.

వరుసగా నాలుగో డ్రా

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్యూఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌లో గుకేష్, ప్రజ్ఞానందకు వరుసగా నాలుగో డ్రా ఎదురైంది. నాలుగో రౌండ్‌లో ఫ్రాన్స్ జీఎం అలీరెజా ఫిరౌజాతో గుకేష్, మరో బోర్డుపై నెదర్లాండ్స్ జీఎం అనిష్ గిరితో తలపడిన ప్రజ్ఞానంద తమ గేమ్‌లను డ్రా చేసుకున్నారు.

ఎడారిలో దారి తప్పి.. నమాజ్ చేస్తూ మృత్యువాత

» సహోద్యోగితో కలిసి సౌదీలో కరీంనగర్ యువకుడి దుర్మరణం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)


షహేబాజ్ ఖాన్(ఫైల్)

కనుచూపు మేరలో ఎటు చూసినా ఇసుక దిబ్బలు.. మండిపోతున్న ఎండకు తోడు అడుగు తీసి అడుగు వేయలేని స్థితి.. గమ్యం చేరాలంటే ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి.. జీపీఎస్ సిగ్నల్ పని చేయడం లేదు. బ్యాటరీ అయిపోయి మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. ఎవరినైనా మార్గం అడుగుదామంటే మనిషి అనేవాడి జాడే లేదు. దారి వెతుక్కుంటూ అటుఇటు తిరగడంతో కారులో ఉన్న కాస్త ఇంధనం కూడా ఖాళీ అయింది. దిక్కుతోచని స్థితిలో ఆకలిదప్పులను దిగమింగుకుని ఎడారిలో నాలుగు రోజులు పాటు గడిపిన తెలంగాణకు చెందిన ఓ యువకుడు చివరకు నమాజ్ చేస్తూ ప్రాణం వదిలాడు. సౌదీ అరేబియాలోని అత్యంత ప్రమాదకరమైన రుబా అల్ ఖలీ అనే ఎడారిలో జరిగిన ఈ ఘటనలో కరీంనగర్‌కు చెందిన మొహమ్మద్ షహేబాజ్ ఖాన్(27) అత్యంత దయనీయ స్థితిలో మరణించాడు. కరీంనగర్‌కు చెందిన షహేబాజ్ సౌదీ అరేబియాలోని అల్ హసా ప్రాంతంలోని ఒక టెలికం కంపెనీలో టవర్ టెక్నీషియన్‌గా పని చేసేవాడు. విధి నిర్వహణలో భాగంగా సుడాన్‌కు చెందిన సహచర ఉద్యోగితో కలిసి షహేబాజ్ ఐదు రోజుల క్రితం కారులో ఓ చోటుకి వెళ్లాడు. ఈ క్రమంలో జీపీఎస్ సక్రమంగా పని చేయకపోవడంతో దారి తప్పి రుబా అల్ ఖలీ ఎడారికి చేరుకున్నారు. నాలుగు దేశాల్లో విస్తరించి ఉన్న ఈ ఎడారిలో దారి తప్పితే మరణమే శరణమ్మని స్థానికంగా నమ్ముతారు. ఈ ఎడారిలో ఒంటెలు ఉండవు కనీసం కాలినడకన కూడా ప్రయాణించలేం. అలాంటి భయంకరమైన ప్రాంతంలో ఇరుక్కుపోయిన షహేబాజ్ జీవితంపై ఆశలు వదులుకున్నాడు. తన కారు పక్కనే ఇసుకలో చాప (జనిమాజ్) పరిచి నమాజ్ చేస్తూ సహచరునితో కలిసి ప్రాణాలు కోల్పోయాడు. వీరి గల్లంతుపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు హెలికాప్టర్ల సాయంతో గాలించి.. నమాజ్ చేసే చాపపై పడి ఉన్న మృతదేహాలను కనుగొన్నారు.

విమానం నడిపిన అర్హతల్లేని పైలట్లు

» ఎయిర్ ఇండియాకు రూ.90 లక్షల జరిమానా

న్యూఢిల్లీ, ఆగస్టు 23: తగిన శిక్షణ, అర్హతల్లేని పైలట్లతో విమానాన్ని నడిపించినందుకు టాటా గ్రూపు ఆధ్వర్యంలోని ఎయిర్ ఇండియా సంస్థకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) రూ.90 లక్షల జరిమానా విధించింది. ఇందుకు బాధ్యులను చేస్తూ ఎయిర్ ఇండియా ఆపరేషన్స్ విభాగం డైరెక్టర్ పంకుల్ మాథుర్‌కు రూ.6 లక్షలు, శిక్షణ విభాగం డైరెక్టర్ మనీష్ వాసవాడాకు రూ.3 లక్షల జరిమానా వేసింది. అర్హత లేని పైలట్లతో విమానాన్ని నడిపించినట్టు జులై 10న ఎయిర్ ఇండియాయే స్వచ్ఛందంగా ఓ నివేదిక రూపంలో డీజీసీఏ దృష్టికి తీసుకెళ్లింది. దాని ఆధారంగా దర్యాప్తు జరిపిన డీజీసీఏ ఇది తీవ్రమైన విషయమని, భద్రతకు ముప్పు కలిగిస్తుందని పేర్కొంటూ జరిమానా వేసింది.

స్నాతకోత్సవాల కోసం భారతీయ దుస్తులు

» రూపొందించాలని వర్సిటీలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 23: స్నాతకోత్సవాల సందర్భంగా విద్యార్థులు ధరించే దుస్తులను భారతీయ సంప్రదాయాలకు అనుగుణంగా రూపొందించాలని కేంద్ర ఆరోగ్య శాఖ తన పరిధిలోని విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలకు సూచించింది. అవి ఆయా సంస్థలు ఉన్న రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించేవిగా ఉండాలని తెలిపింది. ప్రస్తుతం స్నాతకోత్సవం సందర్భంగా విద్యార్థులు నల్లని పొడవాటి గౌను, టోపీ ధరిస్తున్నారు. ఇది బ్రిటిష్ సంప్రదాయం కావడంతో దాన్ని తొలగించాల్సి ఉందని పేర్కొంది. దీనిపై కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శికి ప్రతిపాదనలు పంపాలని ఎయిమ్స్ సహా ఇతర సంస్థలకు సూచించింది.

మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై చార్జ్‌షీట్

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై 42వ ప్రత్యేక ప్రజాప్రతినిధుల కోర్టులో సిట్ అధికారులు శుక్రవారం చార్జ్‌షీట్ దాఖలు చేశారు. మహిళలపై లైంగిక దాడుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజ్వల్‌పై హొళెనరసీపుర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి సిట్ దర్యాప్తు అధికారి సుమారాణి 137 మంది సాక్షులను విచారించారు. ఆ వివరాలతో 2,144 పేజీల చార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించారు. ప్రజ్వల్ పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు నితీశ్ ఎర్ర జెండా

న్యూఢిల్లీ, ఆగస్టు 23: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు బీజేపీ మిత్రపక్షాల్లో కీలకంగా మారిన జేడీయూ కూడా ఎర్ర జెండా చూపింది. ఇప్పటికే లోక్ జన్‌శక్తి(రామ్ విలాస్) పార్టీ అధినేత చిరాగ్ పాశ్వాన్ ఈ బిల్లుపై ప్రశ్నలు సంధించారు. దీంతో బీజేపీ మిత్రపక్షాల్లోనే ఈ బిల్లును వ్యతిరేకించిన మరో పార్టీగా జేడీయూ నిలిచింది. ముస్లింల ప్రయోజనాలను కాపాడేందుకు బిల్లులో మార్పులు చేయాలని జేడీయూ అధినేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్ డిమాండ్ చేసినట్టు తెలిసింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బిహార్ రాష్ట్రంలో 18 శాతం వరకు ముస్లిం జనాభా ఉంది.

ఆర్టికల్ 370ని పునరుద్ధరిస్తారా?

» కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పొత్తుపై అమిత్ షా

న్యూఢిల్లీ, ఆగస్టు 23: రానున్న జమ్మూ-కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్‌లు పొత్తు కుదుర్చుకోవడంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా మండిపడ్డారు. అధికారంపై యావతో దేశ భద్రత, సమగ్రతను పణంగా పెట్టి ఈ రెండు పార్టీలు పొత్తు పెట్టుకున్నాయని విమర్శించారు. పాకిస్థాన్‌తో చర్చలను పునఃప్రారంభించడం, జమ్మూ-కశ్మీర్ ప్రత్యేక జెండా (ఎర్ర జెండా)ను, 370 అధికరణాన్ని పునరుద్ధరించడం వంటి అంశాలను నేషనల్ కాన్ఫరెన్స్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని, వాటికి కాంగ్రెస్ మద్దతు ఇస్తున్నట్టేనా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు ఆయన పది ప్రశ్నలను సంధించారు.

బంగ్లాదేశ్ క్రికెటర్ షకీబ్‌పై హత్య కేసు



ఢాకా, ఆగస్టు 23: ప్రముఖ బంగ్లాదేశ్ క్రికెట్ క్రీడాకారుడు, ఆల్ రౌండర్ షకీబ్ అల్ హసన్‌పై హత్య కేసు నమోదయింది. ఆయన అవామీ లీగ్ పార్టీ మాజీ ఎంపీ కూడా కావడం గమనార్హం. ఈ నెల ఏడో తేదీన ఢాకాలోని రింగ్ రోడ్ వద్ద జరిగిన అల్లర్లలో తుపాకీ గుళ్లు తగిలి రుబెల్ అనే వ్యక్తి మరణించాడు. ఇందుకు అవామీ లీగ్‌దే బాధ్యత అని పేర్కొంటూ ఆ వ్యక్తి తండ్రి రఫీకల్ ఇస్లాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో షకీబ్‌ను 28వ నిందితునిగా పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు.ఇదే కేసులో ప్రముఖ సినీనటుడు, అవామీలీగ్ మాజీ ఎంపీ ఫిర్దౌస్ అహ్మద్‌ను 55వ నిందితునిగా పేర్కొన్నారు.

ట్రంప్ అధ్యక్షుడైతే తీవ్ర పరిణామాలు: కమల



వాషింగ్టన్, ఆగస్టు 23: రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ దేశాధ్యక్షుడైతే ప్రజలు అత్యంత తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి, ప్రస్తుత వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ హెచ్చరించారు. 2020లో ట్రంప్ మద్దతుదారులు అధ్యక్ష భవనంపై చేసిన దాడిని గుర్తు చేశారు. భారత్, ఆఫ్రికా మూలాలున్న కమలా హారిస్ డెమొక్రటిక్ పార్టీ తరఫున దేశ అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని గురువారం రాత్రి అంగీకరించారు. ఈ సందర్భంగా షికాగోలోని డెమొక్రటిక్ నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కీలక ప్రసంగం చేశారు. ట్రంప్‌పై తీవ్ర విమర్శలు చేశారు. అలాగే, తాను అధ్యక్షురాలిగా ఎన్నికైతే అమెరికాను అగ్రరాజ్యంగా నిలబెట్టేందుకు ఏం చేస్తాననే అంశాలను వెల్లడించారు. విభజన, వివక్ష, విద్వేషం వంటి సమస్యలను అధిగమించేందుకు నవంబరులో జరిగే అధ్యక్ష ఎన్నికలు ప్రజలకు గొప్ప అవకాశమని పిలుపునిచ్చారు. తాను దేశ అధ్యక్షురాలినైతే అంతరిక్షం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో దేశాన్ని ప్రపంచానికే అగ్రగామిగా చేస్తానని తెలిపారు. చైనాను వెనక్కునెట్టి అమెరికాను 21వ శతాబ్దానికే అగ్రరాజ్యంగా నిలబెడతానని తెలిపారు. అలాగే, ఇజ్రాయెల్, ఉక్రెయిన్ తోపాటు నాటోకు అండగా ఉంటామని ప్రకటించారు.

పాక్ భూభాగంలో పడ్డ భారత నిఘా డ్రోన్

న్యూఢిల్లీ, ఆగస్టు 23: భారత సైన్యానికి చెందిన నిఘా డ్రోన్ ఒకటి అదుపు తప్పి పాకిస్థాన్ భూభాగంలో పడిపోయింది. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి సెక్టార్‌లో నిఘా కోసం వినియోగిస్తున్న ఆ డ్రోన్ శుక్రవారం ఉదయం 9.30గంటల సమయంలో సాంకేతిక లోపంతో, పొరపాటున సరిహద్దు రేఖకు అవల, పాకిస్థాన్‌లోని నికియాల్ సెక్టార్‌లో పడిపోయింది. ఈ డ్రోన్‌ను పాక్ సైన్యం స్వాధీనం చేసుకుంది. ఈ ఘటనపై భారత సైనికాధికారులు పాకిస్థాన్‌లోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్(డీజీఎంవో) స్థాయి అధికారులతో సంప్రదింపులు జరపునున్నట్లు సైనిక వర్గాలు తెలిపాయి. 2022లో భారత క్షిపణిని పరీక్షిస్తుండగా సాంకేతిక లోపం కారణంగా అది పాక్ భూభాగంలోకి వెళ్లి పడిన సంగతి తెలిసిందే. అప్పుడు పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటీవల భారత వైమానిక దళానికి చెందిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తి రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో ఎయిర్ స్టోర్‌ను జారవిడిచింది. దీంతో, బాంబు పేలినట్లుగా భారీ శబ్దం వచ్చింది.

భార్యపై అనుమానంతో ఇంట్లో సీక్రెట్ కెమెరాలు!

» భర్తకు 3 నెలల జైలు.. తైవాన్‌లో ఘటన

తైవాన్, ఆగస్టు 23: భార్య వివాహేతర సంబంధాన్ని బయటపెట్టేందుకు ఓ భర్త చేసిన పని.. చివరికి అతడినే దోషిని చేసింది. ఇంట్లో రహస్య కెమెరాలు అమర్చినందుకు అతడికి కోర్టు 3 నెలల జైలు శిక్ష విధించింది. తైవాన్‌కు చెందిన ఫాన్‌కుఒ భార్య, ఇద్దరు పిల్లలున్నారు. చాన్నాళ్లు సాఫీగానే సాగిన ఫాన్ సంసారంలో 2022లో గొడవలు మొదలయ్యాయి. భార్య ప్రవర్తనలో మార్పు రావడంతో ఫాన్‌కు ఆమెపై అనుమానం కలిగింది. దీంతో తన ఇంటిలోని హాల్, బెడ్రూంలో రహస్యంగా కెమెరాలు అమర్చాడు. 2 వారాల తర్వాత అతడి అనుమానమే నిజమని తేలింది. అతడి భార్య మరో వ్యక్తితో ఏకాంతంగా కలిసున్న దృశ్యాలు కెమెరాలకు చిక్కాయి. ఫాన్ ఆ వీడియోలు చూపి భార్యతో గొడవపడ్డాడు. విడాకులు కావాలంటూ కోర్టుకెక్కాడు. అయితే, అతని భార్య.. భర్త తన అనుమతి లేకుండా ఇంట్లో రహస్య కెమెరాలు అమర్చి గోప్యతకు భంగం కలిగించాడని కేసు పెట్టింది. న్యాయమూర్తి ఫాన్‌నే తప్పుబట్టారు. ఇతరుల ప్రైవేటు కార్యకలపాలను చిత్రీకరించడం నేరమని పేర్కొంటూ ఫాన్‌కు 3 నెలల జైలు శిక్ష విధించారు.


స్నేహితుడిలా సాయం చేస్తా

రష్యాతో మధ్యవర్తిత్వానికి నా వంతుగా తోడ్పడతా!.. యుద్ధంపై మాది తటస్థ వైఖరి కాదు.. శాంతి పక్షం

» చర్చలు, దౌత్యం మాత్రమే సమస్యలకు పరిష్కారం.. కూర్చొని మాట్లాడుకోండి

» జెలెన్‌స్కీ.. భారత్‌కు రండి: మోదీ

» యుద్ధం అంతానికి మోదీ పర్యటన ఆశారేఖ: ఐక్యరాజ్య సమితి



జూలైలో రష్యా పర్యటనలో పుతిన్‌తో మోదీ ఆలింగనం, శుక్రవారం జెలెన్‌స్కీతో ప్రధాని మోదీ

కీవ్, ఆగస్టు 23: "సమయం వృథా చేయొద్దు.. కూర్చొని మాట్లాడుకోండి. రష్యాతో మధ్యవర్తిత్వానికి నా వంతుగా తోడ్పడతా. శాంతి స్థాపనకు ఓ స్నేహితుడిలా సాయం చేస్తా. చర్చలు, దౌత్యం మాత్రమే సమస్యలకు పరిష్కారం" అని ప్రధాని మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి సూచించారు. యుద్ధంపై భారత దేశం ఎప్పుడూ తటస్థ వైఖరితో లేదని.. తమది శాంతి పక్షం అని స్పష్టం చేశారు. పోలండ్ పర్యటనను ముగించుకుని ప్రత్యేక రైలులో శుక్రవారం ఉదయం ఉక్రెయిన్ రాజధాని కీవ్ చేరుకున్న మోదీ.. ఏడు గంటల పాటు అక్కడ ఉన్నారు. కీవ్ రైల్వే స్టేషన్‌లో ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో మోదీకి ఆహ్వానం పలికారు. అమరుల స్మారకం వద్ద జెలెన్‌స్కీ సాదరంగా స్వాగతించారు. కరచాలనం అనంతరం ఉక్రెయిన్ అధ్యక్షుడిని మోదీ గాఢంగా ఆలింగనం చేసుకున్నారు. భరోసానిచ్చేలా.. భుజంపై గట్టిగా చేయివేసి సంభాషిస్తూ ముందుకు సాగారు. రష్యా దాడిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారులకు నివాళి అర్పించారు. వారి సంస్మరణార్థం బొమ్మను ఉంచారు. ఈ సంక్షోభం పిల్లల పాలిట వినాశకరమైనదని వ్యాఖ్యానించారు. యుద్ధంతో ఉక్రెయిన్ ఎంత తీవ్రంగా నష్టపోయిందో వివరించేలా మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను మోదీ వీక్షించారు. కీవ్‌లోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన ఆశయాలు విశ్వవ్యాప్తమని.. స్ఫూర్తిదాయకమని.. గాంధీ చూపిన బాటలో నడుద్దామని పిలుపునిచ్చారు. ఆ తర్వాత జెలెన్‌స్కీతో మోదీ భేటీ అయ్యారు. సమావేశం ముగిశాక ఇద్దరు నేతలు మీడియాతో మాట్లాడారు. శాంతిని బోధించిన బుద్ధుడు, గాంధీ నడయాడిన నేల నుంచి వచ్చానని.. సాధ్యమైనంత త్వరగా శాంతి నెలకొనాలనేదే తమ ఉద్దేశమని ఆ సందేశంతోనే వచ్చానని చెప్పారు. శాంతి ప్రయత్నాల్లో చురుకైన పాత్ర పోషిస్తామని హామీ ఇచ్చారు. విస్తృత ఆమోదం, శాంతి-సుస్థిరతకు దోహదపడే సరికొత్త పరిష్కారాన్ని రూపొందించేందుకు అన్ని భాగస్వామ్య పక్షాల ఆచరణాత్మక కార్యాచరణ అవసరమని మోదీ పేర్కొన్నారు. దేశాల ప్రాదేశిక సమగ్రతను గౌరవిస్తామని స్పష్టం చేశారు. ఇది యుద్ధాల కాలం కాదని రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు రెండు సందర్భాల్లో చెప్పానన్నారు. కాగా, యుద్ధానికి ముగింపు, న్యాయమైన శాంతి తమ ప్రాధాన్యం అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు.

యుద్ధం గురించే ప్రధానంగా..

మోదీ పర్యటనలో ఉక్రెయిన్‌తో నాలుగు ఒప్పందాలను కుదుర్చుకున్నారు. వ్యవసాయం, ఆహార పరిశ్రమ, ఔషధ, సాంస్కృతిక రంగాలు- మానవతా సాయంలో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు రక్షణ, వాణిజ్యం, వ్యవసాయం, విద్యా రంగాలపై ఇద్దరు నేతలు కీలక చర్చలు సాగించారు. ఉభయ దేశాలు త్వరలో దీనిపై సంయుక్త ప్రకటన చేయనున్నాయి. చర్చల్లో యుద్ధం గురించే ఎక్కువ ప్రస్తావన ఉన్నట్లు విదేశాంగ మంత్రి జైశంకర్ మీడియాకు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను మోదీ అడిగి తెలుసుకున్నారని చెప్పారు. శాంతి మార్గాలను ఆరా తీశారని పేర్కొన్నారు. పరిష్కారానికి చర్చలే మార్గమని.. సంప్రదింపులు సాగాలని అభిలషించారు.

శాంతి చర్చల్లో భారత్ పాత్రకు ఓకే

జెలెన్‌స్కీని భారత్‌లో పర్యటించాలని మోదీ ఆహ్వానించారు. జెలెన్‌స్కీ భారత్‌కు వస్తారని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ ఉక్రెయిన్ పర్యటనను చరిత్రాత్మకమని అభివర్ణించారు. కూలంకషంగా, నిర్మాణాత్మకంగా చర్చలు జరిగాయని ప్రకటించారు. ముమ్ముందు శాంతి చర్చల్లో భారత్ ప్రమేయం ఉండాలని ఉక్రెయిన్ కోరుతోందని జైశంకర్ వివరించారు. యుద్ధంతో తీవ్రగా దెబ్బతిన్న ఉక్రెయిన్‌కు మానవతా సాయంగా 22 టన్నుల వైద్య పరికరాలను భారత్ అందజేసింది. మందులు, శస్త్రచికిత్స పరికరాలతో కూడిన భీష్మ (భారత్ హెల్త్ ఇనీషియేటివ్ ఫర్ సహయోగ్ హిత అండ్ మైత్రి) క్యూబ్‌లను ప్రధాని మోదీ అందజేశారు. ఒక్కో క్యూబ్‌లో 200 రకాల ఔషధాలు ఉంటాయి.

సంక్షోభం తొలగిపోతుందన్న నమ్మకం

ఉక్రెయిన్‌లో మోదీ పర్యటన యుద్ధం ముగింపునకు తోడ్పడుతుందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు దేశాల అధినేతలు ఉక్రెయిన్‌కు వెళ్లారని.. వీరందరి ప్రయత్నాలతో సంక్షోభం సమసిపోతుందనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. సమితి సాధారణ సభ, అంతర్జాతీయ న్యాయ సూత్రాలు, ప్రాదేశిక సమగ్రత ప్రాతిపదికన సమస్యకు పరిష్కార దొరుకుతుందనే ఆకాంక్షను వెలిబుచ్చారు.

అప్పుడు పుతిన్‌తో.. ఇప్పుడు జెలెన్‌స్కీతో మోదీ ఆలింగనం

మోదీ ఉక్రెయిన్ పర్యటనలో అందరినీ ఆకర్షించిన దృశ్యం.. జెలెన్‌స్కీని ఆలింగనం చేసుకోవడం. అయితే, జూలై 9న మోదీ రష్యాలో పర్యటన సందర్భంగా ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌ను ఇదేవిధంగా ఆలింగనం చేసుకున్నారు. దానిపై అప్పట్లో జెలెన్‌స్కీ మండిపడ్డారు. "రష్యా ఈ రోజు చేసిన దాడిలో పిల్లలు సహా 37 మంది చనిపోయారు. చిన్నారుల ఆస్పత్రులనూ వదలడం లేదు. ఇలాంటి సమయంలో ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశ నాయకుడు (మోదీ).. ప్రపంచంలోనే అత్యంత క్రూరుడి (పుతిన్)ని ఆలింగనం చేసుకున్నారు. శాంతి ప్రయత్నాలకు ఇది గట్టి దెబ్బ. తీవ్ర నిరాశాజనకం" అని అన్నారు. అటు పాశ్చాత్య దేశాలు కూడా విమర్శలు చేశాయి. అయితే, అదే జెలెన్‌స్కీని మోదీ ఇప్పుడు ఆలింగనం చేసుకున్నారు. భుజంపై చేయివేసి భరోసాగా ఉంటామన్న అభిప్రాయం కల్పించారు. మరోవైపు తాజా పరిణామం జైశంకర్ మీడియా సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. దీనికి ఆయన గట్టిగా బదులిచ్చారు. "మా దేశంలో పలకరింపుల నేపథ్యంలో ఆలింగనాలు సహజం. భారతీయ సంస్కృతిని చాటే విధానం ఇది. పాశ్చాత్య సంస్కృతిలో ఇలాంటిదేమీ లేదేమో. ఈ విషయంలో మన మధ్య అంతరాలు ఉన్నాయి" అని చురకంటించారు.



నేపాల్‌లో బస్సు నదిలోకి దూసుకెళ్లి 27 మంది భారతీయుల మృతి

» 16 మందికి గాయాలు.. మృతులందరూ మహారాష్ట్ర వాసులే

» కాఠ్మాండూలోని తనహున్ జిల్లాలో ఘటన

కాఠ్మాండూ, ఆగస్టు 23: నేపాల్‌లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. పర్యటకులతో వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు నదిలోకి దూసుకెళ్లడంతో 27 మంది భారతీయులు మరణించారు. మరో 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా మహారాష్ట్రకు చెందిన వారుగా తెలుస్తోంది. మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాకు చెందిన 104 మంది భక్తులు విహారయాత్ర కోసం పది రోజుల క్రితం మూడు బస్సుల్లో నేపాల్ వెళ్లారు. శుక్రవారం ఉదయం నేపాల్‌లోని పొఖారా నుంచి కాఠ్మాండూకు బయలుదేరారు. తనహున్ జిల్లా సమీపంలోని ఐరాపహర్ ప్రాంతంలో ప్రయాణికుల బస్సు అదుపుతప్పి 150 మీటర్ల మర్స్యండ్గి నదిలో పడింది. ఆ సమయంలో బస్సులో 43 మంది ప్రయాణికులు ఉన్నారు. "ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నంబరు ప్లేట్‌తో ఉన్న ఓ ట్రావెల్స్ బస్సు కాఠ్మాండూలోని తనహున్ జిల్లా సమీపంలో నదిలో పడింది. కొండప్రాంతంలో అదుపుతప్పి 150 మీటర్ల లోతులోగల మర్స్యండ్గి నదిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 27 మంది మృతి చెందారు. సమాచారం అందుకున్న ఆర్మీ, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. 16 మందిని రక్షించాం. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాం" అని నేపాల్ అధికారులు తెలిపారు. కాగా, గత నెలలో కొండచరియలు విరిగిపడటంతో రెండు బస్సులు నదిలోకి దూసుకెళ్లిన ఘటనలో ఐదుగురు మరణించారు.

గొళ్లెం లేని తలుపు.. అయినా దారుణం!

కోల్‌కతా హత్యాచారం కేసులో కొత్త వివరాలు

» ఘటన జరిగిన సెమినార్ హాల్ తలుపు బోల్టు గతంలోనే విరిగిపోయినట్లు గుర్తింపు

» దారుణం జరుగుతుంటే ఎవరైనా కాపలా ఉన్నారేమోనని అనుమానాలు



కోల్‌కతా, ఆగస్టు 23: ఆర్జీ కర్ ఆస్పత్రిలో మహిళా జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం కేసుకు సంబంధించి కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆస్పత్రి చెస్ట్ విభాగం సెమినార్‌హాల్‌లో దారుణం చోటు చేసుకున్న సంగతి ఇప్పటికే వెల్లడి కాగా, ఈ హాల్ తలుపునకు ఉన్న గొళ్లెం (టవర్ బోల్ట్) విరిగిపోయి ఉందని తాజాగా వెల్లడైంది. దర్యాప్తు చేస్తోన్న సీబీఐ దీనిపై ప్రధానంగా దృష్టి సారించింది. సెమినార్ హాల్ తలుపునకు ఉన్న టవర్ బోల్ట్ కొంతకాలం కిందటే విరిగిపోయిందని, దీనివల్ల ఆ తలుపు కూడా సరిగా మూసుకోదన్న సంగతి అక్కడ పని చేసే వైద్యులకు, సిబ్బందికి అందరికీ తెలిసిన విషయమేనని ఒక సీబీఐ అధికారి వెల్లడించారు. అటువంటప్పుడు సెమినార్‌హాల్‌లో మహిళా వైద్యురాలిపై అంత దారుణం ఎలా జరిగింది? అది జరుగుతున్నప్పుడు తలుపు బయట ఎవరైనా కాపలాగా నిల్చున్నారా? డాక్టర్ ఆక్రందనలు ఎవరికీ వినిపించలేదా? వంటి అంశాలను పరిశీలిస్తున్నామని ఆ అధికారి తెలిపారు. సెమినార్ హాల్‌లోకి బాధితురాలు ఆగస్టు 9వ తేదీ వేకువజామున 2-3 గంటల మధ్య వెళ్లి నిద్రకు ఉపక్రమించారని, ఆమె నిద్రలో ఉండటాన్ని తాను చూశానని అదే సమయంలో విధుల్లో ఉన్న ఒక డ్యూటీ డాక్టర్ తమకు చెప్పారని పేర్కొన్నారు. పీజీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడినట్లుగా భావిస్తున్న ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్.. సెమినార్‌హాల్‌లోకి ఉదయం నాలుగు తర్వాత ప్రవేశించినట్లు తెలుస్తోంది. మరోవైపు, ఈ కేసుపై ప్రత్యేకంగా ఏర్పాటైన విచారణ కోర్టు సంజయ్‌రాయ్‌ని శుక్రవారం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. అతడిపై పాలీగ్రాఫ్ (లై డిటెక్టర్) టెస్ట్ జరపటానికి కూడా అనుమతించింది. సంజయ్‌రాయ్ మీద ఇప్పటికే డీఎన్ఏ, సైకోఎనాలిసిస్ టెస్టులు జరిపారు. ఆ నివేదికలు రావాల్సి ఉంది.

ఖాళీ అవుతున్న హాస్టళ్లు

పీజీ వైద్య విద్యార్థిని మీద జరిగిన దారుణ హత్యాచారం నేపథ్యంలో ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ క్యాంపస్ హాస్టళ్ల నుంచి మహిళా డాక్టర్లు పెద్ద సంఖ్యలో వెళ్లిపోతున్నారు. నర్సింగ్ హాస్టల్ మినహా ఇతర మహిళా హాస్టళ్లు అన్నీ దాదాపుగా ఖాళీ అయిపోయాయి. ఘటనకు ముందు హాస్టళ్లలో 160 మంది మహిళా జూనియర్ డాక్టర్లు ఉండేవారని, ప్రస్తుతం 17 మంది మాత్రమే ఉన్నారని ఒక జూనియర్ డాక్టర్ తెలిపారు. హత్యాచార ఘటనతోపాటు, ఆగస్టు 14వ తేదీ రాత్రి ఆస్పత్రిపై దుండగులు దాడి చేసి పెద్ద ఎత్తున విధ్వంసానికి పాల్పడిన నేపథ్యంలో.. తమ భద్రత పట్ల ఆందోళనతో పలువురు క్యాంపస్‌ను వీడి వెళ్తున్నారు.

అసోంలో బాలికపై గ్యాంగ్ రేప్

న్యూఢిల్లీ, ఆగస్టు 23: అసోంలోని నగావ్ జిల్లాలో 14 ఏళ్ల బాలికపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారం చేయడం స్థానికంగా ఆందోళనలకు దారితీసింది. ఆ బాలిక గురువారం సాయంత్రం ట్యూషన్ నుంచి ఇంటికి వెళుతుండగా ఈ ఘోరం చోటు చేసుకుంది. దీంతో రోడ్డు పక్కన అచేతనంగా పడివున్న బాలికను రక్షించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ కేసులో తఫజుల్ ఇస్లాం అనే నిందితుడిని అరెస్టు చేశారు. స్థానిక విద్యార్థి సంఘాలు దీనిపై భారీ ఎత్తున ఆందోళనలు నిర్వహించి బంద్‌కు పిలుపునిచ్చాయి.

భారత పౌరసత్వానికి గుడ్‌బై!

ఐదేళ్లలో విదేశీ పౌరులైన 8.34 లక్షల మంది

న్యూఢిల్లీ, ఆగస్టు 23: విదేశాల్లో మెరుగైన విద్య, ఉద్యోగావకాశాలు, వైద్య సదుపాయాలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం వంటి కారణాలతో భారత పౌరసత్వం వదులుకుంటున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గడిచిన ఐదేళ్లలో 8.34 లక్షల మంది దేశ పౌరసత్వాన్ని వదులుకొని విదేశీ పౌరులుగా మారారు. కొవిడ్‌కు ముందు (2011-19) ఏటా సగటున 1.32 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారు. ఆ తర్వాత 2020-23 మధ్య వీరి సంఖ్య 20శాతం పెరిగి సంవత్సరానికి 1.58 లక్షలకు చేరింది. భారత పాస్‌పోర్టుతో అనేక దేశాలకు ప్రయాణించడానికి వీసా తప్పనిసరి. అయితే అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి దేశాల పాస్‌పోర్టులతో ప్రపంచంలో చాలా దేశాలకు వీసా రహిత ప్రయాణం చేయవచ్చనే భావన కూడా భారత పౌరసత్వాన్ని వదులుకోవడానికి దోహదం చేస్తోంది. దేశంలో ద్వంద్వ పౌరసత్వాన్ని అమలులోకి తెస్తే ఈ ధోరణికి అడ్డుకట్ట పడుతుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 2018 నుంచి 2023 వరకూ భారతీయులు 114 దేశాల పౌరసత్వాన్ని పొందారు. వీరిలో చాలామంది అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్, జర్మనీలో స్థిరపడ్డారు. గత ఆరేళ్లలో 70 మంది పాకిస్థాన్ పౌరసత్వం స్వీకరించారు. విదేశాల్లో చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో చైనా తర్వాత భారతీయులే (15లక్షల మంది) అత్యధికం.

ఇస్రో బంగారు బాతు!

ప్రతి రూపాయికీ 2.54 రెట్లు రాబడి

» అంతరిక్ష రంగంలో భారత్ ఘన విజయం

» ఫ్రాన్స్‌కు చెందిన 'నోవాస్పేస్' నివేదికలో వెల్లడి


బెంగళూరులోని నెహ్రూ ప్లానెటోరియంలో చంద్రయాన్ 3 నమూనాను పరిశీలిస్తున్న విద్యార్థులు

న్యూఢిల్లీ, ఆగస్టు 23: ఇస్రో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి కేరాఫ్ అడ్రస్. ఇతర దేశాల కంటే తక్కువ ఖర్చులోనే రాకెట్ ప్రయోగాలు చేపడుతూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. అదే సమయంలో భారీ లాభాలను కూడా ఆర్జిస్తోంది. ఇస్రోపై పెట్టుబడిగా వెచ్చించిన ప్రతి రూపాయికీ 2.54 రెట్లు రాబడిగా వస్తోందని తాజా నివేదికలో వెల్లడైంది. ఫ్రాన్స్‌కు చెందిన నోవాస్పేస్ అనే సంస్థ 'సోషియో-ఎకనామిక్ ఇంపాక్ట్ అనాలసిస్ ఆఫ్ ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్' పేరిట ఈ నివేదికను రూపొందించింది. గ్లోబల్ టెండరింగ్ ప్రక్రియలో భాగంగా ఇస్రో ఈ నివేదికను రూపొందించే బాధ్యతను నోవాస్పేస్‌కు అప్పగించింది. ఇస్రో ఈ తరహా అధ్యయనం చేపట్టడం ఇదే తొలిసారి. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఈ నివేదికను శుక్రవారం విడుదల చేశారు. దీని ప్రకారం.. ఇస్రో సుమారు రూ.5లక్షల కోట్ల ఆర్థిక ప్రయోజనాలు, 47 లక్షల ఉద్యోగాలను సృష్టించింది. దీంతోపాటు రూ.2లక్షల కోట్ల విలువైన పన్ను ఆదాయాన్ని తీసుకొచ్చింది. 2014-2023 మధ్యకాలంలో భారత అంతరిక్ష రంగం జోడించిన స్థూల విలువ రూ.5లక్షల కోట్లు కాగా, వచ్చే పదేళ్లలో ఇది రూ.7.5లక్షల కోట్ల నుంచి రూ.11 లక్షల కోట్ల వరకూ పెరగొచ్చని తాజా నివేదిక అంచనా వేసింది. కాగా, అంతరిక్ష రంగంలో భారత్ ఘన విజయం సాధించిందని నోవాస్పేస్‌కు చెందిన నిపుణుడు స్టీవ్ బొషింగర్ అన్నారు. గత 55 ఏళ్లలో ఇస్రోపై భారత ప్రభుత్వం చేసిన ఖర్చు అమెరికాకు చెందిన నాసా ఏడాది బడ్జెట్ కంటే చాలా తక్కువేనని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఇస్రో వార్షిక బడ్జెట్ రూ.13 వేల కోట్లని, నాసా వార్షిక బడ్జెట్ దీనికంటే 15.5 రెట్లు అధికమని పేర్కొన్నారు. కాగా, జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా చంద్రయాన్-3 మిషన్ నుంచి సేకరించిన సైంటిఫిక్ డేటాను ఇస్రో శుక్రవారం విడుదల చేసింది. దీన్ని ప్రదాన్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతామని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ పేర్కొన్నారు. మరోవైపు, అణ్వాయుధ సామర్థ్యం కలిగిన స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి పృథ్వీ-2 కచ్చితత్వంలో మరోసారి సత్తా చాటింది. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన ఈ మిస్సైల్‌కు రాత్రి సమయంలో నిర్వహించిన పరీక్ష విజయవంతమైంది. ఒడిసా తీరంలోని చాందీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి గురువారం రాత్రి 7:46 గంటలకు డీఆర్‌డీవో సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో దీన్ని పరీక్షించారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

చంద్రయాన్-3 సాధించిన ఘన విజయానికి ఏడాది పూర్తైన సందర్భంగా చేపట్టిన జాతీయ అంతరిక్ష దినోత్సవం వేడుకలను భారత్ ఘనంగా నిర్వహించింది. దీన్ని పురస్కరించుకుని ఇస్రో ఢిల్లీలో శుక్రవారం ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా దేశ ప్రజలందరికీ ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఎక్స్‌లో ఓ వీడియోను పోస్టు చేసిన ఆయన.. చంద్రయాన్-3 విజయంతో ఇస్రో దేశం గర్వించేలా చేసిందని ప్రశంసించారు.


కేన్స్ తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

పరిశ్రమలకు తెలంగాణ అనుకూలం

» 2 నెలల్లో స్కిల్ వర్సిటీ అందుబాటులోకి: శ్రీధర్‌బాబు

» కేన్స్ ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రం ప్రారంభం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 23: సాఫ్ట్‌వేర్ కంపెనీలు, పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్రం అనుకూలంగా ఉందని, అందుకే అనేక మంది పారిశ్రామికవేత్తలు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తున్నారని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ సొల్యూషన్స్‌లో గ్లోబల్ లీడర్ అయిన కేన్స్ రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 7 రాష్ట్రాల్లోని 10 పట్టణాల్లో కేన్స్ టెక్నాలజీ సంస్థ విస్తరించి ఉందని, ఇప్పుడు తెలంగాణలోనూ అడుగు పెట్టడం శుభపరిణామని అన్నారు. రూ.2,800 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలో రెండు వేల మంది ఉపాధి పొందనున్నారని తెలిపారు. కేన్స్ ఎలక్ట్రానిక్స్ ఇతర రాష్ట్రాలకు తరలిపోతుందని గత పాలకులు తప్పుడు ప్రచారం ప్రచారం చేశారని, ఇప్పుడు వారేం సమాధానం చెప్తారంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఫాక్స్‌కాన్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ కూడా త్వరలోనే తన ఉత్పత్తులను ప్రారంభించనుందన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కేన్స్ టెక్నాలజీ ఎండీ రమేశ్ కున్హికన్నన్, ఛైర్‌పర్సన్ సవితా రమేశ్, సీఈవో జైరామ్ పి.సంపత్ పాల్గొన్నారు.

1న పెన్షన్ విద్రోహ దినం.. జిల్లాల్లో నిరసనలు

» తెలంగాణ ఉద్యోగుల జేఏసీ స్టీరింగ్ కమిటీ

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తామని, ఆ రోజు అన్ని జిల్లాల్లో నిరసనలు తెలియజేస్తామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ స్టీరింగ్ కమిటీ ప్రకటించింది. తెలంగాణ ఉద్యోగుల ఐకాస శుక్రవారం టీఎన్‌జీవో కేంద్ర సంఘం భవనంలో సమావేశమైంది. ఉద్యోగ సంఘాల ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్ అధ్యక్షుడిగా, ఏలూరి శ్రీనివాస రావు జనరల్ సెక్రటరీగా 27 మంది సభ్యులతో స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సెప్టెంబరు 1ని పెన్షన్ విద్రోహ దినంగా తీర్మానం చేశారు.

26 ఆలయాల ట్రస్ట్ బోర్డులకు నోటిఫికేషన్

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ పరిధిలోని 26ఆలయాలకు ట్రస్ట్ బోర్డుల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈమేరకు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళీ ఆలయం, బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ గణేష్ ఆలయాలతోపాటు కీసర రామలింగేశ్వర స్వామి, అమ్మపల్లి రామాలయం, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కాళేశ్వర ముక్తేశ్వరాలయం, భద్రకాళి ఆలయం, ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయం, చెరువుగట్టు పార్వతి జడల రామలింగేశ్వర స్వామి, మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం సహా మొత్తం 26 ఆలయాలకు ట్రస్ట్ బోర్డులను నియమించనున్నారు. ట్రస్ట్ బోర్డుల నియామకానికి తగు చర్యలు చేపట్టాలని దేవాదాయ శాఖ డైరెక్టర్‌ను శైలజారామయ్యర్ ఆదేశించారు.

పాత పింఛన్ విధానం పునరుద్ధరించండి

» చిన్నారెడ్డికి సీపీఎస్ ఉద్యోగుల సంఘం వినతి

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ నేతృత్వంలోని బృందం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కార కమిటీ ఛైర్మన్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డికి వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా చిన్నారెడ్డి ఉద్యోగులతో మాట్లాడుతూ.. పాత పింఛన్ విధానం అమలు చేసే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తామని తెలిపారు. కాగా, ఆగస్టు 23వ తేదీని చీకటి దినంగా భావించి.. రాష్ట్రవ్యాప్తంగా జీవో 28 ప్రతులు దహనం చేసి ఉద్యోగులు నిరసన తెలిపినట్లు స్థిత ప్రజ్ఞ వెల్లడించారు.

రాజ్‌భవన్ కార్మికులకు దుస్తులు పంచిన గవర్నర్

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాజ్‌భవన్‌లో పనిచేస్తున్న కార్మికులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దుస్తులు పంపిణీ చేశారు. 'భారత్ సేవాశ్రమ్ సంఘ్' సహకారంతో ఔట్ సోర్సింగ్ కార్మికులు, గార్డెన్ మాలీలు, పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. సంఘ్ హైదరాబాద్ కార్యదర్శి స్వామి మునీశ్వరానంద మహారాజ్, ఇతరులు పాల్గొన్నారు. రాజ్‌భవన్ స్కూల్‌ను గవర్నర్ సందర్శించి, విద్యార్థుల ప్రతిభా పాటవాలను పరీక్షించారు. కాగా, రాష్ట్ర అసెంబ్లీ, శాసన మండలిని ప్రోరోగ్ చేస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

గర్భస్రావాల గుట్టు రట్టు

(మొదటిపేజీ తరువాయి)

చేరడం వల్ల వారు నెలలు నిండకుండానే చనిపోతారు. లేదా జన్మించిన కొద్దిరోజులకే ప్రాణాలు కోల్పోతారు. వరుస గర్భస్రావాలతో బాధపడుతున్న ఒక కుటుంబంపై చేసిన పరిశోధనలో.. ఈ జన్యు ఉత్పరివర్తనాన్ని నిమ్స్ వైద్యులు గుర్తించారు. ఆ కుటుంబానికి చెందిన మహిళకు వరుసగా రెండుసార్లు అబార్షన్ అయ్యింది. రెండోసారి గర్భస్రావం అనంతరం ఆ పిండాన్ని పరిశీలించగా.. గుండె, ఊపిరితిత్తుల భాగంలో బుడగల వంటివాటిని గుర్తించారు. వాటి కారణంగానే ఆ శిశువు చనిపోయినట్టు నిర్ధారించారు. నిమ్స్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ జెనెటిక్స్ విభాగాధిపతి డాక్టర్ షాగున్ అగర్వాల్, నిమ్స్‌లో అదనపు ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞ రంగనాథ్ బృందం అత్యాధునిక డీఎన్ఏ సీక్వెన్సింగ్ పరీక్షలు జరిపి.. ఆ పిండంలోని 'సెర్పిన్ ఏ 11' జన్యువులో ఒక ఉత్పరివర్తనం ఉన్నట్టు గుర్తించారు. దాన్ని గుర్తించడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. ఈ విషయం తెలియగానే సీడీఎఫ్‌డీ రంగంలోకి దిగింది. డాక్టర్ రష్నా భండారీ, డాక్టర్ అశ్విన్‌దలాల్ నేతృత్వంలోని సీడీఎఫ్‌డీ బృందం ఆ జన్యువుపై మరింత సమగ్ర అధ్యయనం చేసి.. దానిలో వచ్చే ఉత్పరివర్తనాల ప్రభావం శరీరంలోని పలు కణాలపై ఉంటుందని, దరిమిలా అది ప్రాణాంతకమైన 'లీథల్ సెర్పినోపతీ' అనే జన్యువ్యాధికి కారణమవుతుందని తేల్చారు. వీరి పరిశోధన ఫలితం 'క్లినికల్ జెనెటిక్స్' జర్నల్ సెప్టెంబరు సంచికలో ప్రచురితమైంది. పదేపదే గర్భస్రావం అవడానికి కారణమయ్యే జన్యువ్యాధుల జాబితాలో ఈ లీథల్ సెర్పినోపతీని కూడా చేర్చారు. కాగా.. తమవద్దకు వచ్చిన మహిళ మూడోసారి గర్భం దాల్చినప్పుడు కూడా ఐదో నెలలోనే గర్భస్రావం అయ్యిందని డాక్టర్ షాగున్ అగర్వాల్ వివరించారు. ఆ పిండంపైన కూడా పరిశోధనలు చేయగా ఇదే ఉత్పరివర్తనం ఉన్నట్లు గమనించామని తెలిపారు. నాలుగోసారి మాత్రం ఆమెకు ఆరోగ్యవంతమైన శిశువు జన్మించినట్లు చెప్పారు. భార్యాభర్తలిద్దరిలో సెర్పిన్ 11 ఏ జన్యువులో సమస్య ఉండడం వల్లే ఈ సమస్యకు కారణమని వెల్లడించారు. పదేపదే గర్భస్రావం అవుతుంటే.. ఆ దంపతులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఇక.. భారతదేశంలో.. మరీ ముఖ్యంగా నిమ్స్‌లో జన్యువ్యాధులపై ప్రపంచానికి ఏ మాత్రం తీసిపోని స్థాయిలో అత్యాధునిక పరిశోధనలు జరుగుతున్నాయనడానికి ఇదే నిదర్శనమని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.

అద్భుతమైన పరిశోధన

మంత్రి దామోదర రాజనర్సింహ అభినందనలు

నిమ్స్ మెడికల్ జెనెటిక్స్ విభాగం, డైరెక్టర్ డాక్టర్ బీరప్ప పర్యవేక్షణలో అద్భుతమైన పరిశోధన చేశారని.. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు తెలిపారు. దీని వల్ల నిమ్స్‌కు అంతర్జాతీయ స్థాయి ప్రతిష్ఠ, గుర్తింపు లభించబోతున్నాయని కొనియాడారు. నిమ్స్ మెడికల్ జెనెటిక్స్ విభాగం వైద్యబృందాన్ని డైరెక్టర్ బీరప్ప నగరి కూడ అభినందించారు.

నేడో రేపో పీసీసీకి కొత్త అధినేత!

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వేర్వేరుగా చర్చలు జరిపారు. తొలుత రేవంత్‌ను, తర్వాత భట్టిని, ఆ తర్వాత ఉత్తమ్ కుమార్ రెడ్డిని పిలిచి.. పీసీసీ అధ్యక్షుడిపై వారి అభిప్రాయాలను విడివిడిగా తెలుసుకున్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో చేర్చాల్సిన నేతల వివరాలను కూడా సేకరించారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితి, ప్రజలకిచ్చిన హామీలపై వస్తున్న ప్రతిస్పందనలు, బీజేపీ, బీఆర్ ఎస్ కార్యకలాపాల గురించి వివరంగా చర్చించారు. రేవంత్ దాదాపు 40 నిమిషాలపాటు వారితో మాట్లాడగా.. భట్టి, ఉత్తమ్ చెరి 15-20 నిమిషాల పాటు తమ అభిప్రాయాలను అధిష్ఠానానికి తెలిపారు. అనంతరం.. రేవంత్, భట్టి, ఉత్తమ్‌తో కేసీ వేణుగోపాల్ కొద్దిసేపు చర్చించారు. ఆ తర్వాత జమ్ము కశ్మీర్ ఎన్నికల అభ్యర్థులపై సీఈసీ భేటీ, కర్ణాటక నేతలతో సమావేశం జరగడంతో వేణుగోపాల్ వారిని రాత్రి 8 గంటల ప్రాంతంలో తన నివాసానికి పిలిచారు. మరోమారు ఆ ముగ్గురు నేతలతో 40 నిమిషాలసేపు మాట్లాడారు. ఆ సమయంలో ముగ్గురు నేతలూ కలిసికట్టుగా తమ అభిప్రాయాలను ఆయనకు వివరించారు. ముగ్గురూ.. బీసీల నుంచి మహేశ్ కుమార్ గౌడ్, మధుయాష్కీ పేర్లను, ఎస్టీల నుంచి బలరాం నాయక్ పేరును ఎస్సీల నుంచి సంపత్ కుమార్, అడ్లూరి లక్ష్మణ్ పేర్లను చెప్పినట్లు తెలిసింది. కాగా బీసీల నుంచే పీసీసీ అధ్యక్షుడిని నియమించే అవకాశాలున్నాయని.. వారిలో మహేశ్ కుమార్ గౌడ్‌కు అధిష్ఠానం ప్రాధాన్యం ఇవ్వొచ్చని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అంతిమ నిర్ణయం అధిష్ఠానానిదే అని రేవంత్, భట్టి, ఉత్తమ్ తేల్చిచెప్పారు. అలాగే.. మంత్రివర్గ విస్తరణలో ప్రస్తుతం నలుగురికే అవకాశం ఉన్నదనే చర్చ జరుగుతోంది. విస్తరణ రేసులో మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, వాకాటి శ్రీహరి, ప్రేమసాగర్ రావు, బాలూ నాయక్, ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, రాంచందర్ నాయక్, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరుల పేర్లు కూడా ప్రస్తావనకు వచ్చాయి. ఏదేమైనా శ్రావణమాసంలోనే పీసీసీ అధ్యక్షుడి నియామకం, మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.



ఇంటింటికీ ఇంటర్నెట్ 300కే

(మొదటిపేజీ తరువాయి)


ఢిల్లీలో కేంద్ర మంత్రి మాండవీయను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి జూపల్లి

రైతు నేస్తం కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోందని, సాంఘిక సంక్షేమ పాఠశాలలకూ టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జాతీయ ఆప్టికల్ ఫైబర్ నెట్ వర్క్ (ఎన్ఓఎఫ్ఎన్) మొదటి దశ మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వానికి సకాలంలో అందించాలని కేంద్ర మంత్రి సింధియాను సీఎం రేవంత్ కోరారు. ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశ లీనియర్ ఆర్కిటెక్చర్ ఆధారంగా నడుస్తుంటే... మిగతా ప్రాంతాల్లో రింగ్ ఆర్కిటెక్చర్ ఆధారంగా టీ-ఫైబర్ నడుస్తోందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. నెట్‌వర్క్ సమర్థ నిర్వహణ, వినియోగం కోసం సకాలంలో ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశ మౌలిక సదుపాయాలను అందించాలని ప్రతిపాదించారు. ఎన్ఓఎఫ్ఎన్ మొదటి దశను భారత్ నెట్-3 ఆర్కిటెక్చర్‌కు మార్చడానికి గతేడాది అక్టోబరులో కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం పంపించిన డీపీఆర్‌ను త్వరగా ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. భారత్ నెట్-3 ద్వారా రాష్ట్రంలోని 33 జిల్లాల ప్రజలకు ఈ-గవర్నెన్స్‌ను అందించవచ్చని అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ ఇంటర్నెట్ సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన భారత్ నెట్ ఉద్యమి పథకాన్ని టీ-ఫైబర్‌కు వర్తింపజేయాలని సింధియాను సీఎం కోరారు.

క్రీడా వర్సిటీపై మన్‌సుఖ్ మాండవీయతో

తెలంగాణ యువతలోని క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు క్రీడా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర క్రీడామంత్రి మన్‌సుఖ్ ఎల్ మాండవీయకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. క్రీడా విశ్వవిద్యాలయంలో అన్ని రకాల క్రీడలకు సంబంధించిన శిక్షణ, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయానికి అవసరమైన ఆర్థిక సహాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులన్నీ తెలంగాణలో ఉన్నాయని, భవిష్యత్తులో నిర్వహించనున్న ఒలింపిక్స్‌తో పాటు ఇతర జాతీయ, అంతర్జాతీయ క్రీడలు నిర్వహించే అవకాశాన్ని తెలంగాణకు ఇవ్వాలని కోరారు. మంత్రి మాండవీయను సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు కలిశారు. క్రీడా శాఖకు సంబంధించి తమ లక్ష్యాలను, ఆకాంక్షలు, తెలంగాణకు ఉన్న ఘనతను కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. అంతర్జాతీయ వేదికలపై క్రీడాకారులు రాణించడానికి అవసరమైన అన్ని వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్, సరూర్ నగర్ స్టేడియం, ఎల్బీ స్టేడియం, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, ఓయూ క్యాంపస్, జింఖానా గ్రౌండ్, హుస్సేన్ సాగర్ ప్రాంతాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఈత కొలనులు, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలు, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్స్, షూటింగ్ రేంజ్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్, స్కేటింగ్ ట్రాక్స్, వాటర్ స్పోర్ట్స్, ఇతర క్రీడలకు వసతులు ఉన్నాయని కేంద్ర మంత్రి మాండవీయకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. హైదరాబాద్‌లో వివిధ కేటగిరీల ఫైవ్ స్టార్ హోటళ్లు ఉన్నాయని, విమాన, రైలు సర్వీసులతో అనుసంధానమై ఉందని తెలిపారు. 2002లో నేషనల్ గేమ్స్, 2003లో ఆఫ్రో-ఏషియన్ గేమ్స్, 2007లో ప్రపంచ మిలటరీ గేమ్స్ నిర్వహించిన అనుభవం హైదరాబాద్‌కు ఉందని గుర్తు చేశారు. ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వహించే అవకాశం భారత్‌కు వచ్చినపుడు తెలంగాణకు కూడా అవకాశం ఇప్పించాలని కోరారు. 2025 జనవరిలో నిర్వహించే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో హైదరాబాద్‌కు అవకాశం ఇవ్వాలని కేంద్ర మంత్రి మాండవీయకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ఖేలో ఇండియా పథకం కింద నిధులు విడుదలను పెంచాలని కోరారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం, సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లోని షూటింగ్ రేంజ్, ఎల్‌బీ స్టేడియం, హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్, సరూర్ నగర్ ఇండోర్ స్టేడియాలలో మౌలిక వసతుల అభివృద్ధికి తాము ఇప్పటికే పంపించిన డీపీఆర్‌లను ఆమోదించాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు.


జూరాల ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

జూరాల 16 గేట్లు ఎత్తివేత

» శ్రీశైలానికి 1.39 లక్షల క్యూసెక్కులు

» నేడు పలు జిల్లాల్లో భారీ వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టు నుంచి అధికారులు నీటి విడుదలను పెంచారు. జలాశయానికి 89 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండటంతో 16 గేట్లను మీటరు మేర ఎత్తి 66,112 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం జూరాలలో 9.1 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు నుంచి 1,05,042 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలయాశయానికి వదులుతున్నారు. శ్రీశైలం సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రాజెక్టులో ప్రస్తుతం 210.3 టీఎంసీల నీరు ఉంది. ఎగువ నుంచి 1,39,147 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నుంచి 69,333 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. నాగార్జున సాగర్ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం 309 టీఎంసీల నీరు ఉంది. సాగర్ నుంచి 48,214 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ఇక, గోదావరి బేసిన్‌లోని మేడిగడ్డ బ్యారేజీలోకి 1.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 85 గేట్ల ద్వారా అంతే నీటిని పంపిస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి రెండు మోటార్ల ద్వారా మిడ్ మానేరులోకి 6,300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. కాగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శనివారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వానలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ నెల 27 వరకు రాష్ట్రానికి యెల్లో అలర్ట్ జారీ చేసింది.

పాఠశాలల్లో ట్రాఫిక్ అవగాహన పార్కులు

» బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాల నియంత్రణ చర్యలు

» సుప్రీం కమిటీ నిర్దేశాల మేరకు రహదారులపై జాగ్రత్తలు

» రోడ్డు భద్రతపై సచివాలయంలో మంత్రి పొన్నం సమీక్ష

హైదరాబాద్, సిటీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం రోడ్డు భద్రతపై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్ దశలోనే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు తెలియాలని.. పాఠశాలల్లో ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నిరుడు రాష్ట్రంలో 22,903 ప్రమాదాల్లో 7,186 మంది చనిపోగా, 2,476 మంది తీవ్రంగా గాయపడ్డారు. దీనిని తీవ్రంగా పరిగణించిన రవాణా శాఖ ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించింది. రోడ్డు భద్రతకు కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రమాదాలకు కారణాలు, జాగ్రత్తలను సచివాలయంలో సమావేశంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. వాటిప్రకారం.. సుప్రీంకోర్టు కమిటీ ఆదేశాల ప్రకారం సంబంధిత విభాగాలు మోటార్ వెహికిల్ చట్టం అమలు చేయాలి. తీవ్ర ప్రమాదాలకు కారణమైన, మద్యం తాగి, రాంగ్ రూట్‌లో నడిపినవారి లైసెన్స్‌లు రద్దు చేయాలి. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల (బ్లాక్ స్పాట్స్)ను గుర్తించి చర్యలు తీసుకోవాలి. జిల్లాల వారీగా ఉన్న రోడ్ భద్రతా కమిటీలు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి. రవాణా, పోలీస్, ట్రాఫిక్, ఆర్అండ్‌బీ, 108, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు.. మరణాలు చోటుచేసుకున్న ప్రతి రోడ్డు ప్రమాదాన్ని సమీక్షించాలి. కారణాలను గుర్తించి.. ఇకపైన ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. జాతీయ రహదారులపై పాదచారుల వంతెనలు నిర్మించాలి. డ్రైవింగ్ లైసెన్సుల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌ల విషయంలో చర్యలు తీసుకునేందుకు ఆయా శాఖలు సమన్వయంతో పనిచేయాలి. రాష్ట్ర, జిల్లాల స్థాయిలో ప్రతి నెల రోడ్డు భద్రతా సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలి. వీటిలో అన్ని విభాగాల అధికారులు పాల్గొనేలా చూడాలి. ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, ఆర్ అండ్‌బీ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు ప్రతి నెల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలి. ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలపై ఈ సమావేశాల్లో సమీక్షించాలి. తరచూ ప్రమాదాలు జరిగే మార్గాల్లో అంబులెన్సులు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయో సమావేశంలో చర్చించారు. దగ్గర్లో అత్యవసర చికిత్స సౌకర్యాలు ఏమున్నాయో ఆరా తీశారు. అంబులెన్సులు, సమీపంలో ఉన్న ఆసుపత్రులకు మధ్య మంచి సమన్వయం ఉండేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

తూర్పు వైపు మరో ఐటీ పార్కు

నెల రోజుల్లోనే విధానపరమైన నిర్ణయం.. హైదరాబాద్ నలువైపులా అభివృద్ధి విస్తరణకు చర్యలు

» ఓఆర్ఆర్ దాకా మెట్రో: శ్రీధర్‌బాబు

» క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం


క్రెడాయ్ ప్రాపర్టీ షోలో స్టాళ్లను సందర్శిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఉప్పల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న ఐటీ పార్కులకు తోడు తూర్పు వైపు మరో ఐటీ పార్కు తీసుకురావాలన్నది ప్రభుత్వ ఆలోచన అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. విధానపరమైన నిర్ణయం అనంతరం నెల రోజుల్లో అధికారిక ప్రకటన చేస్తామన్నారు. నగరం ఒకే వైపు అభివృద్ధి చెందడం అంత మంచిదికాదని, అందుకే అన్ని వైపులా అభివృద్ధి విస్తరణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నాగోల్ మెట్రో స్టేషన్ గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు కొనసాగనున్న క్రెడాయ్ ప్రాపర్టీ షోను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరం తూర్పు వైపు ఐటీ పార్కు ఏర్పాటుకు అనువైన స్థలం కోసం అన్వేషిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగానికి ఢోకా లేదని, నిర్మాణ రంగం స్తబ్దుగా ఉందన్నవి పుకార్లు మాత్రమేనని అన్నారు. ప్రాపర్టీ షోల్లో జరుగుతున్న కొనుగోళ్లే ఇందుకు నిదర్శనమన్నారు. ఇటీవల నిర్వహించిన మొదటి ప్రాపర్టీ షోలో రూ.270 కోట్ల ప్రాపర్టీ కొనుగోళ్లు జరిగినట్లుగా క్రెడాయ్ ప్రతినిధులు చెప్పారన్నారు. ఈ ప్రభుత్వం పెట్టుబడులు తెస్తుందా? లేదా? అనే అనుమానాలు ఉండేవని, వాటిని పటాపంచలు చేస్తూ అమెరికా పర్యటనలో రూ.31 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ విస్తరణతో త్వరలోనే 15 వేల కొత్త ఉద్యోగాలు వస్తాయన్నారు. నగరంలో ఏర్పాటు చేసిన స్కిల్ యూనివర్సిటీతో రెండేళ్లలో దేశానికే స్కిల్ రాజధానిగా హైదరాబాద్ మారుతుందని అన్నారు. మెట్రోరైల్‌ను ఔటర్ రింగు రోడ్డు వరకు తీసుకెళ్లాలనే ఆలోచన సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో ఉందని చెప్పారు.

అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు..

నగరం ఉత్తరం వైపు జీనోమ్ వ్యాలీని విస్తరించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. తూర్పు వైపు మరింత అభివృద్ధి కోసం ఇక్కడ అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు కల్పించాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణాన్ని ప్రోత్సహించేందుకు త్వరలోనే అధ్యయనం చేపడతామన్నారు. రియల్ ఎస్టేట్ అభివృద్ధి హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా తమ ప్రభుత్వ భావిస్తోందని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఇది దోహదం చేస్తుందని చెప్పారు. కాగా, రాష్ట్రంలో చురుకైన పాలన ద్వారా నగర రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతోందని క్రెడాయ్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలో గణనీయంగా పెట్టుబడులు సమీకరించడం శుభసూచకమన్నారు. గత ఐదేళ్లలో ఆఫీస్ స్పేస్ 1.9 రెట్లు పెరిగిందని తెలిపారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌గా హైదరాబాద్ అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్.జైదీప్‌రెడ్డి మాట్లాడుతూ.. చైల్డ్ ఫ్రెండ్లీ ఫీచర్లు, ఆధునిక సౌకర్యాలు, పర్యావరణ అనుకూలతతో డెవలపర్లు ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. స్వల్పకాలిక హౌసింగ్ ధరలు స్థిరంగా ఉంటాయని భావిస్తున్నా.. దీర్ఘకాలిక దృక్పథం సానుకూలంగా ఉంటుందని క్రెడాయ్ ప్రధాన కార్యదర్శి బి.జగన్నాథరావు పేర్కొన్నారు.

దేవుళ్లపై ఒట్టేసి.. రైతులకు దగా

» సగం మందికి కూడా మాఫీ కాలేదు: ఏలేటి

నిర్మల్/నిజామాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): దేవుళ్ల, దర్గాలపై ఒట్టేసి ఆగస్టు 15లోపు రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి.. కొంత మందికే మాఫీ చేసి మిగతా రైతులను మోసం చేశారని బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదురుగా రుణమాఫీపై బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. తమకున్న సమాచారం ప్రకారం దాదాపు 60 లక్షల మంది రైతులు రుణాలు తీసుకోగా, 22 లక్షల మందికి మాత్రమే ఇప్పటి వరకు రుణమాఫీ జరిగినట్లు తెలిసిందన్నారు. ఈ నెలాఖరు వరకు పూర్తి స్థాయిలో రుణమాఫీపై చేయకుంటే హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిరవధిక నిరాహార దీక్షకు దిగుతానని ఏలేటి హెచ్చరించారు. రైతులకు రూ.2 లక్షల లోపు రుణాన్ని మాఫీ చేస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి.. ప్రస్తుతం షరతులు విధించి 30 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. శుక్రవారం నిజామాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాలో 2.5 లక్షల మందికి పైగా రైతులు రుణాలు తీసుకుంటే 83 వేల మందికి మాత్రమే ఇప్పటి వరకు రుణమాఫీ చేశారని చెప్పారు.

సోనియా నివాసానికి ఎంపీ రఘునందన్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలవడానికి శుక్రవారం ఢిల్లీలోని సోనియా గాంధీ నివాసానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు వెళ్లారు. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని బ్లిట్జ్ పత్రికలో వచ్చిన వ్యాసానికి సంబంధించిన ప్రతులను తీసుకెళ్లారు. రాహుల్ గాంధీని కలిసి వాటిని అందజేసే ప్రయత్నం చేయగా.. ఆయన సమావేశంలో ఉన్నారని సిబ్బంది చెప్పారు. దీంతో ఆ ప్రతులను అక్కడి సిబ్బందికి ఇచ్చారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడారు. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని బ్లిట్జ్ పత్రికలో వచ్చిన కథనానికి సోనియా, రాహుల్ స్పందించాలని కోరారు.

కుర్చీలోనే ప్రసవించిన నిండు గర్భిణి!

నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో దారుణం

నల్లగొండ, ఆగస్టు 23: నిండు గర్భిణి పట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్, నర్సులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆమె కూర్చున్న కుర్చీలోనే ప్రసవించింది. ఈ దారుణం నల్లగొండ జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చోటు చేసుకుంది. నల్లగొండ జిల్లా నేరడుగొమ్ము మండలానికి చెందిన గర్భిణి నల్లవెల్లి అశ్వినికి నొప్పులు రావడంతో గురువారం రాత్రి 10గంటల సమయంలో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి వెళ్లింది. అక్కడ డాక్టర్లు లేకపోవడంతో నర్సులు ఆమెను అంబులెన్స్ ఏర్పాటు చేసి నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాత్రి 12.30 గంటలకు ఆమె అక్కడికి చేరుకోగా డాక్టర్ నిఖితతో పాటు నర్సులు అశ్వినిని పరిశీలించి ప్రసవానికి ఇంకా సమయం ఉందని చెప్పారు. అరగంట తర్వాత రెండోసారి బీపీని పరీక్షించి ప్రసవానికి ఇంకా సమయం ఉందని, అటూఇటూ నడవాలని సూచించారు. తెల్లవారు జామున 2 గంటల సమయంలో అశ్విని నడుస్తుండగా నొప్పులు అధికమై అక్కడే ఉన్న కుర్చీలో కూర్చోగా ఆ మరుక్షణమే ప్రసవించింది. అశ్విని తల్లి బిడ్డను గట్టిగా పట్టుకొని డాక్టర్లను పిలవగా నర్సులు వచ్చి వైద్య సేవలు అందించారు. అయితే బిడ్డకు మాత్రం ఎలాంటి ప్రమాదం జరగలేదు. డాక్టర్‌తో పాటు నర్సుల నిర్లక్ష్యం వల్లే ఆమె కుర్చీలోనే ప్రసవించినట్టు అధికారులు గుర్తించారు. ఇందుకు బాధ్యులైన డ్యూటీ డాక్టర్ నిఖితతో పాటు స్టాఫ్ నర్సులు ప్రమీల, ఉమ, పద్మ, సుజాతలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్ శాంతి స్వరూప లేకపోవడం, నర్సుల నిర్లక్ష్యాన్ని ఉన్నతాధికారులు గుర్తించారు. దీంతో డాక్టర్ శాంతి స్వరూపతో పాటు నర్సులు విజయలక్ష్మి, సైదమ్మ, మౌనిక, సరితలను సస్పెండ్ చేయాలని డీసీహెచ్ఎస్‌కు అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం సందర్శించిన అదనపు కలెక్టర్.. దేవరకొండ, నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో జరిగిన ఘటనలపై కలెక్టర్‌కు ప్రాథమిక నివేదికలు సమర్పించారు.

రీల్స్ కోసం స్టంట్లు చేస్తే కఠిన చర్యలు: డీజీపీ

» రోడ్డుపై కరెన్సీ నోట్లు వెదజల్లిన యువకుడిపై కేసు

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొందేందుకు రహదారులపై ఇష్టమొచ్చినట్టు స్టంట్లు చేసే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ జితేందర్ హెచ్చరించారు. రీల్స్ మోజులో పడి కుటుంబాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రజలను ఇబ్బంది పెట్టే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కోసం కొందరు చేసిన స్టంట్లకు సంబంధించిన ఫొటోలను జత చేస్తూ ఎక్స్ వేదికగా డీజీపీ ఈ సూచనలు చేశారు. కాగా, హైదరాబాద్ రహదారులపై కరెన్సీ నోట్లు వెదజల్లుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అంబేడ్కర్ వర్సిటీ ప్రవేశాలకు నోటిఫికేషన్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలయ్యింది. 2024-25 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు పొందడానికి ఆగస్టు 31 చివరి తేదీ అని విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి ప్రొ సుధారాణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సమాచారం కోసం 7382929570/ 580, 040-23680222/ 333/444/555, 18005 990101 నంబరులను సంప్రదించవచ్చని సూచించారు. www. braouonline.in /www.braou.ac.inలోనూ సంప్రదించాలని వివరించారు.

'బాల పురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన బాలబాలికలకు ఇచ్చే ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2025 అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ విషయాన్ని హైదరాబాద్ స్త్రీ, శిశు సంక్షేమాధికారి అక్కేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ధైర్య సాహసాలు, క్రీడలు, పర్యావరణం, కళలు, సైన్స్ అండ్ టెక్నాలజీ లాంటి సేవా రంగాల్లో ప్రావీణ్యం కలిగి 5 నుంచి 18 ఏళ్లలోపు బాల బాలికలు అర్హులని చెప్పారు. http-s://awards.gov.in వెబ్‌సైట్‌లో ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హోంగార్డు కుటుంబానికి 15 లక్షల ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో అనారోగ్యం పాలై మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా సొమ్మును విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సి.సుదర్శన్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో హోంగార్డు పని చేస్తున్న పి.అనంతయ్య 2023 సంవత్సరం నవంబరులో జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల కోసం డిప్యూటేషన్‌పై వెళ్లారు. సంగఖేడా పోలింగ్ బూత్‌లో విధులు నిర్వహిస్తూ జబ్బుపడ్డారు. అనంతరం నవంబరు 28న మృతి చెందారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రూ. 15 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలంటూ రాష్ట్ర హోంశాఖ ప్రతిపాదనలు పంపడంతో ప్రభుత్వం ఈ సొమ్మును విడుదల చేసింది.

విద్యార్థినికి వేధింపులు.. టీచర్‌పై పోక్సో కేసు

» విధుల నుంచి సస్పెన్షన్.. కొత్తగూడెంలో ఘటన

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు 23: విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఓ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైంది. కొత్తగూడెంలోని ఓ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని శుక్రవారం బడికి వెళ్లేందుకు నిరాకరించింది. బోరున విలపిస్తూ జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వేణు వారం రోజులుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని ఇష్టమొచ్చినట్లు గిచ్చుతూ, గిల్లుతూ ఇతర శరీర భాగాలను తాకుతున్నాడని వాపోయింది. దీంతో ఆగ్రహించిన కుటుంబసభ్యులు బడికి వెళ్లి ఆందోళన చేపట్టారు. జరిగిన సంఘటన గురించి ప్రధానోపాధ్యాయురాలు సాయిసుజాతకు తెలిపారు. సదరు ఉపాధ్యాయున్ని తమకు అప్పగించాలని ఆందోళన చేశారు. దీంతో పాఠశాల సిబ్బంది కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థిని ఫిర్యాదు మేరకు తెలుగు ఉపాధ్యాయుడు వేణును పోలీసులు అరెస్టు చేశారు. వేణుపై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు వేణును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కోవర్టుగా మారినందునే రాధకు మరణ శిక్ష

» పోలీసులదే బాధ్యత.. మావోయిస్టు పార్టీ లేఖ

పినపాక, ఆగస్టు 23: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెన్నంపేటలో బంటి రాధ అలియాస్ నీల్సోకు మావోయిస్టులు విధించిన భౌతిక శిక్షపై(మరణ శిక్ష) పోలీసులు దుష్ప్రచారం చేస్తున్నారని సీపీఐ మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ శుక్రవారం ఓ లేఖ విడుదల చేశారు. విప్లవ ద్రోహిగా మారినందునే రాధను శిక్షించాల్సి వచ్చిందని, రాధ మరణానికి పోలీసులే ప్రధాన కారణమని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో పోలీసులు కోవర్టుల సాయంతో ఉద్యమాన్ని అణగదొక్కుతున్నారని ఆరోపించారు. విప్లవ ఉద్యమంలో చురుగ్గా ఉండే వారి కుటుంబాల ఆర్థిక, మానసిక బలహీనతలే ఆసరాగా పోలీసులు చేస్తున్న కోవర్టు ఆపరేషన్లకు అమాయకులు బలవుతున్నారని, రాధనే అందుకు ఉదాహరణ అని చెప్పారు.

కొడుకు మృతితో ఆగిన సవతి తల్లి గుండె

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 23 : తాను కన్నతల్లి కాకపోయినా పెంచి పెద్ద చేసిన కుమారుడి మరణాన్ని సవతి తల్లి జీర్ణించుకోలేకపోయింది. కుమారుడి మృతదేహం వద్ద ఏడుస్తూ గుండెపోటుకు గురై తుది శ్వాస విడిచింది. ఈ విషాదకర ఘటన మహబూబాబాద్ శివారు శనిగపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. రైల్వే ట్రాక్‌మెన్‌గా పనిచేసే శనిగపురానికి చెందిన మంద వెంకన్న.. భార్య స్వరూప 30 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మరణించింది. అప్పటికే ఆ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. మొదటి భార్య మరణించడంతో చిన్న గూడూరు మండలం జయ్యారానికి చెందిన జ్యోతి (50)ని వెంకన్న రెండో వివాహం చేసుకున్నాడు. జ్యోతి, వెంకన్నకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్వరూప మొత్తం ఐదుగురు పిల్లలను ఒకేలా సాకింది. పిల్లలందరికీ పెళ్లిళ్లు కూడా జరిగాయి. వెంకన్న గత ఏడాది మరణించగా జ్యోతి ఖమ్మంలో తన కూతురు వద్ద ఉంటోంది. మరోపక్క, వెంకన్న మొదటి భార్య కుమారుడు రవి (32) శనిగపురంలో ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే రవి మద్యానికి బానిసై భార్యను వేధించేవాడు. దీంతో భర్తను వదిలేసిన స్వప్న నాలుగునెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పట్నించి మానసికంగా కుంగిపోయిన రవి అనారోగ్యానికి గురై గురువారం మరణించాడు. ఈ విషయం తెలిసి ఖమ్మం నుంచి శనిగపురానికి వచ్చిన సవతి తల్లి జ్యోతి.. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయింది. మృతదేహంపై పడి గుండెలవిసేలా ఏడుస్తుండగా గుండెపోటుకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబసభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించగా ఆమె అప్పటికే మరణించిందని వైద్యులు వెల్లడించారు.



అదనపు కలెక్టర్.. బాల్య జ్ఞాపకం!

ఆదిలాబాద్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ శ్యామల శుక్రవారం తనిఖీ చేశారు. గతంలో ఇదే పాఠశాలలో చదివిన ఆమె అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అక్కడే టీచర్‌గా ఉన్న తన క్లాస్‌మేట్ ప్రతిమను ఆత్మీయంగా పలకరించారు. అప్పట్లో వారు కూర్చున్న రెండో బెంచీలోనే ఆసీనులయ్యారు.

- ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్

దేవుడి ముందు దర్పం!

25 కిలోల బంగారు ఆభరణాలతో శ్రీవారి దర్శనానికి

తిరుమల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): భగవంతుని దర్శనానికి ఎంత ప్రముఖులైనా సామాన్య భక్తుల్లా వెళ్లడం ఆనవాయితీ. అన్యథా శరణం నాస్తి అంటూ వేడుకోవడం పరిపాటి. అయితే కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి దర్శనానికి ఓ కుటుంబం మెడ, చేతులు, వేళ్ల నిండా బంగారు గొలుసులు, చైన్లు, కవచాలు, ఉంగరాలు ధరించి ఆడంబరంగా వచ్చింది. పుణెకు చెందిన సన్నీ నానాసాహెబ్ వాఘ్‌చౌరే, సంజయ్ దత్తత్రేయ గుజర్, ప్రీతి సోనీ సుమారు 25 కిలోల బంగారు ఆభరణాలను ధరించి, స్టైలిష్ కళ్లజోళ్లు పెట్టుకుని శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. దాదాపు రూ.15 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు ధరించిన వీరి కుటుంబానికి రక్షణగా 15 మంది సెక్యూరిటీ సిబ్బంది వచ్చారు. వీరు ప్రయాణించిన కారు కూడా బంగారు రంగులోనే ఉంటడం విశేషం.



తిరుమల ఆలయం ముందు నానాసాహెబ్ కుటుంబసభ్యులు

రెం(డ్రూపాయలే..!

రుణ మాఫీలో ఖమ్మం జిల్లా రైతుకు వింత అనుభవం

చింతకాని, ఆగస్టు 23: రుణ మాఫీ జాబితాలో తన పేరు ఉండడంతో ఆ రైతు ఉప్పొంగిపోయాడు. కానీ, ఆ సంతోషం ఆయనకు ఎంతో సేపు లేదు. అక్షరాలా రూ.2 మాత్రమే మాఫీ అయిందంటూ తన ఫోన్‌కు వచ్చిన మెస్సేజ్‌ను చూసి ఆ రైతు అవాక్కయ్యాడు. తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించడమే అతడికి శాపంగా మారింది. ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని నాగులవంచకు చెందిన రైతు అంబటి రాజేష్ గ్రామంలోని సొసైటీ ద్వారా 2022లో రూ.1.10లక్షల అప్పు తీసుకున్నాడు. ఏడాది తర్వాత 2023 అక్టోబరులో ఆ రుణాన్ని వడ్డీతో సహా చెల్లించాడు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రుణమాఫీ అమలు ప్రకటన చేయగానే.. తాను కట్టిన డబ్బులు తిరిగి వెనక్కి వస్తాయని ఆ రైతు సంబరపడ్డాడు. చివరికి రుణమాఫీ జాబితాలో తన పేరు ఉండడంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు. కానీ, ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం 2023 డిసెంబరు 9 నాటికి అప్పు ఉన్న రైతుకు మాత్రమే రుణమాఫీ వర్తింపజేశారు. రాజేష్ రుణ ఖాతాలో రూ.2 అప్పుగా చూపించడంతో.. ఆ మేరకు మాఫీ చేస్తున్నట్లు అతడి ఫోన్‌కు సమాచారం అందింది. "రుణమాఫీ జాబితాలో నా పేరు చూసుకుని ఎంతో సంబరపడ్డా. ఆ ఆనందం క్షణాల్లోనే ఆవిరైంది"అని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు.



రైతు సంక్షేమానికి, వికాసానికి కట్టుబడి ఉన్న ప్రజా ప్రభుత్వం. "రైతు ఋణ మాఫీ - 2024" క్రింద శ్రీ Ambati Rajes గారు,రూ2/- బ్యాంక్ ఖాతా నంబర్ XXXXXX0002 DCCB CHINTHAKANI బ్రాంచ్ యందు తేది 30.07.2024 న జమ చేయబడినది. వివరాలకు మీ బ్యాంక్ అధికారిని/మండల వ్యవసాయ అధికారిని సంప్రదించగలరు. మీ ఈ ఆనందంలో పాలుపంచుకోవడం నాకెంతో సంతోషంగా ఉంది.

మీ ముఖ్యమంత్రి
శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి.

రాజేష్ సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్

ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి పేరిట

1.29 కోట్ల వసూళ్లు

డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు, ప్రభుత్వ ఉద్యోగులకు టోకరా.. ఆరుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి పేరిట ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగార్థులు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు టోకరా వేసి రూ.1.29 కోట్ల మేర కాజేసిన ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ముఠా నాయకుడు అనుగు సురేందర్ రెడ్డి (34)తోపాటు మెరీనా రోస్ (52) బొలుగుల అంజయ్య (34), బండ వెంకటేష్ (55), కర్తావత్ గోపాల్ నాయక్ (48), అనుగు హర్షిణి రెడ్డి (33) అనే ఆరుగురు నిందితులను మల్కాజిగిరి ఎస్ఓటీ, కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. వేం నరేందర్ రెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు ఈ ముఠా సభ్యులు సుమారు 107 మందిని మోసం చేసి రూ.1.29 కోట్లు వసూళ్లు చేసినట్టు గుర్తించారు. నిందితుల వద్ద డబుల్ బెడ్‌రూం ఇళ్ల నకిలీ అలాట్‌మెంట్ లెటర్లు, కీసర ఆర్డీవో స్టాంపులు, 8 మొబైల్ ఫోన్లు, రూ. 1.97 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సీపీ సుధీర్‌బాబు శుక్రవారం విలేకరులకు వెల్లడించారు.

కుషాయిగూడకి చెందిన అనుగు సురేందర్ రెడ్డి ఇంటర్మీడియట్ ఫెయిలై.. కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకంలో క్యాటరింగ్ చేసేవాడు. అయితే, తాను మధ్యాహ్న భోజన కాంట్రాక్టర్‌ని చెప్పుకుంటూ పలువురు అధికారులను కలిసేవాడు. అధికారులు అతడి మాటలు నమ్మడంతో మోసాలకు పథక రచన చేశాడు. ఇందు కోసం మెరీనా రోస్, అంజయ్య, బండ వెంకటేష్, గోపాల్ నాయక్, అనుగు హర్షిణి రెడ్డితో ఓ ముఠా ఏర్పాటు చేసుకున్నాడు. పథకం ప్రకారం సోషల్ వెల్ఫేర్ పాఠశాలల ప్రిన్సిపాళ్లకు ఫోన్లు చేసి తాను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని అంటూ మాట్లాడేవాడు. తాను పంపించిన వారికి కాంట్రాక్టు అధ్యాపకులుగా ఉద్యోగాలివ్వాలని ఆదేశించేవాడు. అతని మాటలు నమ్మిన ప్రిన్సిపాళ్లు ఉద్యోగాలు ఇచ్చేవారు. ఆయా పాఠశాలల్లో చేరిన ముఠా సభ్యులు తమకు వేం నరేందర్ రెడ్డితో మంచి పరిచయాలున్నాయని, కావాల్సిన చోటుకి బదిలీలు చేయిస్తామని ఇతర ఉద్యోగులను నమ్మించి డబ్బు వసూలు చేశారు. ఇలా సోషల్ వెల్ఫేర్ పాఠశాలలకు చెందిన ఏడుగురు ఉద్యోగుల నుంచి రూ.7లక్షల వసూలు చేశారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుధీర్ రెడ్డి

'డబుల్' లబ్ధిదారులకు టోపీ

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డితో తమకు పరిచయం ఉందని అడిగినంత డబ్బు ఇస్తే డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పిస్తామని చెప్పి ఈ ముఠా సభ్యులు కీసర, చర్లపల్లి ప్రాంతాలకు చెందిన దాదాపు వంద మందికి టోకరా వేశారు. వారి నుంచి అందినకాడికి డబ్బు తీసుకుని నకిలీ అలాటిమెంట్ లెటర్లు ఇచ్చేవారు. కొందరి వద్ద అత్యధికంగా రూ.3.50 లక్షల దాకా వసూలు చేసేవారు. డబ్బు కట్టిన వారికి నమ్మకం కలిగించేందుకు ముఠాకు చెందిన హర్షిణి రెడ్డి కీసర ఆర్డీవోనంటూ లబ్ధిదారులకు ఫోన్లు చేసి మాట్లాడేది. ఇల్లు కోసం అడిగితే ఎన్నికల కోడ్ అని ఏవో కుంటిసాకులు చెప్పి కాలయాపన చేసేది. అలాగే, ఎఫ్‌సీఐలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మరో ఇద్దరి నుంచి డబ్బు వసూలు చేశారు. అయితే, తమని నమ్మిన వారికి అనుమానం కలుగకుండా తన దూరపు చుట్టం ఖాతా అని చెప్పి మెరీనా రోజ్ పేరిట ఉన్న బ్యాంక్ ఖాతాలో డబ్బు జమ చేయించేవాడు. తన ఖాతాలో జమైన డబ్బులో కొంత మొత్తాన్ని కమీషన్‌గా ఉంచుకుని మెరీనా మిగిలిన డబ్బును సురేందర్‌కు ఇచ్చేది. ఇక, తమకు ఉద్యోగాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు వచ్చాయంటూ అంజయ్య, వెంకటేష్, గోపాల్ నాయక్ ప్రచారం చేసుకుని అమాయకులని నమ్మించి వసూళ్లకు పాల్పడేవారు. కాగా, మోసాలు చేసిన సంపాదించిన డబ్బును సురేందర్ రెడ్డి విలాసాలు చేసేవాడని, రూ.కోటి వరకు బెట్టింగ్‌కు ఖర్చు చేశాడని పోలీసులు గుర్తించారు.

రుణమాఫీపై చర్చకు సీఎం రావడం లేదు

» ప్రజలకు సమాధానం చెప్పలేని దద్దమ్మ రేవంత్: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి)/ వంగూరు: 'రుణమాఫీపై చర్చించేందుకు రమ్మంటే సీఎం రేవంత్‌రెడ్డి రావడం లేదు. ఆయన భాషలో చెప్పాలంటే.. మగాడివైతే పల్లెల్లోకి రా.. పోలీస్ భద్రత లేకుండా వస్తే అసలు విషయం తెలుస్తుంది. ప్రజల్లోకి పోయి సమాధానం చెప్పలేని దద్దమ్మ సీఎం రేవంత్' అని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులపై కాంగ్రెస్ శ్రేణుల దాడులు, యూట్యూబర్లపై దాడులు జరుగుతున్నాయని, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం కేటీఆర్ డీజీపీ కార్యాలయంలో డీజీపీ జితేందర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేష్ తదితరులున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సహనాన్ని చేతగానితనం అనుకోవద్దని.. ఒకవేళ తాము ప్రతిఘటిస్తే నిందించవద్దని హెచ్చరించారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో తిరుమలగిరిలో రైతు నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టగా.. 50 మంది కాంగ్రెస్ గూండాలు రాళ్లు, గుడ్లు, సుతిలి బాంబులతో దాడి చేశారని ఆరోపించారు. రుణమాఫీ అయ్యిందా? లేదా అని తెలుసుకోవటానికి సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లికి వెళ్లిన ఇద్దరు మహిళా యూట్యూబర్లపై కాంగ్రెస్ గుండాలు దాడి చేశారన్నారు. ఆ ఆడబిడ్డలు ఏం తప్పు చేశారని.. వారికి సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న అన్ని నిర్మాణాలు కూల్చాలన్నారు. కాంగ్రెస్ నేతలు పొంగులేటి, వివేక్, కేవీపీ, మధుయాష్కీ వంటి నేతల భవనాలను కూల్చేశాక సామాన్యుల భవనాలను కూల్చేయాలన్నారు. కాగా, మహిళా యూట్యూబర్లపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి టీయూడబ్ల్యూజే నేతలు కూడా ఫిర్యాదు చేశారు.

కొండారెడ్డిపల్లి ఘటనపై కేసులు నమోదు

కొండారెడ్డిపల్లిలో ఇద్దరు మహిళా యూట్యూబర్లను అడ్డుకున్న ఘటనలో శుక్రవారం ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు కృష్ణ, వంశీ, అనిల్, చందు, మల్లేపాకుల శేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తల ఫిర్యాదు మేరకు యూట్యూబర్ విజయారెడ్డితో పాటు మరో నలుగురిపై కౌంటర్ కేసులు నమోదు చేశామన్నారు. కాగా, మహిళా యూట్యూబర్లపై దాడి వివరాలు అందజేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద పోలీసులను ఆదేశించారు. ఈమేరకు నాగర్‌కర్నూలు ఎస్పీకి లేఖ రాశారు.

కులం టార్గెట్ కాకపోతే

అట్రాసిటీ చట్టం వర్తించదు

» బాధితుడు ఎస్సీ అనే ఏకైక కారణంతో చట్టాన్ని ప్రయోగించలేరు

» కేరళ యూట్యూబర్ కేసులో సుప్రీం కోర్టు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఆగస్టు 23: ఎస్సీ, ఎస్టీ వ్యక్తులకు జరిగిన ప్రతీ అవమానం, బెదిరింపు వ్యాఖ్యలు ఆ వర్గాలపై అఘాయిత్యాల నిరోధక చట్టం కిందకు రాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ పీబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఒక కేసులో ఈ చట్టానికి సంబంధించి వ్యాఖ్యానం చేసింది. మరునాదన్ మలయాళీ యూట్యూబ్ చానెల్ ఎడిటర్ షాజన్ షకీరాపై ఇదే చట్టం కింద నమోదైన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేసింది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కేరళ ఎమ్మెల్యే పీవీ శ్రీనిజన్‌ను అవమానించే విధంగా వ్యాఖ్యానాలు చేస్తూ వీడియోను అప్‌లోడ్ చేశారన్నది షాజన్ షకీరా మీద అభియోగం. బాధితుడు ఎస్సీ లేదా ఎస్టీ అన్న ఒకే ఒక కారణంతో అవమానించిన వాడి మీద సదరు చట్టం వాడటం కుదరదని జస్టిస్ పార్థీవాలా స్పష్టం చేశారు. బాధితుడు ఎస్సీ లేదా ఎస్టీ అన్న కారణంతోనే ఉద్దేశపూర్వకంగా అవమానం లేదా బెదిరింపునకు పాల్పడినపుడే ఆ చట్టం వర్తిస్తుందని తెలిపారు. అంటే, బాధితుడు ఎస్సీ లేదా ఎస్టీ అనే ఒకే ఒక కారణంతో అవమానించి లేదా బెదిరించి ఉంటేనే ఈ చట్టం వర్తిస్తుందని విశదీకరించారు. కేరళ ఎమ్మెల్యే విషయంలో యూట్యూబర్ అలా చేసినట్లు అతని వ్యాఖ్యల్లో కానీ, కథనంలో కానీ ఎక్కడా కనిపించలేదని అన్నారు. ఎమ్మెల్యే ఎస్సీ లేదా ఎస్టీ కాకపోతే యూట్యూబర్ ఆ ఆరోపణలు చేసేవాడా? కాదా? అన్న ప్రశ్న వేసుకుంటే ఈ చట్టం కిందకు వస్తుందా? రాదా? అన్న ప్రశ్నకు సమాధానం దొరుకుతుందని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే ఎస్సీ అని యూట్యూబర్‌కు ముందే తెలుసన్న ఏకైక కారణంతో అతనిపై చట్టాన్ని ప్రయోగించలేరని జస్టిస్ పార్థీవాలా అన్నారు. కచ్చితంగా బాధితుడి కులాన్ని దృష్టిలో పెట్టుకొని అవమానం చేసినపుడే చట్టం వర్తిస్తుందని చెప్పారు. ఆ వీడియోలో ఎస్సీ, ఎస్టీలను ఉద్దేశించి ఎలాంటి వ్యాఖ్యలు లేవని గుర్తు చేశారు.

వైద్యవిద్యలో కొత్త పీజీ కోర్సులు

» మార్గదర్శకాలు విడుదల చేసిన ఎన్ఎంసీ

» ఆస్పత్రుల్లో ఏడాదంతా 80 శాతం బెడ్ ఆక్యుపెన్సీ తప్పనిసరి

హైదరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్యలో కొత్తగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు ప్రారంభించేందుకు అవసరమైన మార్గదర్శకాలను జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) శుక్రవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా "మినిమమ్ స్టాండర్డ్ రిక్వైర్‌మెంట్ ఫర్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సెస్-2024" విధివిధానాలను తన అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ఈ మార్గదర్శకాలను పీజీ వైద్యవిద్య బోర్డు ఖరారు చేసిందని పేర్కొంది. పీజీ కోర్సులను ప్రారంభించాలనుకునే వైద్య సంస్థలు, మెడికల్ కాలేజీలు తప్పనిసరిగా సంబంధిత సంస్థలు, అధికారుల నుంచి అవసరమైన అన్నిరకాల అనుమతులు పొంది ఉండాలని ఎన్ఎంసీ వెల్లడించింది. అలాగే రేడియో డయాగ్నసిస్, అనస్థీషియా, పాథాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ అధ్యాపకుల సంఖ్యను పెంచాలని సూచించింది. అలాగే పీజీ విద్యార్థులకు అవసరమైన వైద్య యంత్రపరికరాలను అందుబాటులో ఉంచాలని పేర్కొంది. ముఖ్యంగా ఆస్పత్రిలో ఏడాదంతా 80% పడకలు రోగులతో నిండి ఉండటం తప్పనిసరి అని తెలిపింది. అలాగే అభా ఐడీ ఓపీ, ఐపీ, ప్రసవాలు, సర్జరీలు, రోగుల అడ్మిషన్లు, డిశ్చార్జిలకు సంబంధించి డిజిటల్ డేటా తప్పకుండా ఉండాలని స్పష్టం చేసింది. నిబంధనల మేరకు అధ్యాపకుల నియామకం ఉండాలని, విధుల సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటు ప్రాక్టీస్ చేయరాదని, 75% అధ్యాపకుల హాజరు తప్పకుండా ఉండాలని పేర్కొంది. సీసీ కెమెరాలను తప్పకుండా ఏర్పాటు చేయాలని, ప్రతీ కళాశాల విధిగా కాలేజీ వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. పీజీ కోర్సులు ప్రారంభించాలంటే విధిగా ఆస్పత్రిలో 220 పడకలు ఉండాలని తెలిపింది. అంతేకాకుండా బయోకెమిస్ట్రీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, రేడియో డయాగ్నసిస్, అనస్థీషియా విభాగాలు తప్పనిసరి అని స్పష్టం చేసింది. అలాగే ప్రభుత్వేతర వైద్య కాలేజీలు, సంస్థలకు ఒక్కో విభాగానికి కేవలం నాలుగు సీట్ల వరకే అనుమతినిస్తామని పేర్కొంది. అలాగే హెచ్‌వోడీలు, అందులో ఉండే ప్రొఫెసర్ల సంఖ్య ఆధారంగా సీట్ల సంఖ్య ఉంటుందని ఎన్ఎంసీ పేర్కొంది.

మహారాష్ట్ర జైళ్లలో కులానికి ప్రాధాన్యం!

» కులాన్ని బట్టి ఖైదీలకు సౌకర్యాలు

» తల్లి శవాన్ని చూడడానికీ పెరోలివ్వలేదు

» 'మీట్ ది ప్రెస్'లో ప్రొఫెసర్ సాయిబాబ

బర్కత్‌పుర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర జైళ్లు కులానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్, హక్కుల కార్యకర్త జీఎన్ సాయిబాబ సంచలన వ్యాఖ్యలు చేశారు. జైలుకు వచ్చే ఖైదీలకు కులాన్ని బట్టి సౌకర్యాలు కల్పిస్తారన్నారు. కొత్తగా జైలుకు వచ్చిన వారిని సీసీ కెమెరాలు లేని ప్రాంతాల్లో చిత్రహింసలకు గురిచేస్తారని.. దాంతో ఆ ఖైదీలకు జైలు అంటే భయం ఏర్పడుతుందని తెలిపారు. రాజ్యాంగ వ్యతిరేక శక్తులుగా ముద్ర వేసిన వారికి మహారాష్ట్ర జైళ్లలో చిత్రహింసలు తప్పవని, జైలు మేనిఫెస్టోలోనే ఈ విషయాలు ఉన్నాయని సాయిబాబ ఆరోపించారు. గ్యాంగ్‌స్టర్లకు సైతం బెయిల్ దొరుకుతుంది కానీ, హక్కుల కార్యకర్తకు మాత్రం బెయిలు, పెరోల్ దొరకవని అన్నారు. కన్నతల్లి చనిపోతే శవాన్ని చూడడానికీ పెరోల్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మావోయిస్టుగా ముద్ర వేసి పదేళ్లపాటు నాగ్‌పూర్ జైల్లో ఉండి, ఇటీవలే విడుదలైన సాయిబాబతో టీయూడబ్ల్యూజే బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'మీట్ ది ప్రెస్' నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సాయిబాబ.. గడ్చిరోలి పోలీసులు వ్యవహరించిన తీరు, జైళ్లలో పరిస్థితులపై సంచలన ఆరోపణలు చేశారు. ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టడం వల్లనే తనను అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టారన్నారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అంటే.. ఉక్కు కౌగిలి నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించడమేనని అన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. ఉపా చట్టం ఎంత దుర్మార్గమైందో ప్రొఫెసర్ సాయిబాబ జైలు జీవితమే సాక్ష్యమన్నారు. ఉపా చట్టం రద్దు కోసం బలమైన ఉద్యమం రావాలని కోరారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సాయిబాబ

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శనివారం 24 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.co

నిమ్స్‌లో మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ



హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)- మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ(ఎంపీటీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో మస్క్యులోస్కెలెటల్ సైన్సెస్, కార్డియోవాస్క్యులర్ అండ్ పల్మనరీ సైన్సెస్, న్యూరో సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో అయిదు చొప్పున మొత్తం 15 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.


అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఇన్ ఫిజియోథెరపీ(బీపీటీ) ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 31 నాటికి ఆరు నెలల ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి. ఏ ఇతర కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండకూడదు. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 22 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. నిమ్స్ ఉద్యోగులకు వయోపరిమితి నిబంధనలు వర్తించవు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థి ఎంచుకొన్న స్పెషలైజేషన్‌కు సంబంధించి బేసిక్ అండ్ క్లినికల్ సైన్సెస్, బయోమెకానిక్స్, ఫిజియోథెరపీ టెక్నిక్స్, క్రిటికల్ కేర్, రీహాబిలిటేషన్ అంశాల నుంచి 30 ప్రశ్నలు; జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్, గైనకాలజీ, ఎలక్ట్రోథెరపీ, ఎక్సర్‌సైజ్ థెరపీ, ఫస్ట్ ఎయిడ్, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్, రేడియాలజీ, సోషియాలజీ, సైకాలజీ వంటి జనరల్ క్లినికల్ సైన్సెస్ అంశాల నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ బీపీటీ సిలబస్ ప్రకారం ఉంటాయి. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 60. పరీక్ష సమయం గంట. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను కౌన్సెలింగ్‌కు పిలుస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్ డౌన్‌లోడింగ్:** సెప్టెంబరు 26 నుంచి
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** అక్టోబరు 4
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 7
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** అక్టోబరు 11
- **కౌన్సెలింగ్ లెటర్స్ విడుదల:** అక్టోబరు 15
- **కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 22
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 28 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్- 500082
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

పీ హెచ్‌డీ



జేఎన్‌టీయూ అనంతపురంలో

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్‌లు, రీసెర్చ్ ప్రొఫెషనల్స్, పబ్లిక్ రిప్రజెంటేటివ్‌లు దరఖాస్తు చేసుకోవచ్చు.

రీసెర్చ్ విభాగాలు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫుడ్ టెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, ఫార్మసీ

రీసెర్చ్ సెంటర్లు
- జేఎన్‌టీయూఏ అనుబంధ కళాశాలలు
- కేఎస్‌ఆర్‌ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ - వైఎస్సార్ జిల్లా
- శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ - తిరుపతి
- జీ. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్-కర్నూలు
- రాజీవ్‌గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ - నంద్యాల
- శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ - చిత్తూరు
- శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ - చిత్తూరు
- వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - చిత్తూరు
- శాంతిరామ్ ఇంజనీరింగ్ కాలేజ్ - నంద్యాల
- రాఘవేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ - అనంతపురం
- శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫార్మసీ - చిత్తూరు
- సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ - తిరుపతి
- శ్రీ పద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ - తిరుపతి

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు; ప్రైవేట్ ఇండస్ట్రీల్లో ఎగ్జిక్యూటివ్ కేడర్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.5,000
- **స్పీడ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూఏ, అనంతపురం-515002
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్‌లో

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్ఏఎఫ్ఏయూ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: ఆర్కిటెక్చర్ 5, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్ 2, పెయింటింగ్ 2

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/గేట్/సీడ్ అర్హత ఉన్నవారికి ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. వీరు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

రిటెన్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. రీసెర్చ్ ఆప్టిట్యూడ్ నుంచి 75, నాలెడ్జ్ ఆఫ్ సబ్జెక్ట్ స్పెషలైజేషన్ నుంచి 75 చొప్పున మొత్తం 150 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు వచ్చిన వారిని మాత్రమే ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **కొరియర్/రిజిస్టర్డ్ పోస్ట్/వ్యక్తిగతంగా దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 19
- **చిరునామా:** డైరెక్టర్, అడ్మిషన్స్, జేఎన్ఏఎఫ్ఏ యూనివర్సిటీ, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్ - 500028
- **వెబ్‌సైట్:** www.jnafau.ac.in

జయశంకర్ వర్సిటీలో డిగ్రీ కౌన్సెలింగ్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- ఎంపీసీ స్ట్రీమ్ కింద నిర్వహిస్తున్న బీటెక్ ప్రోగ్రామ్‌లలో ఫార్మర్స్ కోటా సీట్లు; బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో నాన్ రూరల్ అండ్ రూరల్ కోటా సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్(ఫార్మర్స్ కోటా), సెల్ఫ్ ఫైనాన్సింగ్ కేటగిరీల్లో సీట్లు ఉన్నాయి. గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్): సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో మొత్తం 29 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫార్మర్స్ కోటా కింద 20 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 9 సీట్లను నిర్దేశించారు.

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ): నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మొత్తం 15 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫార్మర్స్ కోటా కింద 10 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 5 సీట్లను నిర్దేశించారు.

బీఎస్సీ ఆనర్స్(కమ్యూనిటీ సైన్స్): హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో మొత్తం 42 సీట్లు ఉన్నాయి. వీటిలో 37 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. మూడేళ్ల డిప్లొమా(హోమ్ సైన్స్) అభ్యర్థుల కోసం అదనంగా 8 రెగ్యులర్ సీట్లు కేటాయించారు.

అర్హతలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 28న ఉదయం పది గంటలకు
- **వేదిక:** ఎగ్జామినేషన్ సెంటర్, వాటర్ టెక్నాలజీ సెంటర్ ఎదురుగా, పీజేటీఎస్ఏయూ, రాజేంద్రనగర్, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

జాబ్ కార్నర్

ఏపీలో సీనియర్ రెసిడెంట్, సూపర్ స్పెషాలిటీ పోస్టులు

ఖాళీలు 997

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్... ఏపీ డీఎంఈ పరిధిలోని ప్రభుత్వ వైద్య, దంత వైద్య కళాశాలల్లోని వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

1. సీనియర్ రెసిడెంట్(క్లినికల్): **425 పోస్టులు**
2. సీనియర్ రెసిడెంట్(నాన్ క్లినికల్): **479 పోస్టులు**
3. సూపర్ స్పెషాలిటీ: **93 పోస్టులు**

స్పెషాలిటీలు: జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, అనస్తీషియా, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, రెస్పిరేటరీ మెడిసిన్, సైకియాట్రీ, రేడియో డయాగ్నోసిస్/రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, డెంటిస్ట్రీ/డెంటల్ సర్జరీ, రేడియోథెరపీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, న్యూక్లియర్ మెడిసిన్, అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రో బయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, కార్డియాలజీ, ఎండోక్రైనాలజీ, మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, న్యూరాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ/సీవీటీ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, యూరాలజీ, న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ, నియోనాటాలజీ.

అర్హత: మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ(ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ/ఎండీఎస్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 44 ఏళ్లు మించకూడదు

జీతభత్యాలు: నెలకు రూ.70,000 ఉంటుంది.

పదవీకాలం: ఎంపికైన అభ్యర్థులు ఏడాది పని చేయాల్సి ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: పోస్టు గ్రాడ్యుయేషన్ ఎగ్జామ్ మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: ఓసీ అభ్యర్థులు రూ.1000. బీసీ, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 27

వెబ్‌సైట్: dme.ap.nic.in/

నార్త్ రైల్వేలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 4096



న్యూఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)- నార్త్ రైల్వే... ఎన్ఆర్ పరిధిలోని డివిజన్/వర్క్‌షాప్/యూనిట్లలో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఆర్ఆర్‌సీ వర్క్‌షాప్‌లు: క్లస్టర్ లఖ్‌నవూ, క్లస్టర్ అంబాలా, క్లస్టర్ మొరాదాబాద్, క్లస్టర్ ఢిల్లీ, క్లస్టర్ ఫిరోజ్‌పూర్.

అర్హత: పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ట్రేడ్‌లు: మెకానికల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కార్పెంటర్, ఎంఎంవీ, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, ట్రిమ్మర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హామర్‌మన్, టర్నర్, క్రేన్ ఆపరేటర్, స్టెనోగ్రాఫర్ తదితరాలు.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 16 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: సెప్టెంబరు 16

వెబ్‌సైట్: http://https//www.rrcnr.org/

బెల్‌లో హవల్దార్ ఖాళీలు

ఖాళీలు 15

బెంగళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ- భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్)... శాశ్వత ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణత, నిర్దిష్ట శారీరక ప్రమాణాలతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 43 ఏళ్లు మించకూడదు. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, నిర్దిష్ట శారీరక ప్రమాణాలు తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డీజీఎం(హెచ్‌ఆర్), బెల్, జలహళ్లి, బెంగళూరు చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 3

వెబ్‌సైట్: https://bel-india.in/

ఎన్‌సీసీఆర్‌లో ప్రాజెక్ట్ సైంటిస్టులు



చెన్నైలోని నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్(ఎన్‌సీసీఆర్)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ప్రాజెక్టు సైంటిస్ట్-1/2/3: **31 పోస్టులు**
2. జూనియర్ రీసెర్చ్ ఫెలో: **10 పోస్టులు**
3. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: **1 పోస్టు**

విభాగాలు: మెరైన్ బయాలజీ, రిమోట్ సెన్సింగ్ జీఐఎస్, డేటా బేస్, కంప్యూటర్ సైన్స్, కోస్టల్ హజార్డ్ మ్యాపింగ్ అండ్ మాడ్యులింగ్, కోస్టల్ డైనమిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెరైన్ స్ట్రక్చర్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, బీఈ/బీటెక్, పీజీ, పీహెచ్‌డీ, గేట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు ప్రాజెక్ట్ సైంటిస్ట్-3 పోస్టుకు రూ. 78,000; ప్రాజెక్ట్ సైంటిస్ట్-2 పోస్టుకు రూ.67,000; ప్రాజెక్ట్ సైంటిస్ట్-1 పోస్టుకు రూ.56,000; జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు రూ.42,000; సీనియర్ టెక్నికల్ పోస్టుకు రూ.35,400.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష/ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ఎన్‌సీసీఆర్, ఎన్ఐఓటీ క్యాంపస్, రెండో అంతస్తు, వెలచ్చేరి- తాంబరం మెయిన్ రోడ్, పల్లికరణై, చెన్నై చిరునామాకు పంపించాలి.

చివరి తేదీ: సెప్టెంబరు 6

వెబ్‌సైట్: https://www.nccr.gov.in/


చిట్టి

చిలుక దివ్యదృష్టి

అక్బర్ చక్రవర్తికి రోజూ నిద్ర పోయే ముందు తన వేళ్లకున్న ఉంగరాలు తీసి, పక్కనున్న బల్ల మీద ఉంచి తెల్లారిన తరువాత మరలా వాటిని తీసి అలంకరించుకోవడం అలవాటుగా ఉండేది.

ఒక రోజు ఉదయం చక్రవర్తి నిద్ర లేచి చూసేసరికి ఆయనకు ఎంతో ఇష్టమైన ఒక ఉంగరం మాయమైపోయింది. చుట్టుపక్కల ఎంత వెతికినా కనిపించలేదు. రాజుగారి పడకగది లోనుంచే ఉంగరం కనిపించకుండా పోయిందంటే, అది ఖచ్చితంగా ఎవరో రాజు గారికి దగ్గరగా మసలుకునే సేవకులే దొంగిలించి ఉంటారు అనుకున్నారు అందరూ. ఏం చేయాలో తెలియకచక్రవర్తి వెంటనే బీర్బల్‌కి కబురు పంపాడు. బీర్బల్ వస్తూ తనతో పాటు ఒక చిలుకను తీసుకువచ్చి, మహారాజా.. ఈ చిలుక దొంగ ఎవరో కనిపెట్టగలదు అన్నాడు. దానికి చక్రవర్తి ఈ చిలుక జ్యోతిష్యం కోసమా నేను నిన్ను పిలిపించింది? అని కోపంగా అడిగాడు. దానికి బీర్బల్ 'లేదు మహారాజా ఈ చిలుకకు దివ్యదృష్టి ఉంది ఇది ఉంగరం తీసిన మనిషిని చూడగానే గుర్తు పట్టి దొంగ అని అరుస్తుంది. అన్నాడుఅది విన్న చక్రవర్తి సరే అయితే ఈ చిలుక నా ఉంగరాన్ని దొరికేలా చేస్తే దానికినీకు మంచి బహుమానాలు ఇస్తాను అన్నాడు.

కాసేపటి తర్వాత అక్కడ పనిచేసే ఉద్యోగులు అందరినీ పిలిపించి గది తలుపులు మూయించమని అడిగాడు బీర్బల్. చక్రవర్తి అలాగే ఆజ్ఞ ఇచ్చాడు. అందరూ వచ్చిన కొంత సేపటికి చిలుక బీర్బల్ దగ్గరనుండి గాలిలోకి ఎగిరి, దొంగ దొంగ అని అరిచింది అక్కడున్న పనివారిలో ఒకరు రాజు కంట పడకుండా తప్పించుకుపోవడానికి ప్రయత్నిస్తున్నాడు. అతన్ని చూపించి, బీర్బల్ ఇదిగో మహారాజా మీ ఉంగరం తీసుకున్న దొంగ అని అతన్ని పట్టించాడు అది విన్న చక్రవర్తి 'ఇపుడు చెప్పు ఈ చిలుకకు దివ్యదృష్టి ఎలా వచ్చింది? దొంగను ఎలా గుర్తు పట్టగలిగింది?' అని అడిగాడు. దానికి బీర్బల్ "దివ్య దృష్టీ లేదు మరేమీ లేదు మహారాజా దీనికి దొంగ దొంగ అనే ఒక్క మాటే నేర్పాను. దీన్ని నా చేతి మీద కూర్చున్నపుడు నిమురుతూ నెమ్మదిగా గిల్లాను.అది అలవాటుగా లేచి దొంగ అని అరచింది. ఆ మాట వినగానే ఎవరైతే ఉలిక్కిపడి సర్దుకోవడానికి, పారిపోవడానికి ప్రయత్నిస్తారో వారే దొంగ కదా అలా మీ దొంగను పట్టుకున్నాం అన్నమాట' అని చెప్పాడు. బీర్బల్ హాస్య చతురతకు నవ్వుకున్నా, అతని యుక్తిని మెచ్చుకుని, ముందు వాగ్దానం చేసిన ప్రకారం మంచి బహుమతులు ఇచ్చి పంపాడు చక్రవర్తి.



7 తేడాలు గుర్తించండి

కుక్కలు, పిల్లులు ఎన్ని ఉన్నాయి?



సరైన నీడ ఏది





దారి కనుక్కోండి

డైలీ సుడోకు - 392

	6	4			5
3				4	
	5				1
2			4	1	

సుడోకు - 391 సమాధానం

3	8	6	2	9	4	5	7	1
2	1	7	8	6	5	3	4	9
4	5	9	7	1	3	8	2	6
6	7	5	1	3	9	2	8	4
1	3	8	6	4	2	9	5	7
9	4	2	5	8	7	1	6	3
5	9	4	3	7	8	6	1	2
7	2	1	9	5	6	4	3	8
8	6	3	4	2	1	7	9	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.